TV3 CHANNEL
WWW.ninadam.co.in
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
గురువారం, మార్చి 27, 2025 | సంపుటి - 21 | సంచిక 190 | వెల - 7 | పేజీలు -12 + 8
Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల నిషేదానికి సిట్

- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చట్టసవరణకు బిల్లు
- ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం
- శాంతిభద్రతలపై కొందరు అడ్డగోలు వ్యాఖ్యలు
- అసెంబ్లీలో సిఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల నిషేధానికి సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల యాప్స్ వల్ల జరుగుతున్న అనర్థాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు తాము అధికా ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. అందుకే తమ ఏడాదికి పైగా పాలనలో ఎలాంటి ఘటనలు లేవని చెప్పారు.





**జూదాల పట్ల కఠినంగా ఉండాలని అనుకుంటున్నామని అన్నారు. ఆన్ లైన్ బెట్టింగ్ పట్ల రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడిరచారు. విమర్శల జోలికి పోను.. ఆన్‌లైన్ రమ్మి.. బెట్టింగులపై కఠినంగా ఉంటామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. వచ్చే సమావేశాల్లో ఆలనైన్ బెట్టింగులుపై చట్ట సవరణ చేస్తామన్నారు. గుట్కా నిషేధిత పదార్థాలు మార్కెట్లో కి వచ్చాయి. వీటిపై కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు.**

హైదరాబాద్,మార్చి26(నినాదం):

ఈ మేరకు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వీటిని నిరోధించడానికి స్పెషల్ ఇన్వేస్టిగేషన్ టీం సిట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. బెట్టింగ్ యాప్, ఆన్‌లైన్ గేమ్‌ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. మన పరిధిలో విచారణ జరిపిస్తే సమస్యకు సరైన పరిష్కారం దొరకదన్నారు. ఈ కేసులో శిక్షపడేలా ప్రత్యేక చట్టం చేస్తామని కూడా అన్నారు. బెట్టింగ్ యాప్ ల వల్ల ఎంతోమంది బలైపోతున్నారని సీఎం రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నేరం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతోందన్నారు. గుట్కా నిషేదం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. తరువాయి2లో

### బీఆర్ఎస్ బాటలో మేం నడవడం లేదు..

2లో..

- ఉప ఎన్నికల ప్రచారంపై సీఎం ఘాటు వ్యాఖ్యలు
- అసెంబ్లీలో బీఆర్ఎస్, ఎంఐఎం ఆందోళన




### 14 ఏళ్లలో 81శాతం తగ్గిన నక్సల్స్ హింస

న్యూఢిల్లీ, నినాదం:

గడచిన 14 ఏళ్లలో దేశంలో నక్సల్ హింస 81 శాతం తగ్గిందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ బుధవారం రాజ్యసభకు తెలిపింది. 2010 నుండి 1,936 సంఘటనలతో గరిష్టస్థాయిలో ఉందని హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంది. 2లో

### వందశాతం రాయితీతో రూ. 50 వేల యూనిట్లు

తెలంగాణలో నిరుద్యోగులకు వరంగా యువ వికాసం




హైదరాబాద్, నినాదం:

తెలంగాణ రాష్ట్రంలో యువ వికాసం పథకం నిరుద్యోగులకు వరంగా మారింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు ప్రత్యేకంగా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం సహాయం చే యడానికి ప్రభుత్వం వివిధ చర్యలను అమలు చేస్తోంది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ జనాభా ప్రాతిపదికన యూనిట్లు ఖరారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తరువాయి2లో



అసెంబ్లీలో వాడీవేడిగా మాటల యుద్ధం

## కేటీఆర్ వర్సెస్ భట్టి

కమీషన్ లేనిదే పనులు కావడం లేదంటూ కేటీఆర్ ఆరోపణలు

నిరూపించకపోతే.. క్షమాపణలు చెప్పాలని భట్టి డిమాండ్

హైదరాబాద్, నినాదం:

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగింది. పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ అసెంబ్లీ వేదికగా కేటీఆర్ కామెంట్ చేశారు. అయితే.. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల భట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాయి2లో



### కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

హైదరాబాద్, నినాదం:

పది పరీక్షలో మాస్ కాపీయింగ్ నిందితులతో మున్సిపల్ చైర్మన్‌కు సంబంధాలు ఉన్నాయంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు. దీంతో కేటీఆర్ ట్వీట్‌పై నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రజిత, శ్రీనివాస్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమపై తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదు అయ్యాయి.

2

### నీటి, కరెంట్ కష్టాల్లో అల్లాడుతున్న తెలంగాణ : కేటీఆర్

## తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్

- శాంతిభద్రతల విషయంలో రాజీలేదు
- గత బిఆర్ఎస్ ప్రభుత్వం లాగా వ్యవహరించడం లేదు
- శాంతిభద్రతలపై చర్చలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

### భూభారతి కాదు.. భూహారతి అన్న పల్లా

- ధరణి పేరుతో బిఆర్ఎస్ దగా చేసింది
- అందుకే ధరణిని బంగాళాఖాతంలోకి విసిరాం
- పల్లా వ్యాఖ్యలకు భట్టి ఘాటు సమాధానం
- వచ్చే ఎన్నికల్లో ధరణితో వెళ్లాలని పొంగులేటి సవాల్

2





భద్రాచలంలో కుప్పకూలిన

## ఆరంతస్తుల భవనం

- ఇద్దరు మృతి.. పలువురికి గాయాలు
- శిథిలాలు తొలగిస్తే.. మృతుల సంఖ్యపై స్పష్టత
- నాసిరకం నిర్మాణం కారణంగానే కూలిందన్న వాదన

భద్రాచలం, (నినాదం):

భద్రాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. భద్రాచలం పంచాయతీ ఆఫీసు దగ్గర నిర్మాణంలో ఉన్న ఓ ఆరంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. భవనంలో పని చేస్తున్న కార్మికుల్లో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది.. ప్రమాదస్థలికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. జేసీబీలతో శిథిలాలను తొలగిస్తున్నారు. మృతదేహాలను వెలికితీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. తరువాయి2లో



ఏప్రిల్ నెలాఖరులో ఇంటర్

### పరీక్షా ఫలితాలు

హైదరాబాద్, నినాదం:

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల పరీక్షలు మంగళవారం (మార్చి 25)తో ముగిశాయి. ప్రధాన సబ్జెక్టు పరీక్షలు మార్చి 20వ తేదీతో ముగిసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే జవాబుపత్రాల మూల్యాంకనం కూడా ప్రారంభమైంది. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభమవగా మార్చి 25తో అన్ని పరీక్షలు ముగిశాయి. తరువాయి2లో

ఇసుక అక్రమ రవాణాపై

## దొంగతనం కేసులు

ఇసుక మాఫియాకు అధికారుల వార్నింగ్

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై దొంగతనం కేసులు నమోదు చేస్తామని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. పట్టుబడిన వాహనాల డ్రైవర్లు, యజమానులపై కూడా కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.




2లో

### ప్రేమించి.. నమ్మించి.. మోసం..

అప్సర హత్యకేసులో పూజారి సాయికృష్ణకు జీవితఖైదు






4లో..

## త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ ప్రచారం

- పట్టు పెంచుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు యత్నాలు
- మండుటెండల్లో రాజకీయ నేతలకు పరీక్ష

### తెలంగాణలో ఎన్నికల వేడి

ఇప్పటి నుంచే పట్టుపెంచు కునేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్ఠానాలు రాబోయే ఎన్నికలపై ప్రత్యేక దృష్టిపెట్టాయి. మరోవైపు ఎండలతో కార్యకర్తలు వాపోతున్నారు. వేసవిని తలచుకుంటేనే భయం వేస్తోందని అంటున్నారు.



# బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి సిట్

బెట్టింగ్ యాప్ ప్రమోషన్ చేసిన వాళ్లను విచారిస్తే సరిపోదు.. బెట్టింగ్ యాప్ నిర్వాహకులపై కూడా కఠిన చర్యలు ఉండాలన్నారు. మమ్మల్ని చంపుతారని కోర్టులో పిటిషన్ వేసినా వామనర్ రావు దంపతుల ప్రాణాలు దక్క లేదన్నారు. వామన్ రావు హత్య ఆరోపణలు ఎదుర్కొన్న వాళ్లను తప్పించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. గంజాయి మత్తులో సింగరేణి కాలనీలో ఆరేళ్ళ చిన్నారిని దారుణంగా హత్య చేశారని చెప్పారు. శాంతి భద్రతలపై కొందరు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని సిఎం మండిప డ్డారు. పెట్టుబడుదారులకు రక్షణ కల్పించినప్పుడే పెట్టుబడులొస్తాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధిపై యాసిడ్ దాడులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రం దివాళా తీస్తేనే మంచిదనేటట్లు కొంతమంది వ్యవహరిస్తున్నారని విమ ర్శించారు. తాము వచ్చిన తర్వాత ఏక్కడైన గొడవలు జరిగాయా? అని రేవంత్ ప్రశ్నించారు.

ఇప్పటికే బెట్టింగ్ యాప్స్ ప్రచారం చేసే వారిని పిలిచి విచారిస్తున్నాము. దానితో పరిష్కారం కాదు. బెట్టింగ్ యాప్స్ నిర్వహిస్తున్న వారు.. బాధ్యులను కూడా విచారిం చాలన్నారు. దీనికోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీ–ం వేస్తున్నాం. ప్రకటనలు చేసినా.. నిర్వహణలో భాగస్వామ్యం ఉన్న.. కఠినంగా వ్యవహారం ఉంటుందని సభలో సిఎం రేవంత్ ప్రకటించారు. నేరాలు చెప్పి జరగవు. నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటుంది ప్రభుత్వం. న్యాయవాదుల హత్య.. వెటర్నరీ డాక్టర్ హత్యలు గతంలో చూశాం. నడి బజారులో న్యాయవాదులను చంపిన వారిపై సీబీఐ విచారణకి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సుప్రీం కోర్టుకు చెప్పినట్లు వెల్లడిరచారు. ఆరేళ్ల అమ్మాయిని సైదాబాద్ లో చంపితే అనాడు సర్కార్ పట్టిం చుకోలేదు. జూబ్లీహిల్స్ లో మైనర్ బాలిక రేప్ కేసు.. దాంట్లో బీఆర్ఎస్ నాయకుడు ముద్దాయి. మాజీమంత్రి కొడుకుపై ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి ఘటనల్లోని బాధితుల పట్ల సానుభూతితో ఉండాలి. కానీ ప్రతిపక్షం.. ప్రభుత్వమే చేయిస్తుంది అన్నట్టు మాట్లాడు తున్నారు అని సీఎం రేవంత్ మండిపడ్డారు. గతంలో జానారెడ్డి.. విపక్ష నేతగా ప్రభుత్వానికి సహకరించారు. జానారెడ్డి నెలకొ ల్పిన సంప్రదాయాన్ని ఎందుకని కొనసాగించరని అన్నారు. ఎన్నికలు ఎప్పుడో 2029లో వస్తాయి.. మీరు కోరుకున్నంతమాత్రాన ఇప్పుడే రావు. భారాస ముఖ్యనే తలు ఇద్దరు పోటీపడి మరీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ ఇద్దరి పోటీతో మాకు తలనొప్పి వస్తోంది. నేను పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉంటాను. గజ్వేల్ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చినా మనస్ఫూర్తిగా సహ కరిస్తాను. పద్మారావు వచ్చారు.. కొన్ని నియోజకవర్గ పనులు అడిగారు. అక్కడికక్కడే ఇచ్చేశా. విపక్ష ఎమ్మెల్యేలు వచ్చినా పనులు చేసి పెడుతున్నాను అని సీఎం పేర్కొన్నారు.మాకు తరతమ భేదాలు లేవని, పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తామని అన్నారు.

బీఆర్ఎస్ బాటలో

## మేం నడవడం లేదు..

తెలంగాణ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. పార్టీ ఫిరాయింపులపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు వ్యవహారం సుప్రీంకోర్టులో ఉందని.. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా మాట్లాడు తారని ప్రతిపక్ష బీఆర్ఎస్, ఎంఐఎం సభలో ఆందో ళనకు దిగాయి. స్పీకర్ పోడియం ఎదుట బీఆర్ఎస్, ఎంఐఎం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు మాట్లాడుతూ.. కోర్టు పరిధిలో ఉన్న ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంపై సీఎం సభలో ఎలా మాట్లాడు తారని ప్రశ్నించారు. వెంటనే కలగజేసుకున్న మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపక్షాల నిరసనలను తీవ్రంగా ఖండి రచారు. సీఎం మాట్లాడిన దాంట్లో తప్పేమి లేదని.. ఉప ఎన్నికలు వస్తాయని బయట బీఆర్ఎస్ నాయకులు చేస్తోన్న బెదిరింపుల గురించి మాత్రమే మాట్లారని శ్రీధర్ బాబు స్పష్టత ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్లో కూడా ఇలాంటి అంశంపై చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. జ్యుడిషియరిని విమర్శించే హక్కు పార్లమెంట్‌లో కూడా ఉంటుందని అన్నారు. మంత్రుల వివరణతో సంతృప్తి చెందని బీఆర్ఎస్, ఎంఐఎం ఎమ్మెల్యేలు నిరసన కొనసాగించారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది.




# వందశాతం రాయితీతో రూ. 50 వేల యూనిట్లు

ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను కలెక్టర్లు మండలాలు, సంక్షేమ వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లు మంజూరు చేయనున్నారు. రూ.50 వేల విలువైన యూనిట్లకు 100 శాతం రాయితీ కల్పిస్తారు. ఈ పథకం విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా అర్హులైన యువత దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విధివిధానాలు ఇలా ఉన్నాయి. కుటుంబం నుంచి ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. మొత్తం యూనిట్లలో 25 శాతం మహిళలకు.. దీనిలో వితంతు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు ఉంటాయి. తెలంగాణ ఉద్యమం, ఎస్సీ వర్గీకరణ పోరాటంలో పాల్గొన్నవారికి.. స్వయం ఉపాధిలో నైపుణ్యం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తు ఫారమ్‌ను పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసి.. సంబంధిత పత్రాలను జతచేసి మున్సిపల్ కమిష నర్లు, జోనల్ కమిషనర్లు, ఎంపీడీవో కార్యాలయాల్లో అందజేయాలి. ఇటువంటి పథకాల ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు కల్పించబడతాయి. గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షల రూపాయల కుటుంబ ఆదాయం, పట్టణాల్లో 2 లక్షల రూపాయల ఆదాయం ఉన్న వారు ఈ పథకంలో భాగస్వామి కావచ్చు. దరఖాస్తు చేయడానికి అభ్యర్థులు కొన్ని ముఖ్యమైన పత్రాలు జతచేయాలి. వాటిలో రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం అందజేయాలి. ఎంపికైన వారికి 15 రోజుల పాట ఓరియంటేషన్ తరగ తులు నిర్వహిస్తారు. ఆ తర్వాత యూనిట్లను మంజూరు చేసి.. అవసరం అయిన వారికి సహాయం చేస్తారు. ఇక యూనిట్ గ్రౌండ్ చేసిన వారికి ఆరు నెలల నుంచి ఏడాది వరకు నిపుణుల ఆధ్వర్యంలో సాంకేతిక శిక్షణ ఇస్తారు. వ్యవసాయం కాకుండా ఇతర పథకాలకు దరఖాస్తు చేసిన వారి వయస్సు 21 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి. వ్యవసాయ పథకాలకు అయితే 21 నుంచి 60 ఏళ్ల మధ్య ఉన్న వారు అర్హులు. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఏప్రిల్ 5 చివరి తేదీగా నిర్ణయించారు. తర్వాత ఏప్రిల్ 6 నుంచి 20 వరకు మండలస్థాయి కమిటీల ద్వారా అర్హులను ఎంపిక చేస్తారు. జూన్ 2 తర్వాత అర్హులకు మంజూరు పత్రాలు జారీ చేస్తారు.

# భూభారతిపై వాడీవేడి చర్చ

**భూభారతి కాదు..భూహారతి అన్న పల్లా**
**ధరణి పేరుతో బిఆర్ఎస్ దగా చేసింది**
**అందుకే ధరణిని బంగాళాఖాతంలోకి విసిరాం**
**పల్లా వ్యాఖ్యలకు భట్టి ఘాటు సమాధానం**
**వచ్చే ఎన్నికల్లో ధరణితో వెళ్లాలని పొంగులేటి సవాల్**

హైదరాబాద్ :

తెలంగాణ అసెంబ్లీలో 'భూ భారతి'పై వాడీవేడి చర్చ జరిగింది. భూభారతిపై అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం జరిగింది.. ధరణిలో వివరాల ఆధా రంగానే ఇప్పటికీ పథకాలు అమలు చేస్తున్నారని.. ఇది భూభారతి కాదు భూహారతి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. విపక్ష బిఆర్ఎస్ ఆరోపణలను అధికార పక్షం ఘాటుగా తిప్పికొట్టింది. ధరణి పేరుతో ప్రజల భూములను లాక్కున్న దుర్మార్గాలను అడ్డుకున్నామని తెలిపింది. బిఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క కలం పోటుతో భూమిపై హక్కులు లేకుండా చేసిన దుర్మార్గమైన చట్టం ధరణి అని భట్టి విక్రమార్క అన్నారు. ఆ చట్టాన్ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పామని.. అలానే చేశామని చెప్పారు. ధరణిపై ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతకుముందు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది భూ భారతి కాదని.. భూ హారతి అని ఆరోపించారు. జమాబందీ పేరుతో ప్రభుత్వం మరో దుకాణం తెరిచిందని విమర్శిం చారు. ఇప్పుడు జమాబందీ ఎందుకో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఆరోపణలపై భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి సత్యదూ రమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. దున్నేవాడిదే భూమి అనేది సాయుధ పోరాట స్ఫూర్తితోనే కాంగ్రెస్ ప్రభుత్వం భూములపై హక్కులు కల్పించిదన్నారు. కానీ బిఆర్ఎస్ ధరణిపేరుతో సామాన్యుల భూములను కాజేసిందని అన్నారు. వారికి భూమిపై హక్కులు లేకుండా చేసేందుకు ధరణిని తీసుకుని వచ్చారని, ఎందరో భూములు మాయమయ్యాయని అన్నారు. అందుకే ధరణిని బంగాళాఖాతం లో వేస్తామని చెప్పాం.. వేసి చూపామని అన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా 'భూ భారతి' పేరిట కొత్త చట్టం తీసుకొొచ్చి ప్రజలకు రక్షణ కల్పించామని అన్నారు. ధరణిని బంగాళాఖాతంలో వేయాలనే ప్రజలకు మాకు అధికారం కట్టబెట్టారని భట్టి విక్రమార్క అన్నారు. ఈ క్రమంలో పల్లా వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ధరణి వద్దని ఓటుతో ప్రజలు తీర్పునిచ్చారని అన్నారు. అన్ని వర్గాలతో చర్చించాకే భూభారతి తెచ్చామని అన్నారు. భూభారతి కాన్సెప్ట్ తో ఈసారి ఎన్నికలకు వెళ్తామని.. ధరణి కాన్సెప్ట్ తో బీఆర్ఎస్ నేతలు ఎన్నికలకు రాగలరా అంటూ మంత్రి పొంగులేటి సవాల్ విసిరారు. ప్రజలు ఎవరికి మద్దతు ఇస్తారో చూద్దామని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. వీఆర్ఏ వ్యవస్థను మళ్ళీ తీసుకొస్తామని.. వీఆర్ఏలు కావాలని ప్రజలు అడుగుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు కట్టుకథలు చెబుతున్నారని మండిప డ్డారు పొంగులేటి. అసత్యాన్ని సత్యం చేసేందుకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. భారాస ప్రభుత్వం తప్పు చేసింది కాబట్టే ఆ పార్టీని ఓడిరచారు. వీఆర్ఏ, వీఆర్వోలపై గత ప్రభుత్వం ఏవిధంగా ప్రేమ చూపించిందో అందరికీ తెలుసు. వాళ్లకు ప్రత్యేకమైన గౌరవం ఇస్తాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం అని పొంగులేటి చెప్పారు. పేదలకు మేము ఇందిరమ్మ ఇండ్ల ఇస్తున్నాం.. వాళ్ళ మాదిరిగా మేము పార్టీల కార్యకర్తలు ఇవ్వం అని తెలిపారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ఇక, ఇందిరమ్మ కమిటీ ఛైర్మన్ సర్పంచ్.. మీలాగా బీఆర్ఎస్ నాయకులను పెట్టలేదు.. సభను పదే పదే తప్పుదోవ పట్టిస్తున్నారు అని మంత్రి పొంగులేటి తీవ్రంగా మండిపడ్డారు.

# తెలంగాణలో ఫ్రెండ్లీ పోలీసింగ్

**హైదరాబాద్, నినాదం:**

శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. శాంతి భద్రతలు కాపా డేందుకు చాలా మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మతపరమైన ఉద్రిక్త పరిస్థితులకు తెలంగాణలో అవకాశం లేదని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బుధవారం శాంతి భద్రతలపై చర్చ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ పోలీసులు రూ.185 కోట్లు బాధితులకు వాపస్ ఇచ్చారు.. ఇంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ రికవరీ చేయలేదని తెలిపారు. ఆనాడు కేసులను నమోదు చేయకుండా బాధితులను భయపెట్టించారు.. కానీ ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఏంటో మేం చేతల్లో చూపించామని అన్నారు. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మిస్తున్నామని.. రంగారెడ్డి జిల్లా మంచిరేవులో ఈ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీసుల పిల్లలకు విద్యను అందిస్తామని చెప్పారు. ఇప్పుడు తెలంగాణ పోలీసులు స్వేచ్ఛగా కేసులు నమోదు చేస్తున్నా రని.. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతల చెప్తేనే కేసులు నమోదయ్యాయని ఆరోపించారు. మంథనిలో అడ్వకేట్ దంపతుల మర్డర్ జరిగితే.. ఈ ఘటనలో పోలీసులు ఎలా వ్యవహరించిన తీరు అందరి చూశారని విమర్శించారు. ప్రతి పోలీస్ స్టేషన్లో ఇప్పుడు క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశామని చెప్పారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన టీజీ న్యాబ్‌ను మరింత బలోపేతం చేసేందుకు కొత్త పోస్టులు మంజూరు చేశామని తెలిపారు. టెక్నాలజీని ఉపయోగించుకుని పోలీసులు కేసులు వేగంగా పరిష్కరిస్తున్నారని కొనియాడారు. సైబర్ నేరాలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నామని.. సైబర్ సెక్యూరిటీ యావత్ దేశం సమస్య అని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని.. ఏఐ బేస్డ్ ట్రాఫిక్ మానిటరింగ్ చేయాలని నిర్ణయించామని తెలిపారు. ట్రాఫిక్‌కు సంబంధించి అదనపు సిబ్బందిని నియమించామని గూగుల్ మ్యాప్ ఉపయోగించుకుని ట్రాఫిక్ నియంత్రణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఇతర మెట్రో సిటీలతో పోల్చితే.. మన ట్రాఫిక్ నియంత్రణ బాగుందని అన్నారు. షీ టీమ్స్, భరోసా కేంద్రాలను మరింత పటిష్టం చేస్తున్నామని అన్నారు.


# అసెంబ్లీలో వాడీవేడిగా మాటల యుద్ధం

కేటీఆర్ వర్సెస్ భట్టి

30శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు నిరూపించాలంటూ కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు. నిరూపించలేకపోతే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ భట్టి హెచ్చరించారు. దోచుకుంది మీరు.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది మీరే అంటూ బీఆర్ఎస్ నేతలపై భట్టి మండిపడ్డారు. కాగా.. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యుల ఆందోళన నేపథ్యంలో.. కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు. ధరణి, భూ భారతిపై కూడా తెలంగాణ అసెంబ్లీలో రచ్చ జరిగింది. ధరణిపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇంకా అదే చట్టాన్ని అమలు చేస్తున్నారు. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ పథకాల అమలు జరుగుతుందని.. పైగా ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతిలో అనేక లోపాలు ఉన్నాయన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. ఈ వ్యాఖ్యల పట్ల అధికార పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ధరణి ఓ దుర్మార్గమైన చట్టమంటూ డిప్యూటీ సీఎం భట్టి మండిపడ్డారు. పార్ట్–బీ పేరుతో భూములు దోచుకున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉద్యమాలతో వచ్చిన చట్టాలను ఒక్క కలంపోటుతో వెనక్కు తీసుకెళ్లారు. ధరణిని బంగాళాఖాతంలో కలుపు తామని ఎన్నికల్లో చెప్పాం .. చెప్పినట్టుగానే భూ భారతిని తీసుకొచ్చామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# 14 ఏళ్లలో 81శాతం తగ్గిన నక్సల్స్ హింస

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రారు రాజ్యసభలో మాట్లాడుతూ.. 2024లో నక్సల్ వయెలెన్స్ సంఖ్య 374కి తగ్గిందని అన్నారు. పౌరులు, భద్రతా దళాలు మరణాల సంఖ్య 2010లో 1,005గా ఉంటే.. 2024కి 150కి తగ్గింది. అంటే 85 శాతం తగ్గుదల ఉంది అని ఆయన అన్నారు. కాగా, నక్సల్ హింస కేసులు 2023లో 485, 2022 : 413, 2021 : 361, 2020 : 470, 2010 : 501 నమోదయ్యాయి.




ఏప్రిల్ నెలాఖరులో ఇంటర్

# పరీక్షా ఫలితాలు

తొలుత కొన్ని ప్రశ్నపత్రాల్లో తప్పులు దొర్లడంతో హల్‌చల్ చేసినా ఆ తర్వాత సజావుగానే పరీక్షలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9,96,971 విద్యార్థులు పరీక్షలు ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పరీక్షలు రాశారు. వీరిలో ఫస్టియర్‌లో విద్యార్థులు 4,88,448 మంది, సెకండియర్ విద్యార్థులు 5,08,523 మంది ఉన్నారు. ఇక గతంలో ఫెయిలైన విద్యార్థులు 67,735 మంది కూడా ఈసారి పరీక్షలకు హాజరయ్యారు. మొత్తం 1,532 పరీక్ష కేంద్రాల్లో అక్కడక్కడా కొందరు విద్యార్థులు కాపీ కొడుతూ డీబార్ అయినప్ప టికీ సింహభాగం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఇక ఇంటర్ జవాబుప త్రాల మూల్యాంకనాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 19 సెంటర్లల్లో నిర్వహిస్తు న్నారు. మార్చి 19 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు మూల్యాంకన ప్రక్రియ కొన సాగనుంది. మూల్యాంకనం అనంతరం ఇంటర్ పరీక్షల ఫలితాలను ఏప్రిల్ నెలాఖరులోపు విడుదల చేసే లక్ష్యంతో అధికారులున్నారు. ఏప్రిల్ 29వ తేదీ నుంచి ఈఏపీసెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అందువల్ల ఆ పరీక్ష ప్రారంభానికి కనీసం రెండు మూడు రోజుల ముందుగానే ఫలితాలు వెల్లడిరచా లని ఇంటర్ బోర్డు భావిస్తుంది. అంటే ఏప్రిల్ నాలుగో వారంలో ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉంది. గతేడాది మార్చి 19వ తేదీకి పరీక్షలన్నీ పూర్తికాగా, ఏప్రిల్ 24న ఫలితాలు విడుదల చేశారు. ఈసారి కూడా ఏప్రిల్ చివరి వారంలో ఫలితాలు వెల్లడిరచాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై దొంగతనం కేసులు

**కరీంనగర్, నినాదం:**

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై దొంగతనం కేసులు నమోదు చేస్తామని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. పట్టుబడిన వాహనాల డ్రైవర్లు, యజమానులపై కూడా కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేయొద్దనీ, అలా చేస్తే సంబంధిత భూ యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి, ఇసుక నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గతంలో ఇసుక నిల్వలపై గడ్డి కప్పి ఉంచేవారని, ప్రస్తుతం ఎవరికీ అనుమానం రాకుండా ఇసుకపై ఎర్రమట్టి నింపుతున్నారని చెప్పారు. స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్, క్యూఆర్‌టీ విభాగాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని కోరారు



# ప్రేమించి.. నమ్మించి.. మోసం..

హైదరాబాద్, నినాదం:

సరూర్‌నగర్ అప్సర హత్య కేసులో పూజారి సాయికృష్ణకు జీవత ఖైదు విధించింది రంగారెడ్డి కోర్టు. అప్సరను ప్రేమించి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. మోసం చేశాడు పూజారి. అప్సరతో నాలుగేళ్లపాటు ప్రేమయాణం సాగించాడు. పెళ్లి చేసుకోమని వెంటపడటంతో.. శంషాబాద్ ప్రాంతంలో హత్య చేసి.. మ్యాన్‌హోల్‌లో మృతదేహాన్ని పడేశాడు. ఈ కేసులో రంగారెడ్డి కోర్టు నేడు తీర్పు వెల్లడిరచింది. అతడికి జీవిత ఖైదుతో పాటు.. సాక్ష్యాలను తారుమారు చేసినందుకు అదనంగా మరో ఏడేళ్ల జైలు శిక్షను కూడా విధించింది. వీటితో పాటు.. అప్సర కుటుంబానికి రూ.10 లక్షలు చెల్లించా లని కోర్టు ఆదేశించింది. తమిళనాడుకు చెందిన అప్సర డిగ్రీ పూర్తి చేసింది. నటన, మోడలింగ్‌పై ఆసక్తితో ఆమె పలు తమిళ చిత్రాల్లో నటించింది. సినిమా అవకాశాల కోసం ఆమె 2022 ఏప్రిల్‌లో హైదరాబాద్‌కు వచ్చింది. కాశీలోని తన తండ్రి ఒక ఆశ్రమంలో పనిచేస్తున్నారు. తల్లితో కలిసి ఆమె సూరూర్‌నగర్‌లోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఆమె తల్లి ఒక ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. అప్సర దేవాలయాలకు తరచూ వెళ్తూ ఉండేది. ఆ సమయంలోనే అక్కడ పూజారి సాయికృష్ణతో పరిచయం ఏర్పడిరది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. తనను పెళ్లి చేసుకోవాలని సాయిపై అప్సర ఒత్తిడి తెచ్చింది. పెళ్లి చేసుకుంటే సరి.. లేదంటే ఇద్దరి మధ్య సంబంధాన్ని భయటపెడతానంటూ ఆమె బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. ఈ విషయం భయటపడితే పరువు పోతుందని భావించిన సాయి.. హత్యకు ప్లాన్ చేశాడు. నాలుగు సార్లు హత్యకు ప్లాన్ చేసినా.. వర్కౌట్ కాలేదు. ఐదోసారి 2023 జూన్ 3వ తేదీన .. కోయంబత్తూరు వెళ్తున్నట్లు.. విమాన టికెట్లు కూడా తీసుకున్నానని నమ్మించాడు. దీంతో ఆమె తమ లగేజీతో సహా ప్రయాణానికి సిద్ధం అయింది. ఆమె తల్లికి శంషాబాద్‌లో దించి వస్తానని చెప్పి తన కారులో తీసుకెళ్లాడు. అక్కడ రాత్రి 11 గంటల సమయంలో.. సుల్తాన్‌పల్లిలోని గోశాల వద్దకు వెళ్లారు. అక్కడ కొంతసేపు గడిపారు. అక్కడే అతడు ఆమెకు కంటపడకుండా.. బెల్లం దంచే రాయిని తన కారులో వేశాడు. జూన్ 4 తెల్లవారు జామున.. గోశాల సమీపంలోని నర్కుడలోని ఓ వెంచర్ వద్దకు చేరారు. ఆమె నిద్రలోకి వెళ్లగానే.. కారు సీటు కవర్‌ను ఆమె ముఖంపై వేసి ఊపిరాడకుండా చేశాడు. అప్పటికే తన కారులో ఉంచిన బెల్లం దంచే రాయిని తీసుకొని.. ఆమె తలపై పదిసార్లు బలంగా కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే ఊపిరి వదిలింది. మృతదేహంపై కారు కవర్ కప్పి.. అక్కడే కారును పార్కు చేసి.. ఏమి తెలియకుండా.. ఇంటికి వచ్చేసి రోజూవారీ కార్య కలాపాల్లో నిమగ్నం అయ్యాడు. రెండు రోజుల తర్వాత ఆమె మృతదేహాన్ని కవర్‌లో చుట్టి.. సరూర్‌నగరలోని మైసమ్మ ఆలయ సమీపంలోని మ్యాన్‌హోల్‌లో పడేశాడు. అక్కడ వాసన వస్తున్నట్లు గమనించిన అతడు రెండు ట్రక్కుల ఎర్రమట్టి తెప్పించి.. మ్యాన్‌హోల్‌లో వేయించాడు. అంతేకాదు.. దానిపై కాంక్రీట్ వేసి పకడ్బందీగా మూసేశాడు.

# కుప్పకూలిన ఆరంతస్థుల భవనం



ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఇంటి యజమాని శ్రీపతి శ్రీనివాస్ రావు పారి పోయాడు. ఎలాంటి అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. ఇంటి యజమాని ఆచూకి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న ఆరు అంతస్థుల భవనం ఒక్కసారిగా నేలమట్టం అయ్యింది. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారని అనుమానిస్తున్నారు. వెంటనే పోలీసులు బృందాలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. భవనం కింద చిక్కుకుని పలువురు మృతి చెందినట్లు సమాచారం. భద్రాచలం పట్టణంలోని సూపర్ బజార్ సెంటర్‌లో ఆరంతస్తుల మేర స్లాబ్ నిర్మాణం చేపట్టి వదిలేశారు. ఈ భవనం బుధవారం మధ్యాహ్నం హఠాత్తుగా కుప్పకూలింది. భవనం కూలిపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పాత భవనంపైనే మరో నాలుగు అంతస్తులు నిర్మి స్తుండగా ప్రమాదం జరిగింది. నిర్మాణంలో లోపాల వల్లే ఘటన జరిగి నట్టు అధికారులు భావిస్తున్నారు. నిర్వాహకులు ట్రస్ట్ పేరుతో విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఐటీసీ నుంచి క్రేన్లు, పొక్లెయిన్లు రప్పి స్తున్నారు. కూలిన భవనం పక్కనే ఓ ఆలయం కూడా నిర్మిస్తున్నారు.నా శిరకం నిర్మాణం చేయడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుందని అంటున్నారు. ఓ పాతభవనంపై మరో నాలుగు అంతస్థులు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. గత ఏడాది పంచాయతీ సిబ్బంది నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా నిర్మిస్తారని ప్రశ్నించడంతో అప్పటి నుంచి నిర్మాణం నిలిచిపోయింది. ఒకవేళ భవనం ప్రారంభో త్సవమై భక్తులు ఉండి ఉంటే పెద్దఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేదని ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం పనులు జరుగుతున్న సమయంలో భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే భవన యజమాని భార్య చెబుతున్న ప్రకారం.. ఇద్దరు కూలీలు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే శిథిలాల కింద ఎంతమంది ఉన్నారనేది తొలగింపు తరవాత బయటపడనుంది. నిర్మాణంలో నాణ్యత లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు.

# నీటి, కరెంట్ కష్టాల్లో అల్లాడుతున్న తెలంగాణ : కేటీఆర్

హైదరాబాద్ :

ఒకవైపు నీటి కష్టాలు.. మరోవైపు కరెంట్ కోతలతో రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజాపాలనలో ప్రగతి అధోగతిగా మారిందని తెలిపారు. సాగునీళ్లు ఆగిపోయాయని.. వ్యవసాయం ఆగమైందని పేర్కొన్నారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో పచ్చని పొలాలు మాయమైపోయాయని కేటీఆర్ అన్నారు. పంట చేలు పశువులకు మేతగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో మాయమైన బోరు బం డ్లు.. 15 నెలల కాంగ్రెస్ నిర్లక్ష్య పాలన మూలంగా గ్రామాల్లో సాగునీటి కోసం మళ్లీ బోరు బండ్లు ప్రత్యక్షమయ్యాయని అన్నారు. కేసీఆర్ పాలనలో మిషన్ భగీరథతో ఇంటింటికి అందిన తాగునీళ్లు.. నేడు మళ్లీ తాగునీటి కోసం బోర్లు, బావులు, ట్యాంకర్లను ఆడ బిడ్డలు ఆశ్రయిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. నాడు ఎండాకాలంలో మత్తళ్లు దుంకిన చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు.. నేడు రైతన్నలపై కక్షగట్టిన కాంగ్రెస్ పాలనలో చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు వట్టిపోయాయని, పంటచేలు ఎండుతు న్నాయని అన్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ పాలన తెచ్చిన కరువు అని మండిపడ్డారు.

## కేటీఆర్‌పై నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కాంగ్రెస్ నాయకుడు ఉగ్గడి శ్రీనివాస్ కూడా సోషల్ మీడియాపై ఫిర్యాదు చేశారు. కాగా.. ఈనెల 21న నకిరేకల్‌లో టెన్త్ ఎగ్జామ్ పేపర్ లీకేజ్ ఘటన తీవ్ర కలకలం రేపింది. పరీక్ష ప్రారంభమైన కొద్దిసేపటికే తెలుగు ప్రశ్నాపత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. నల్గొండ జిల్లా నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రంలోని 8వ నెంబర్ గది నుంచి తెలుగు ప్రశ్నాపత్రం లీకైనట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై వేగంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరుగురు నిందితులను అదు పులోకి తీసుకున్నారు. పేపర్ లీకేజీకి బాధ్యులైన చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించగా.. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇన్విజిలేటర్‌ను కూడా సస్పెండ్ చేశారు. అంతే కాకుండా ప్రశ్నపత్రం లీకేజ్ అవడానికి ఓ విద్యార్థిని కారణం అంటూ ఆమెను డిబార్ చేశారు.



# పర్యావరణ విధ్వంసం !

దేశంలో ఎండలు ముదరుతున్నాయి. పట్టణాల్లో ఎండల తీవ్రత తీవ్రంగా ఉంటోంది. గ్రామాల్లోనూ ఎండలు మంటపుట్టిస్తున్నాయి. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో ఇంటిముందున్న చెట్లను నరికి వేస్తున్నారు. కోతుల బెడ నుంచి ఇప్పటికి రక్షణకు కార్యాచరణ కానరావడం లేదు. అడవులను వదిలి అవి గ్రామాల్లో తిష్టవేశాయి. ఇక ప్రజలు మొక్కల పెంపకాన్ని వదిలి చల్లదనం కోసం కూలర్లు, ఎసిలు వాడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఇదే సందర్భంలో కాలుష్యాన్ని కొని తెచ్చకుంటున్నాం. మొక్కలు నాటడం,పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న విష యాలను పక్కన పెట్టారు. ఇదంతా ప్రభుత్వాల పని అన్నట్లుగా ప్రజల భావన ఉంది. అందమైన ఇల్లు కట్టుకుంటున్న వారు సైతం నాలుగు మొక్కలు నాటాలన్న స్పృహ లేకుండా పోతున్నది. మొక్కలు నాటేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఫోటోలకు పోజులిచ్చే కార్యక్రమంగా మారింది. తమ ఇళ్లల్లోనే ఓ మొక్కను నాటి గ్రీన్ ఛాలెంజ్ అంటూ ఇంతకాలం ప్రచారం చేసుకు న్నారు. నిజానికి గ్రీన్ ఛాలెంజ్ అంటే గ్రామాల రూపురేఖలు మారాలి. కానీ అలా జరగడం లేదు. హరితహారంలో 200 కోట్లమొక్కలు నాటామిన ఘనంగా చెప్పిఉకున్న బిఆర్ఎస్ పాలకులు వాటి ఆనవాళ్లు ఎక్కడో చూపితే బాగుండేది. అలా జరిగితే కనీస మార్పు వచ్చి ఉండేది. చంద్రబాబు ఉమ్మడి ఎపిలో ఇలాంటి ప్రచారాలే చేసినా ఎక్కడా మొక్కల జాడలేదు. ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పు కోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరిం చడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు పర్యావరణ విధ్వంసానికి కారణ మవుతున్నాయి. వాగులూవంకల జాడలేకుండా పోయింది. కొండలు, గుట్టలను తవ్వేస్తున్నాం. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగు తున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటిలే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. అంటువ్యాధుల నివా రణకు పరిశుభ్రత ముఖ్యమని హెచ్చరి స్తున్నా ప్రజలు చలించడం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకుంటున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికి వేస్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు పలు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవు తుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగి స్తోంది. ఈ క్రమంలో మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. అకాల వర్షాలు..తట్టుకోలేని ఎండలు..తట్టుకోలేని చలిగాలులు మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పాలకులకు ఇవేవీ పట్టడం లేదు. ఎందుకంటే ఉన్నన్నాళ్లూ పదవి అనుభవించి.. తదుపరి ఏమైతే మాకేంటన్న ధోరణిలో ఉన్నారు. కోట్లాదిమంది చేస్తున్న విధ్వంసం అంటే ప్లాస్టిక్ వాడిపడేం, చెత్తాచెదారం తీసివేయడం వేలల్లో ఉన్న పారిశుద్య సిబ్బందికి సాధ్యం కాదు. కనీసం ఇక్కడైనా ప్రజలను కట్టుబాట్లు పెట్టివుంటే బాగుండేది. ప్రజలు పారిశుధ్య పనులు లాంటివి ఎందుకనో చేయడం లేదు. దీంతో కాలుష్యం మళ్లీ పెరుగుతోంది. ఎక్కడిక్కడ చెత్తకుప్పలు పేరుకు పోతున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో కాలువల్లో అవన్నీ నిండి మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా తయారయ్యింది. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలు కూడా చెత్తను బయటకు విసిరేసి చోద్యం చూస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో కాలం గడిపేస్తున్నారు. చెత్త పేరుకుపోయిందని ..అందుకు ప్రభుత్వానిదే బాధ్యతన్న ట్లుగా దీరాలు తీస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం లాంటి విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా పట్టింపు లేకుండా ఉన్నాయి. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటికాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. పర్యావరణ విధ్వంసం పై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమి, వడగాడ్పులతో ప్రజలు అల్లాడి పోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే..ఎండా కాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపో తోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుం డటంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనిని కనీసం కొంతయినా తగ్గించడానికి కొంతమేరకు అయినా పరిసరాల పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలి. ఇందుకోసం నిరంకుశంగా అయినా ప్రభుత్వాలు ప్రజలను హెచ్చరించాలి. ప్రచండ భానుడి ప్రతా పానికి దేశం అల్లాడుతోందని ఊరుకుంటే ఇకముందు కూడా ఇలాగే ఉంటుంది. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతు న్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తు న్నారు. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నది అలవాటు కావాలి.

# బతుకు నావను ఈదే ధైర్యం ఉండాలి !

కష్టాలను ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలి. జీవితం అంటే వడ్డించిన విస్తరి కాదు. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం వస్తుందో ఊహించడం కష్టం అందువల్ల కష్టాలను తట్టుకుని నిలబడే ఆత్మసథయిర్యం కలిగి ఉండాలి. కుంగిపోతే మనలను ఎవరూ కాపాడలేరు. పదమూడేళ్లు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాత వాసం..బతుకంతా అడవుల పాలు. అయినా సరే పాండవులు బతికారు. అరణ్యవాసంతం తరవాత శ్రీరాముడు చక్కగా రాజ్యం పాలించాడు. అడవుల్లో ఉన్నా, రాజ్యాధికారంలో ఉన్నా ఒకేలా ఉండాలని ఈ రెండు పురాణాలు మనలను గుర్తు చేస్తుంటాయి. ఎవరు ఈ బతుకును వద్దన్నారు? చాకచక్యంగా జీవిత నావను నెట్టుకుపోతే ప్రయాణ దూరం తగ్గిపోతుంది. లక్ష్యం చేరువవు తుంది. అన్నీ ఉన్న వాళ్లు బతుకుతారు. ఏమీ లేనివాళ్లు సైతం బతుకుతారు. కళ్లులేనివారు, కాళ్లులేనివారు కూడా అద్భుతాలు చేస్తున్నారు. సర్వాంగాలతో చక్కటి శరీరం ఇచ్చిన సర్వేశ్వరుడికి మనం ఎంతో రుణపడి ఉండాలి. మరణం గురించి పదేపదే ఆలోచించ నక్కర్లేదు. మరణం బతుకు రహస్యం ముడి విప్పుతుంది. బతుకు జీవనసారం అనుభవంలోకి తెస్తుంది. అప రిష్కృతంగా ఉన్న సమస్యను నల్ల బల్ల మీద నుంచి తుడిచి వేస్తే సమస్య పరిష్కారం కాదు. శోధించి, సాధించాలి. జీవించి చూపించి, సత్యాన్ని సాధించాలి.చెట్లు పైకి ఎదుగుతాయి. నిన్నటి వరకు పాకే పిల్లాడు ఈ రోజు నడుస్తాడు. సన్నటి పాయలుగా పారే నది, ప్రవహించి ప్రవహించి సముద్ర రూపం పొందుతుంది. గొప్పగా బతకడంలోనే బతుకు రహస్యం బోధ పడుతుంది. అప్పుడు బతుకు వృక్షం పచ్చగా ఎదుగుతుంది. మనం వృక్షాలుగా మారితే చిలుకలు వాటంతట అవే వచ్చి వాలుతాయి. కోకిలలు చెట్లను వేదికలు చేసుకుని కచేరీలు చేస్తాయి. బతుకు ఒక పాట. హాయిగా పాడుకోవాలి. బతుకు ఒక ఉత్సవం. ఆనందానికి అర్థం చెప్పాలి. విషాదంగా ఉండటం ఆధ్యాత్మికత అని ఎవరూ చెప్పలేదు. విషాదాన్ని జీవితం నుంచి తరిమికొట్ట డమే దివ్యమైన జీవితం! అజ్ఞానమే బతుకును అవగాహనకు రానివ్వకుండా చేస్తుంది. మొత్తం బతుకంతా బతకడానికే వచ్చింది. ఏదో ఒక పడవ తీసుకుని, ఎవరికి వారే సరంగులై నది దాటి ఒడ్డు చేరుకోవాలి. మరో ప్రయాణం మొదలు పెట్టాలి. ఈ యాత్ర ఆగదు. ఇది బతుకు యాత్ర..

# త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ ప్రచారం

## మండుటెండల్లో రాజకీయ నేతలకు పరీక్ష

ఇప్పటి నుంచే పట్టుపెంచు కునేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపిలు ఎవరికి వారు అంచనాలు వేస్తున్నారు. ఆయా పార్టీల అధిష్టానాలు రాబోయే ఎన్నికలపై ప్రత్యేక దృష్టిపెట్టాయి. మరోవైపు ఎండలతో కార్యకర్తలు వాపో తున్నారు. వేసవిని తలచుకుంటేనే భయం వేస్తోందని అంటున్నారు. మొత్తంగా రాజకీయాపార్టీలు తమాందోళనా కార్యక్రమాలతో ఎండలకు మించి పరీక్ష పెడుతున్నాయి. మళ్లీ పార్టీల హడావిడితో తెలుగు రాష్ట్రాల్లో అప్పుడే ఎన్నికల వేడి మొదలు కానుంది.

హైదరాబాద్ :

**త్వరలోనే స్థానిక ఎన్నికలంటూ ప్రచారం సాగుతోంది. అలాగే మంత్రివర్గ విస్తరణ కూడా జరుగ నుందని ప్రచారం సాగుతోంది. అనేక హామీలను అమలు చేశామని చెప్పు కుంటున్న అధికార కాంగ్రెస్ స్థానిక ఎన్నికలను నిర్వహించేందుకు సమాయత్తం అవుతోంది. మొన్నటి ఫిబ్ర వరిలో అని ఊరించారు. బిసి, ఎస్సీ రిజర్వేలషన్లపై హామీలను నెరవే ర్చామని అంటున్నారు.**

పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడే ఎన్నిక లకు వెళ్లాలని చూస్తోంది. ఇప్పుడు రాజకీయ వాతావరణం తమకు అనుకూలంగా ఉందని అన్ని పార్టీలు భావిస్తున్నాయి. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్న భావనలో బిఆర్ఎస్, బిజెపి నేతలు ఉన్నారు. అందుకే ఏప్రిల్, మేలో స్థానిక ఎన్నికలు వస్తే ఎదుర్కోవడానికి ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేస్తున్నాయి. మండుటెండలు తెలంగాణతో పాటు ఎపిలోనూ వివిధ పార్టీల కార్యకర్త లకు పరీక్ష పెట్టబోన్నాయి. అన్ని పార్టీలు కూడా ఆందోళ నలకు సిద్ధం అవుతున్నాయి. స్థానపిక ఎన్నికలు రాబోతున్న తరుణంలో అందుకు అనుగుణంగా రాజకీయ పార్టీలు సమాయత్తం అవుతున్నాయి. ఇందుకోసంవివిధ కార్యక్రమా లను రూపొందించుకుంటున్నాయి. వచ్చే నెలలో బిఆర్ఎస్ వార్షికోత్సవం ఉంది. అలాగే కెటిఆర్ పాదయాత్రను ప్రకటించారు. కాంగ్రెస్ కూడా ప్రజల్లోకి వెళ్లాలని యోచిస్తోంది. ఎపిలో టిడిపి కూడా అసెంబ్లీ సమావేశాలు ముగియడంతో పలు కార్యక్ర మాలు చేయనుంది. ఈ క్రమంలో పార్టీల్లో ఉన్న కార్యకర్తలంతా ఎండల్లో పడి పోరాడాల్సి ఉంటుంది. ఎండలు ఆందోళనకరంగా పెరు గుతున్న దశలో పార్టీల కార్యక్రమాలుమరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రజలు ఇంటి పట్టున ఉండి దూరంగా ఉందా మనుకున్నా రాజకీయాల కారణంగా బయటకు రాక తప్పని పరిస్థితులు వస్తున్నాయి. వరుస ఆందో ళనతో అధికార పార్టీతో పాటు అనేక పార్టీల కార్యకర్తలు నానాయాతన పడుతున్నారు. మార్చి ఎండలే కదా అని సర్దుకున్నా ఇప్పుడు మండుటెడల్లో ఆందోళనలకు దిగాల్సి వస్తోంది. ఎక్కడ వెనకబడి పోతామో అన్న భయంతో నేతలు కార్యకర్తలను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. దీనికితోడు రేపటి రాజకీయ పోరాటాలకు ఇప్పటి నుంచే అన్ని రాజకీయ పార్టీలు వ్యూహాలు రూపొందిస్తు న్నాయి. అన్ని పార్టీలు మళ్లీ పోటీకి సమాయత్త మవుతున్నాయి. స్థానిక గెలుపు గుర్రాలను బరిలో దించి పాగా వేసేందుకు వ్యూహారచన చేస్తున్నాయి.

సర్పంచ్ ఎన్నికలంటే జిల్లాల్లో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కుతోంది. వామపక్ష నేతలు కూడా మెల్లగా తమ గళాన్ని పెంచారు. ఒకేసారి అన్ని పార్టీలు రోడ్లపైకి వస్తుండ డంతో రాజకీయాలు రసవత్తరంగా మారను న్నాయి. అధికార పార్టీకి ధీటుగానే మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రతిపక్ష పార్టీలైన బిఆర్ఎస్, బీజేపీలు సిద్ధమవుతు న్నాయి. రాష్ట్ర నేతలు, మంత్రులు కావాలనే కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. పోటీగా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు పార్టీల నేతలు రైతులను మోసం చేసాయని బిజెపి నేతలు ఆరోపిస్తున్నారు. మరిన్ని కార్యక్రమా లను నిర్వహించేందుకు ఏర్పాట్లను చేసుకుం టున్నారు. మొత్తంగా అన్ని పార్టీల కార్యకర్తలు రానున్న ఎన్నికలు ఎండలను లెక్క చేయకుండా రోడ్డెక్కాల్సిన ఆగత్యం ఏర్పడింది.



# ప్లాస్టిక్ కాలుష్యంలో మన వాటా ఎంత!

ప్రపంచ పర్యావరణానికి ప్రజారోగ్యానికి ప్లాస్టిక్ తీవ్ర హాని కల్పిస్తుంది.జీవజాతి మనుగడనే ప్రశ్నార్థకంలోకి నెట్టేస్తున్న ప్లాస్టిక్ భూతం,మానవ జీవితాల్లోకి శరవేగంగా చొచ్చుకొస్తుంది. ఇంగ్లాండులోని లీడ్స్ యూనివర్సిటీ పరిశోధకులు గత సంవత్సర అధ్యయనం ప్రకారం ప్రపంచంలో ఏటా 25.1 కోట్ల టన్నుల ప్లాస్టిక్ తయారవుతుంది.ఇలా పుట్టుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ,సమర్థ నిర్వహణకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కంకణబద్ధం కావలసిన సమయం ఆసన్నమైంది.ప్రపంచాన్ని ప్లాస్టిక్ కాలుష్యంతో ముంచి వేయటంలో అనేక దేశాల కంటే మన భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది!.

అని ప్రఖ్యాత నేచర్ జర్నల్ తాజా అధ్యయనం తేల్చింది. ఇలా మన తర్వాత స్థానాల్లో నైజీరియా, ఇండోనేషియా, చైనాలు ఆ పాపాన్ని పంచుకుం టున్నాయని,ఈ అధ్యయనాన్ని నిర్వహించిన లీడ్స్ విశ్వవిద్యాలయం పరిశోధకులు వెల్ల డించారు.మానవాళికే కాకుండా ఇతర జంతు జాలానికీ, పర్యావరణానికి పెనుము ప్పుగా పరిణమిస్తుంది. ఈ పాపంలో మన వాటా ఎక్కువగా ఉన్నందున తగ్గించుకోవ డానికి మనం ఏం చేయాలో ఆలోచించుకో వాల్సిన తరుణమిది.ఈ అధ్యయనం మేరకు ఏటా ఉత్పత్తి అవుతున్న ప్లాస్టిక్ లో 5.2 కోట్ల టన్నులకు పైగా సరైన నిర్వహణ లేక బహిరంగ ప్రదేశాల్లో కాల్చివేయటం లాంటి చర్యల ద్వారా వాతావరణంలో కలిసిపోతుంది.ఇలా అనాలోచి తంగా బహిరంగ ప్రదేశాల్లో ప్లాస్టిక్ ను కాల్చడంతో విషతుల్యమైన కార్బన్ మోనాక్సైడ్ లాంటి వాయువులు గాలిలో కలుస్తున్నాయి. ఇవి గుండె జబ్బులకు, శ్వాసకోశ వ్యాధులకు, క్యాన్సర్ లాంటి ప్రాణాంతకాలకు, నరాల సమస్యలకు దారితీస్తు న్నాయి.అలాగే మితి మీరిన ప్లాస్టిక్ వినియోగంతో మనకు తెలియకుండానే సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు (మైక్రో ప్లాస్టిక్స్) మనల్ని అన్ని వైపులా ఆవహిస్తు న్నాయి. పర్వతాలు, అడవులు,రిజర్వాయర్లు,నదులు, సముద్రాల్లో ఇవి చేరిపోతున్నాయి.ఇలా మనం తినే తిండి నుంచి పీల్చే గాలిలో, తాగే నీటిలోనూ ఉంటున్నాయి.

ప్రతి గంటకు సగటున మనం గాలి ద్వారా 11.3 ప్లాస్టిక్ సూక్ష్మ రేణువులు పీల్చుకునే ప్రమాదంలో ఉన్నాము. అంతే కాకుండా పర్యావరణంలోకి ప్రవేశించే ప్లాస్టిక్ కాలుష్య భూతం అత్యంత ఎత్తైన ఎవరెస్టు నుంచి అత్యంత లోతైన మరియానా ట్రెంచ్ దాకా ప్రతి చోటును ఆవహిస్తోంది. గమ్మత్తేమంటే ప్రపంచంలో అత్యంత అధికంగా ప్లాస్టిక్ ఉత్పత్తి చేసేవి ధనిక దేశాలు.కానీ వాటిలో ఒక్కటి కూడా టాప్ 90 కాలుష్యకారక దేశాల జాబితాలో లేవు. సుమారు 69శాతం ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్యం కేవలం 20 దేశాల నుంచి వస్తోంది.ఇవన్నీ అభివృద్ధి చెందుతున్న,పేద దేశాలే కావడం గమనార్హం!.ధనిక దేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ వాటి నిర్వహణ సమర్థంగా సాగు తుండటమే ఇందుకు కారణంగా అధ్యయనం అభి ప్రాయపడుతుంది.భారత దేశంలో ఏటా 58 లక్షల టన్నుల ప్లాస్టిక్ ను కాలుస్తున్నాం. మరో 35 లక్షల టన్నుల ప్లాస్టిక్కు పర్యావరణంలోకి ( భూమి, నీరు, గాలిలోకి) వ దులుతున్నాం. మొత్తంగా ఏడాదిలో సుమారు 90 లక్షల టన్నులకు పైగా ప్లాస్టిక్ భూతాన్ని ఈప్రపంచం మీదికి వదులుతున్నాం.నైజీరియా(35 లక్షల టన్నులు),ఇండోనేషియా(34 లక్షల టన్నులు), చైనా (28 లక్షల టన్నులు) మన తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ప్రపం చంలోనే మిగిలిన రంగాల మాదిరి గానే ప్లాస్టిక్ కాలుష్యంపై కూడా ధనిక దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన భిన్నంగా ఉంది.ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, నిర్వహణ సరిగ్గా చేయడం ప్రధానమని ధనిక దేశాలు వాదిస్తుండగా.. ప్లాస్టిక్ ఉత్పత్తిని,వినియోగాన్ని తగ్గించి ప్రత్యా మ్నాయాలు వెతకాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు అంటున్నాయి.ఆ మధ్య మన దేశ అత్యున్నత న్యాయస్థానం ఆవేదన వ్యక్తపరచినట్లు.. మనం ప్రస్తుతం ★ప్లాస్టిక్ బాంబుపై★ కూర్చున్నాం!.ఆ మహమ్మారిని కట్టడిచేయడంలో విఫలమైతే అణ్వస్త్రాలను మించిన ముప్పును భావి తరాలు ఎదుర్కోక తప్పదు.ఇంతటి దుర్భర దుస్థితి దాపురించ కూడదంటే? ఎవరికి వారు ప్లాస్టిక్ విని యోగాన్ని వీలైనంత మేరకు తగ్గించాలి.సంబంధిత వ్యర్థాల సద్వినియోగం పట్ల పాలకులు ప్రతి ఒక్కరూ నేను సైతం అంటూ సామాజిక బాధ్యతతో శ్రద్ధ వహించాలి. ప్రపంచాన్ని వణికిస్తున్న ఈ తీవ్రత దృష్ట్యా ప్లాస్టిక్ భూతానికి ముగింపు పలికేం దుకు జరిగిన అంతర్జాతీయ ఒప్పంద రూపకల్ప నకు 170 కి పైగా దేశాలు చర్చలు జరిపాయి.కానీ ఏకాభిప్రాయం కుదరలేదు?.ఆ ఒడంబడిక చిత్తశు ద్ధితో ఎంత త్వరగా సాకారమైతే ప్రపంచ జీవజా తుల,మానవ మనుగడకు అంత మంచిది. ప్రమాద కర ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలపై పరిశోధనలకు చేయూతనివ్వాలి. ప్లాస్టిక్ వ్యర్థాలతో రోడ్ల నిర్మాణం ద్వారా ఖర్చు తగ్గిస్తూనే, నాణ్యతను పెంచవచ్చనే విదేశాల అనుభవాలతో పాఠం నేర్చుకోవాలి.ప్లా స్టిక్ వ్యర్థాలతో డీజిల్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తే, వ్యర్థాలను సంపద సృష్టికి వినియోగించుకో వచ్చు.ఇలా ప్లాస్టిక్ నియంత్రణ నియమాలన్నీ సక్రమంగా అమలయ్యేలా చేస్తూ దాని వాడకం వల్ల కలిగే సమస్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలి.ప్రపంచ,దేశీయ పాలకులు,పాలితులు చిత్తశుద్ధితో కంకణ బద్ధులైతేనే మెరుగైన ఫలితాలు సాధ్యమవు తాయి. అంతే కాదు సాధ్యమైన మేరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరం గంగా పారేయకుండా సరియైన నిర్వహణకు అంద జేయటం ప్రతి ఒక్కరి బాధ్యత.ఇలా భావితరాల నెత్తిన ప్లాస్టిక్ బాంబు నుండి ప్రభుత్వాలు రక్షణ కల్పించడానికి ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ,సమర్థ నిర్వహణకు ప్రభుత్వాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యం వీడి చిత్త శుద్ధితో శీఘ్రమే కంకణ బద్ధం కావలసిన తరుణ మిది. పొంచి ఉన్న ప్రమాదాన్ని గ్రహించి అవగా హన, చైతన్యం పెంచుకొని ప్రజలు కూడా మేము సైతం అంటూ బాధ్యతగా వ్యవహరించాల్సిందే..



- మేకిరి దామోదర్,
సోషల్ అనలిస్ట్, వరంగల్,
ఫోన్:9573666650

# ఉపాధి కూలీలకు అండ.. పని క్షేత్రాల్లో రక్షణ చర్యలు

నిజామాబాద్: వేసవి నిబంధనలతో ఉపాధిహామీ పనులను చేపడు తున్నారు. పూర్తి రక్షణ చర్యలతో పనులకు హాజరయ్యేలా డీఆర్‌డీవో అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. మరోవైపు ఎండల ప్రభావం అధికంగా ఉండడంతో కూలీలు పనిచేసే ప్రాంతాల్లో వసతులు కల్పిస్తున్నారు. నీడతో పాటు మంచినీటి సదుపాయం కల్పి స్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామసభల్లో గుర్తించిన పనులను చేపడుతూ స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా నీటిగుంటలు, ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం, కందకాలు, చెక్‌డ్యాం కాలువల్లో పూడికతీత పనులు ఊటకుంటలు, టేకు నర్సరీలు, కిచెన్ షెడ్‌లు, గడ్డి పెంపకం, పశువుల నీటి తొట్టెలు, పండ్లతోటల పెంపకం, డంపిగ్‌యార్డులు, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి నిల్వలకు సంబంధిం చిన పనులు, ప్రభుత్వ పాఠశాలలో వంటశాలల నిర్మాణాలను చేపడు తారు.కూలీల సంఖ్యను మరింత పెంచేందుకు ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కూలీలకు పనిరోజులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం అధికారులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ పనులను పర్య వేక్షిస్తాయి. జూన్‌నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంలో కేంద్రం ప్రవే శపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఎంతగానో ఉప యోగపడుతోంది. వేసవిలో గ్రామాల్లోని పేదలు వ్యవసాయ కూలీలు పనులు లేకపోవడంతో ఎక్కువ మంది ఉపాధిహామీ పనులపై ఆధా రపడుతున్నారు.

## జెడ్పీటీసీ ఖాళీల భర్తీ తరువాతే ఎన్నిక

- కడప జెడ్పీటీసీపై హైకోర్టులో పిటిషన్



**అమరావతి, మార్చి26(నినాదం న్యూస్):** ఉమ్మడి కడప జిల్లా.. జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక వివాదం ఇప్పుడు హైకోర్టు వరకు చేరింది.. జడ్పీ చైర్మన్ ఎన్నికను వాయిదా వేయాలంటూ గోపవరం జడ్పీటీసీ జయరాం రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కడప జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ నెల 27న జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. ఖాళీగా ఉన్న 2 స్థానాలకు ఎన్నికలు జరపకుండా చైర్మన్ ఎన్నిక జరపడం వల్ల తాను నష్టపోతున్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తాను జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికలలో పోటీ చేయనున్నానని.. ఖాళీగా ఉన్న స్థానాలకు ఎన్నికలు జరగకపోవడం వల్ల తనకు నష్టం జరుగుతున్నట్లు- ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఖాళీగా ఉన్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాల ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకుండా, జడ్పీ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వడంపై ఆయన సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.. జడ్పీ చైర్మన్ ఎన్నికపై ఎన్నికల సంఘం ఇచ్చిన నోటిఫికేషన్ ను వాయిదా వేయాలని అందులో పేర్కొన్నారు. టీ-డీపీ జడ్పీ చైర్మన్ రేస్ లో లేదని అంటూనే మరో ప్రక్క టీ-డీపీ జడ్పీటీసీ జయరాం రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయడంపై మరోమారు ఉత్కంఠ నెలకొంది. అయితే, టీడీపీ జడ్పీటీసీ జయరాం రెడ్డి వేసిన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరగనుంది..

## తిరుమల విద్యాదాన ట్రస్టుకు విరాళం



**తిరుమల, మార్చి26(నినాదం న్యూస్):** రాజమహేంద్రవరానికి చెందిన తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు, నున్న సరోజినిదేవి దంపతులు తిరుమల శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు బుధవారం రూ.1,01,11,111 విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయంలోని రంగనాయకులు మండపంలో టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు. ఈ సందర్భంగా దాతలను చైర్మన్, అదనపు ఈవో అభినందించారు. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. ఎంబీసీ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడి ఉన్నారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 64,252 మంది భక్తులు దర్శించుకోగా 25,943 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.68 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో..


## చిచ్చుపెట్టొద్దు..

- మేము మీ కోణంలో ఆలోచిస్తే తట్టుకోలేరు
- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



**ధర్మవరం, మార్చి26(నినాదం న్యూస్):** ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి చిచ్చు పెట్టాలని చూస్తున్నారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు మధ్యాహ్నం రామగిరిలో జరిగిన సంఘటనపై ఆమె తీవ్రంగా స్పందించారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ విధంగా జరిగాయో రాష్ట్రమంతా చూసిందన్నారు. కనీసం నామినేషన్ వేసేందుకు కూడా ఎవరికి అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. అసలు ఎంపీపీ విషయంలో మా సభ్యుల బలం లేదని అలాంటప్పుడు.. ఇందులో తమ జోక్యం ఎందుకు ఉంటుందని ఆమె ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగా రామగిరి ఎంపీడీవో కార్యాలయం వద్దకు వచ్చి టీడీపీ నాయకులను కార్యకర్తలను రెచ్చగొట్టారన్నారు. పక్కా పథకం ప్రకారమే వాహనాల్లో మారణాయుధాలు తీసుకొచ్చారని సునీత ఆరోపించారు. మొన్నటి రోజు మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి పై హత్యాయత్నం చేయించారని.. ఇటీవల గ్రామాల్లో మళ్ళీ ఫ్యాక్షన్ కక్షలు రేపుతున్నారని ప్రకాష్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రామగిరిలో పోలీసులు సంయమనంతో వ్యవహరించారు కాబట్టే అక్కడ పరిస్థితి చేయి దాటలేదన్నారు. తాను ఉదయం నుంచి ప్రజా దర్బార్ తో పాటు పార్టీ కార్యకర్తల సమావేశం, సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ, ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో సమావేశం వంటి కార్యక్రమాల్లో బిజీగా ఉన్నానన్నారు. అసలు ఈ గొడవ జరిగిన తర్వాతే నాకు సమాచారం అందిందన్నారు. ప్రజలు నాపై నమ్మకంతో ఒక బాధ్యత ఉంచారని. అందుకే మా ఆలోచన అంతా అభివృద్ధి వైపే ఉందన్నారు. మీరు పని లేక గ్రామాల్లో కక్షలు రేపుతున్నారని.. మీ కోణంలో మేము ఆలోచిస్తే.. మీరు తట్టుకోలేరని ఎమ్మెల్యే సునీత వార్నింగ్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసులు నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారు కాబట్టే.. మీరు ఇంకా స్వేచ్ఛగా తిరుగుతున్నారన్నారు. మరోసారి తమపై, టిడిపి నాయకుల పై ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే సునీత హెచ్చరించారు.

## 8 ఏళ్ల చిన్నారిపై లైంగికదాడి



**విశాఖ, మార్చి26(నినాదం న్యూస్):** రాష్ట్రంలో మహిళలపై, బాలికలపై జరుగుతున్న లైంగికవేధింపుల ఘటనలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా కామంధులు రెచ్చిపోతున్నారు. ఓ ఘటన మరవక ముందే మరో ఘటన చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం సమాజంలో మనుషులు రోజు రోజుకు విచక్షణ కోల్పోయి.. మృగాళ్ల ప్రవర్తిస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తీసుకొచ్చిన, పోలీసులు ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా, కామాంధుల ఆకృత్యాలకు అడ్డుకట్ట పడట్లేదు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ జిల్లాలో దారుణమైన ఘటన చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 8 ఏళ్ల చిన్నారిపై ఓ కీచకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పలుమార్లు ఆ చిన్నారిని లైంగిక వేధింపులకు పాల్పడినట్టు సమాచారం. ఈ క్రమంలో బాలిక తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# టూరిజం అభివృద్ధి ఎప్పటికీ అవసరమే

- ఆనాడు చెప్పిన మాటలను అపార్థం చేసుకున్నారు
- రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి ప్రత్యేకదృష్టి సారించాలి
- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు సూచన





**అమరావతి, మార్చి26(నినాదం న్యూస్):** టూరిజం అభివృద్ధి గురించి తాను ఆనాడు చెబితే ఎద్దేవా చేశారని, కానీ ఇప్పుడు అంతా గుర్తుకు చేసుకుని, తనవాదనకు బలం చేకూర్చారని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తాను చెప్పిన మాటలను 30 ఏళ్ల తర్వాత తెలంగాణ అసెంబ్లీలో గుర్తు చెయ్యడం సంతోషం అన్నారు. గతంలో ఏ ఇజం లేదు టూరిజం ఒక్కటే అని తాను మాట్లాడితే తీవ్ర విమర్శలు చేశారన్నారు.. కలెక్టర్ల సమావేశంలో ఈ అంశాన్నే ప్రస్తావించారు సీఎం.. టూరిజంపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు..తెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలపై ఏపీ కలెక్టర్ల సదస్సులో రెండో రోజు చర్చ జరిగింది.. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో టూరిజంపై చేసిన వ్యాఖ్యలను తెలంగాణ సభలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రస్తావించారు.. ఇప్పుడు సమాజంలో ఏ ఇజం లేదు.. ఉన్నదంతా టూరిజమే అని నాడు చంద్రబాబు అనేవారు అంటూ చెప్పుకొచ్చారు కూనంనేని.. చంద్రబాబు నాడు ఇజంపై చెప్పిన మాటే నిజం అంటూ తెలంగాణ సభలో అభిప్రాయపడ్డారు ఎమ్మెల్యే కూనంనేని.. అయితే, పత్రికలో వచ్చిన ఆ వార్తను కలెక్టర్ల సదస్సుల్లో టూరిజం అంశంపై మాట్లాడుతూ ప్రస్తావించారు సీఎం చంద్రబాబు.. ఏ ఇజం లేదు అని నేను నాడు అంటే కమ్యునిస్టులు నాపై విరుచుకుపడ్డారు.. నాపై విమర్శలు చేశారు.. ఇప్పుడు తెలంగాణలో శాసన సభ్యుడు మాట్లాడుతూ ఖర్చు లేని ఇజం టూరిజమే అంటూ నేడు స్టేట్‌మెంట్ ఇచ్చారు అని గుర్తుచేశారు.. తాను చెప్పిన మాటలను, తన ఆలోచనలను అర్థం చేసుకోవడానికి 30 ఏళ్లు పట్టింది అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. అయితే, ఇప్పుడు అంత సమయం లేదని.. త్వరగా ప్రాజెక్టులు తెచ్చి.. ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలని సీఎం చంద్రబాబున్నారు.

రాష్ట్రంలో ఇటు రాయలసీమ నుంచి అటు ఉత్తరాంధ్ర వరకు టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయన్న చంద్రబాబు.. కలెక్టర్లు జిల్లాల వారీగా టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాలని సూచించారు.. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని.. ఎకనమీ పెరిగి.. ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందన్నారు.. ఎక్కువ ఖర్చు లేకుండా ఉపాధి కల్పించే రంగం టూరిజం అని వ్యాఖ్యానించారు.. ప్రతి జిల్లాలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయని వాటికి అనుగుణంగా పనిచేస్తే టూరిజం పెద్ద ఉపాధి మార్గం అవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

కొత్త జిల్లాలోని అధికారులకు..

## పూర్తిస్థాయి అధికారాలు ఇవ్వాలి

- సీఎం చంద్రబాబు



**అమరావతి, మార్చి26 (నినాదం న్యూస్):** జిల్లాలోని అధికారులతో సంబంధం లేకుండా కొత్త జిల్లాలో అధికారులకు పూర్తిస్థాయి అధికారులు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో రెండవ రోజు కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆయా జిల్లాలోని అధికారులు స్వేచ్ఛగా వారి విధులను నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్నారు. దీనిపై సంబంధించిన ఆదేశాలను హెచ్ఓడీలు రెండు రోజుల్లో జారీ చేయాలని తెలిపారు. కొత్త జిల్లాలలో ఎటువంటి స్టాఫ్ సమస్య లేకుండా స్టాఫ్ రెగ్యులేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పని ఒత్తిడికి తగ్గట్టుగా అధికారులు, సిబ్బందిని కేటాయించాలని వెల్లడించారు. ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లోనూ ప్రత్యేకించి కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్లలో కనీసం మూడు హోటల్స్ ఉండేలా చూడాలన్నారు. కొత్త జిల్లాల్లో మౌలిక వసతుల కల్పన అంశంపై కూ డా అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై రాష్ట్రస్థాయిలో చర్చిస్తున్నామని సీఎం అన్నారు. పేదరిక నిర్మూలనకు సంపదను సృష్టించే టూరిజం తదితర అం శాలకే భవిష్యత్తు అంతా ప్రాధాన్యతనిస్తుందని, భౌతిక వాదమే వస్తుందని అన్నానని.. కాబట్టి తాను చెప్పేదంతా జిల్లా కలెక్టర్లు అందరూ అర్థం చేస్తుకుని క్షేత్ర స్థాయిలో రియల్ టైమ్‌లో అమలుపరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పుకొచ్చారు. ఏపీలో ఐదు జోన్‌లు ఉన్నాయన్నారు. జోన్-1లో విశాఖపట్నం, జోన్-2లో రాజమండ్రి, జోన్-3 లో రాజదాని అమరావతి, జోన్-4 లో తిరుపతి, జోన్-5 లో అనంతపురం పవర్ హబ్‌లుగా ఉన్నాయని తెలిపారు. ఆ పవర్ హబ్ల ఆధారంగా ఆయా జోన్లలోని అన్ని జిల్లాలను అభివృద్ధి పర్చే విధంగా జిల్లా కలెక్టర్లు జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలుపరిస్తే రాష్ట్ర భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందని వెల్లడించారు. ప్రతి ఒక్క జోన్‌కు ఒక సీనియర్ అధికారిని ఇన్‌చార్జిగా ఉంచామన్నారు. ప్రతి జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి కూడా ఉన్నారని తెలిపారు. వీరందరూ కలిసి ఆయన జిల్లాలను, ప్రాంతాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలో సమగ్రంగా చర్చించి క్షేత్ర స్థాయిలో తగు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారుర. గ్రామాల్లోని వాస్తవ విషయాలను తెలుసుకుని అందుకు తగ్గట్టుగా అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే విధంగా, గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుని వాటిని రియల్ టైమ్‌లో పరిష్కరించేందుకై వచ్చే మాసం నుంచి సీనియర్ అధికారులు అంతా గ్రామాల్లో మూడు నాలుగు రోజులు పృటించాలని ప్రకటించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.

## దీపం-2 పథకాన్ని.. సద్వినియోగం చేసుకోండి

- మంత్రి నాదెండ్ల మనోహర్



**అమరావతి, మార్చి26(నినాదం న్యూస్):** పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. దీపం-2 పథకంలో భాగంగా తొలి ఉచిత గ్యాస్ సిలిండర్ మార్చి 31 వరకే అవకాశం ఉందని ఇప్పటి వరకు పొందని వారు వెంటనే బుక్ చేసుకోవాలని ఆహార పౌరసరఫరాల, వినియోగదారుల నాదెండ్ల మనోహర్ సూచించారు. ప్రతి పేద ఆడబిడ్డకు ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలెండర్లు ఇస్తామన్న హామీ మేరకు కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఇప్పటి వరకు 98 లక్షల మంది తొలి ఉచిత గ్యాస్ సిలిండర్స్ వినియోగించుకున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఏపీలో సూపర్ సిక్స్ హామీని కూటమి సర్కార్ నిలబెట్టుకుంటోందన్నారు. ఉచిత సిలిం డర్ కావాల్సిన వారు సాధారణ పద్ధతిలో ముందుగా సొమ్ము చెల్లించవలసి ఉంటుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో బుక్ చేసిన 24 గంటల లోపు.. గ్రామీణ ప్రాంతాల్లో అయితే 48 గంటల లోపు గ్యాస్ డెలివరీ చేస్తారని మంత్రి నాదేండ్ల అన్నారు. ఆ తర్వాత సిలెండర్ డెలివరీ అయిన 48 గంటల్లోపు చెల్లించిన పూర్తి సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో తిరిగి జమ అవుతుందన్నారు. ఒక సంవత్సరంలో 3 గ్యాస్ సిలిండర్లు ఇలా ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అయితే వీటిని ఒకేసారి కాకుండా నాలుగు నెలలకు ఒకసారి బుక్ చేసుకునే అవకాశం కూడా ఉందని మంత్రి చెప్పారు.

## పారదర్శకంగా వృత్తి పన్ను వసూళ్లు

- ఏప్రిల్ 1 నుంచి వృత్తి పన్ను వసూలు
- రాష్ట్ర పన్నుల జాయింట్ కమిషనర్ ప్రశాంత్‌కుమార్

**విజయవాడ, మార్చి26(నినాదం న్యూస్):** వృత్తి పన్ను వసూళ్లను సరళీకృతం చేసి మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని విజయవాడ 1, 2 డివిజన్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎస్.ప్రశాంత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వృత్తి పన్నుదారుల నుంచి పన్నుల వసూలును పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూలు బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖకు అప్పగించడం జరిగిందని వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వృత్తి పన్ను వసూళ్లను వాణిజ్య పన్నుల శాఖకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎంఎస్ నెం.63 జారీచేసిందని, ఇది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. వివిధ వర్గాలకు చెందిన వేతన జీవులు, వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు వారికి నిర్దేశిరచిన రేట్ల ప్రకారం వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటు-ందన్నారు. దుకాణ యజమానులు, రూ. 10 లక్షల కంటే అధిక వార్షిక టర్నోవర్ ఉన్న జీఎస్టీ పన్ను చెల్లింపుదారులు వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాణిజ్య, వ్యాపార, పారిశ్రామిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు నెలకు రూ. 15 వేల కంటే ఎక్కువ జీతం చెల్లిస్తున్న యజమానులు ఉద్యోగుల తరఫున ప్రభుత్వానికి వృత్తి పన్ను చెల్లించాలని ఆయన వివరించారు. 2025, మార్చి పన్ను కాలానికి నెలవారీ ప్రొఫెషనల్ ట్యాక్స్ రిటర్న్‌ను వెబ్‌సైట్లో లాగిన్ అయి దాఖలు చేయాలని జాయింట్ కమిషనర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

## పాస్టర్ మృతిపై లోతైన విచారణ

హోంమంత్రి అనిత వెల్లడి



**రాజమండ్రి, మార్చి26(నినాదం న్యూస్):** పాస్టర్ పగడాల.ప్రవీణ్ మృతిపై లోతైన విచారణ చేయిస్తున్నామని హోం మంత్రి అనిత వెల్లడించారు. డీఎస్పీ స్థాయి పోలీసు అధికారుల కమిటీ విచారణ చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వం పారదర్శకంగా ఈ ఘటనపై దర్యాప్తు చేస్తోందన్నారు. రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నామని అన్నారు. దీనిని కేవలం యాక్సిడెంట్‌గా మాత్రమే పరిగణించటం లేదని హోం మంత్రి స్పష్టం చేశారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుగుతోందన్నారు. రాజకీయంగా, మతపరంగా విద్వేషాలు రగిల్చేలా వ్యవహరించొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందన్నారు. ప్రమాదవశాత్తూ ఈ ఘటన జరిగిందా ? ఏమైనా ఇం-టె-న్షన్ ఉందా ? అన్న దానిపైనా విచారణ చేస్తున్నామన్నారు. అనుమానాస్పద మృతిగానే ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. ఘటనా స్థలికి సమీపంలో కాల్ డేటా రికార్డులు కూడా తీసుకుంటు-న్నామన్నారు. దర్యాప్తు విషయంలో ఎవరికీ ఎలాంటి అభద్రతా భావన అవసరం లేదని హోం మంత్రి తెలిపారు.

## మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

**ఏలూరు, మార్చి26(నినాదం న్యూస్):** జిల్లాల్లో ఈ వేసవిలో ఎక్కడా కూడా తాగునీటి ఇబ్బంది అనే మాట లేకుండా చర్యలకు ఉపక్రమించారు. అవసరమైతే ప్రత్యేక మోటర్లు ద్వారా నీటిని చెరువుల్లోకి మళ్లించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో తహశీల్దార్లు ప్రజల దాహార్తి తీర్చడానికి ప్రత్యేక చలివేంద్రాలు నెలకొల్పాలని కలెక్టర్ ఆదేశించారు. వేసవిలో సాధ్యమైనంత వరకు ప్రజలు సుదూర ప్రయాణాలను ఉదయం వేళల్లో, లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే చేయాలి తప్ప మండు వేసవిలో ప్రయాణాలు చేయవద్దని సూచించారు. జిల్లాలో రబీ పంట చేతికొచ్చిన దృష్ట్యా రైతులకు పూర్తిస్థాయిలో గిట్టుబాటు ధర కల్పించడానికి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి రైతుల నుండి ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు.

## పశ్చిమ గోదావరి జిల్లా అభివృద్ధికి చర్యలు


- మొల్తూరు, పెరుగొండ సమస్యలపై దృష్టి
- డిప్యూటీ సీఎం ఆదేశాలతో 28న గ్రామసభలు



**అమరావతి, మార్చి26(నినాదం న్యూస్):** గ్రామిణిభివృద్ధి శాఖను ప్రత్యేక స్వీకరించి, అభివృద్ధిపై దృష్టి సారించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పశ్చిమ గోదావరి జిల్లాపై ఇప్పుడు ఫోకస్ పెట్టారు. చిన్నతనంలో పవన్ పెరిగిన ప్రాంతాలైన మొగల్తూరు, పెనుగొండ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇప్పటికే తన పేషీ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో, మొగల్తూరు, పెనుగొండ గ్రామాల అభివృద్ధికి కోసం ఈ నెల 28న గ్రామ అభివృద్ధి సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 28వ తేదీ ఉదయం మొగల్తూరు, సాయంత్రం పెనుగొండల్లో గ్రామలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేషి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న అభివృద్ధి సభల్లో గ్రామస్తులు, అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తారు. ఆయా గ్రామాలకు కావల్సిన అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనపై చర్చించి వాటిపై దృష్టిపెడతారు. అదే సమయంలో అయా గ్రామాల్లో ఉన్న వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను సైతం అధికారులు స్వీకరించి వాటి పరిష్కారంపై దృష్టిపెడతారు. తమ గ్రామాలకు సంబంధించి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారని.. అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు చెప్పుకునే అవకాశం రావడంతో పెనుగొండ, మొగల్తూరు గ్రామానికి చెందిన ప్రజలు వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చేందుకు సిద్ధమవుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ, ఫైర్ ఇంజన్లు, ఇతర మౌలిక వసతుల కల్పన అంశాలపై అధికారులకు విన్నవించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే సమయంలో పెనుగొండ గ్రామానికి సంబంధించి ఉన్న సమస్యలు అన్నింటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు సభకి హాజరుకావాలని ఇప్పటికే జనసేన నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు.. మరోవైపు మొగల్తూరు గ్రామంలో ఎప్పటి నుంచో ఇబ్బందికరంగా ఉన్న డ్రైనేజీ, రహదారుల విస్తరణ వంటి అంశాలతో పాటు- పర్యాటకంగా ప్రాంతంలో అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలపై అధికారులకు విన్నవించేందుకు సిద్ధమవుతున్నారు. వర్షాకాలంలో మురుగునీరు నేరుగా పంట కాలవల్లోకి చేరుతున్న పరిస్థితిపై అక్కడే రైతులకు జరుగుతున్న నష్టాన్ని వివరించేందుకు రైతుల సైతం సిద్ధమవుతున్నారు. ఇంతకాలం సమస్యలు అపరిష్కృతంగా ఉండడానికి కారణాలు ఏంటి, భవిష్యత్తులో ఆయా గ్రామాల్లో చేయబోయే అభివృద్ధి పనులు ఏంటనే అంశాలను మరింత లోతుగా ఆరా తీస్తున్నారు.

## 2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి..

- మంత్రి నిమ్మల వెల్లడి



**ఏలూరు/పోలవరం, మార్చి26(నినాదం న్యూస్):** ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజక్టు పనులను 2027 డిసెంబర్‌కు పూర్తి చేసే విధంగా కృషి చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ప్రాజెక్టు సందర్శిస్తున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఆయన సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. 2027 డిసెంబర్‌కు పూర్తి చేసేందుకు అంతర్జాతీయ నిపుణుల కమిటీ, సీడబ్ల్యుసీ, పీపీఎలను సమన్వయ పరుచుకుంటూ డిజైన్లకు అనుమతులు తీసుకుంటున్నామన్నారు. గతంలో చంద్రబాబు 18 నెలలు కష్టపడి డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తే, జగన్ విధ్వంసం చేశారని దుయ్యబట్టారు. జగన్ నిర్వాకంతో కొత్తగా 990 కోట్లతో డయాఫ్రం వాల్ నిర్మించాల్సి వస్తోందన్నారు. గత ఐదేళ్లు పోలవరం ఆలస్యం కావడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా 50 వేల కోట్ల రూపాయలు నష్టపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించి 12,157 కోట్ల రూపాయలు నిధులు సాధించారని మంత్రి నిమ్మల చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు కృషితోనే పోలవరం ప్రాజెక్టుకు, నేటికి రూ. 5052 కోట్ల నిధులు అడ్వాన్స్ గా వచ్చిందన్నారు. నాడు జగన్ ప్రభుత్వం కేంద్రం విడుదల చేసిన పోలవరం రీయింబర్స్మెంట్ నిధులను సైతం దారి మళ్లించి ప్రాజెక్ట్ ను విధ్వంసం చేసిందని ధ్వజమెత్తారు. నేడు డబుల్ ఇంజన్ సర్కార్ ఫలితాలు, పోలవరం పనుల ప్రగతిలో కనిపిస్తున్నాయని అన్నారు. మంత్రితో పాటు ఇరిగేషన్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు.

## ఏసీబీకి చిక్కిన జిల్లా మత్స్యశాఖ అధికారి

**పార్వతీపురం, మార్చి26(నినాదం న్యూస్):** పార్వతీపురం మన్యం జిల్లా మత్స్య అధికారి వేముల తిరుపతయ్య బుధవారం రూ.60,000 లంచం తీసుకుంటుండగా మత్స్య అధికారి కార్యాలయంలో ఏసీబీ అధికారులకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో ఏసీబీ రైడ్ జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం గ్రామానికి చెందిన కోట దుర్గ సప్లై చేసే యాజమాన్యం చేప పిల్లల సప్లై చేసే కాంట్రాక్టర్ కు ఇటీవల 60 లక్షల రూపాయలు బిల్లు చేశారు. ఆ బిల్లు నుండి ఒక పర్సెంట్ 60 వేల రూపాయల లంచం డిమాండ్ చేయగా లంచం ఇవ్వడం ఇష్టం లేని కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను సంప్రదించగా బుధవారం లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి విశాఖపట్నం కోర్టుకు తరలిస్తున్నట్లు డీఎస్పీ రమణమూర్తి తెలిపారు. ఈ రైట్ లో డిఎస్పి బివిఎస్ఎస్ రమణమూర్తి సీఐ మహేష్ ,సిఐ భాస్కరరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# ప్రశ్నిస్తే కేసులు పెట్టడమా.? పాలనపై దృష్టిపెట్టండి

- పంటలు ఎండుతన్నుయి పట్టించుకోరా?
- ఇసుక దందాలు భూదందాలపై ఉన్న ప్రజల మీదఏది?
- అభివృద్ధి కుంటుపడింది
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మండిపాటు



**కొడంగల్, మార్చి 26 (నినాదం న్యూస్):** ఇచ్చిన హామీలు అమలు చేయండని ప్రశ్నిస్తే కేసులు పెట్టడమేంటని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నంనరేందర్ రెడ్డి నిలదీశారు. బుధవారం కొడంగల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ,హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని,హామీలు అమలు చేయాలని దౌల్తాబాద్ మండలం లో తమ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం చేస్తే వారిపై కేసులు పెట్టడం సరికాదని, వెంటనే కేసులు ఉపసంహరించుకోవాలనీ పట్నంనరేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా అరెస్టు లు, కేసులు పెడుతూ,పాలనపై ,ప్రజల పై దృష్టిసారించడం లేదనీ, ఇప్పటికైనా ప్రజాసంక్షేమం కోసం పాలనపై దృష్టిపెట్టాలని హితువు పలికారు.తమ ప్రభుత్వ హయాంలో పదేళ్ళపాటు సాగునీరు, త్రాగు నీటికి కొదువ లేకుండా,చక్కటి పంటలు పండించి రైతులు సంతోషంగా ఉండేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నేడు గ్రామాల్లో, తాండాలలో నీటి ఎద్దడి మొదలైందని, రైతుల పంటలు ఎండిపోతున్నాయనీ, ఇవన్నీ ప్రభుత్వానికి కనపడడం లేదా?అని మండిపడ్డారు.పూర్తి స్థాయిలో రైతులకు రైతుభరోసా నిధులు అందలేదని,రుణమాఫీ జరగలేదని,ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరుగ్యారెంటీలలో ఏఒక్కటీ పూర్తిగా అమలుకు నోచుకోలేదనీ దుయ్యబట్టారు. ఇసుక దందాలు, భూదందాలు, ప్రశ్నిస్తే కేసులు పెట్టుడు వంటి దుర్బుద్ధి మానుకోవాలని, ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, హెచ్చరించారు. ముస్లిం మైనారిటీలకు గతంలో రంజాన్ కానుకగా దుస్తులు పంచేదనీ, ఇఫ్తార్ విందు ఇచ్చేదనీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రంజాన్ పండగ సందర్భంగా ముస్లిం మైనారిటిలకు ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. రంజాన్ సమీపిస్తుందనీ, ముస్లిం మైనారిటీలకు రంజాన్ కానుక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి, కోట్ల యాదగిరి,మధుసూధన్ యాదవ్, విష్ణువర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి,మధుసూధన్ రెడ్డి, శేరి నారాయణరెడ్డి,నర్మదకిష్టప్ప, మాజీ సర్పంచ్ రమేష్ బాబు, మహేందర్,సోంనాథ్, రవీంద్ర చారీ,తదితరులు పాల్గొన్నారు.

## ఎండిన పంట పొలాలకు నష్టపరిహారం ఇవ్వాలి



**నూతనకల్ మార్చి 26 నినాదం న్యూస్:** మండలంలో ఎండిపోయిన పంట పొలాలకు ఎకరానికి 30 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, ఎస్సారెస్పీ కాలువలకు నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని, ఎస్సారెస్పీ కాలువలపై లస్కర్లను నియమించాలని, ఎస్సారెస్పీ కాలువలలో మొలిచిన చెట్లను తొలగించి, సిమెంట్ లైనింగ్ చేయాలని, ఎండిపోయిన పంట పొలాలను సమగ్రంగా రెవిన్యూ శాఖ అధికారులు పరిశీలన చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, వరి పంట ప్రధానంగా నీళ్లు లేక ఎండిపోయే దశలో ఉన్నాయని తక్షణమే ఏప్రిల్ చివరి వరకు నీటిని ప్రభుత్వం అందజేస్తే పంటలను కాపాడుకోవచ్చని కోరుతూ బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య కు అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య,ఏఐకేఎంఎస్ నాయకులు పాపయ్య, నాగరాజు, శంబారెడ్డి,శ్రీను, అంజయ్య,లింగరాజు , పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి కాలువల కోసం భూసేకరణ గ్రామసభలు



**భీమదేవరపల్లి, మార్చి 26 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లో బుధవారం రోజు గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం భూసేకరణ గ్రామసభలు ముత్తారం, మల్లారం, ఎర్రబెల్లి గ్రామాలలో రెవెన్యూ ,ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామాలలోని రైతులకు ఆయా గ్రామాలలో కాలువలు ఏ ప్రాంతం నుంచి వెళ్తున్నాయో వివరిస్తూ, సేకరించబోతున్న భూముల వివరాలను తెలుపారు. రైతులకు ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గురువారం కూడా గట్ల నర్సింగాపూర్ ముల్కనూర్ వంగర గ్రామంలో భూసేకరణ గ్రామసభలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డిఓ రమేష్ రాథోడ్ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్ ఇరిగేషన్ చైతన్య ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులు మండల రెవెన్యు అధికారులు పాల్గొన్నారు.

## మంగళపల్లిలో పట్టపగలే దొంగతనం

- రూ. 5 లక్షల విలువైన ఆభరణాల చోరీ



**భీమదేవరపల్లి, మార్చి 26 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగళపల్లి గ్రామంలో పట్టపగలే ఇంట్లో దొంగతనం జరిగిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని మండల కుమారస్వామి అనే రైతు వ్యవసాయ పనులు నిమిత్తం ఉదయం ఏడు గంటలకి బావి దగ్గరికి భార్యాపిల్లలతో కలిసి వెళ్లినాడు. కొద్దిసేపటి తర్వాత కుమార స్వామి తండ్రి చంద్రయ్య కూడా మేకలను తీసుకొని బావి దగ్గరికి వెళ్ళాడు. వ్యవసాయ పనులు ముగించుకుని భార్య కూతురు తీసుకుని మధ్యాహ్నం సుమారు 12 గంటల వరకు ఇంటికి చేరుకోగా ఇంట్లో తలుపు తీసి సామాన్లు అన్ని చందర వందరగా పడి ఉన్నాయి. బెడ్ రూమ్ లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి తన కూతురు పెళ్లి కొరకు చేయించు భద్రపరిచిన బంగారు ఆభరణాలు, నక్లీస్, గోపి తాడు, కమ్మలు, 77 గ్రాముల బంగారం, వెండి పట్టీలు, 20 గ్రాములు, 35000 నగదు, మొత్తం 509820 విలువైన సొత్తు దోపిడికి గురైనట్టు బాధితుడు కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వంగర ఎస్సై దివ్య తెలిపారు.

## కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీలు



**చింతపల్లి, మార్చి 26 (నినాదం న్యూస్):** మండలంలోని వివిధ కార్యాలయాల్లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మొదట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు రాకుండా మహిళలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు. అనంతరం ఓపి రిజిస్టర్ ,సిబ్బంది హాజరు రిజిస్టర్ ,ఇన్ పేషెంట్లు, ఔట్ పేషెంట్లు, మందులు, ఇతర స్టాక్ రిజిస్టర్ లను పరిశీలించారు. ఓపి పేషంట్ల వివరాలను డాక్టర్ శ్రీదేవితో అడిగి తెలుసుకున్నారు. పి హెచ్ సి. కి వచ్చిన 84 మంది రోగులు, కొంతమంది ఇన్ పేషెంట్లు, అవుట్ పేషంట్లతో ఆమె మాట్లాడి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. గర్భిణీ స్త్రీలకు ప్రాథమిక వైద్య ఆరోగ్య కెనాన్ ద్వారా అందిస్తున్న సేవలను డాక్టర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. పీ హెచ్ సిలో కాన్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు .మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు మంచి ఆహారాన్ని తీసుకోవాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అలాగే గర్భిణీ స్త్రీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల వారితో పాటు, వారి పిల్లలు బాగుంటారని తెలిపారు. ఆసుపత్రిలో కాన్పులు



చేయడం పట్ల ఆమె వైద్యాధికారి శ్రీదేవి ని అభినందించారు.అంతకుముందు ఆమె మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని తనిఖీ చేసి పిల్లలతో ముఖాముఖి మాట్లాడారు. తరగతి గదిలోకి వెళ్లి వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. పాఠశాల కిచెన్ గది బాగా లేకపోవడంపై డిఇఓ తో మాట్లాడి వెంటనే వాటిని బాగు చేయించాలని, నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు.

## పాలకుల వినాశనకర విధానాలతో ఆర్థిక సంక్షోభంలో రైతులు




- ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్

**వరంగల్ మార్చి 26 ( నినాదం న్యూస్ ) :** పాలకుల వినాశకర విధానాలతో రైతులు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి అనేక అవస్థలు పడుతున్నారని అఖిలభారత రైతు సమైక్య ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. అఖిల భారత రైతు సమాఖ్య ఏఐకేఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసారెడ్డి అధ్యక్షతన వరంగల్ లోని ఓంకార్ భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా రైతాంగ అమరులకు నివాళి అర్పించారు. అనంతరం ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్పత్తిలో ప్రధాన భూమిక పోషించే వ్యవసాయరంగాన్ని రైతులను దివాలా తీయించే విధంగా విధానాలను రూపొందిస్తూ కార్పోరేట్ పెట్టుబడుదారు శక్తులకు ఊడిగం చేస్తున్నదని విమర్శించారు. ఈ క్రమంలో పంటల ఉత్పత్తి ఖర్చులను పెంచి మార్కెట్ వ్యవస్థను పూర్తిగా వ్యాపారులకు మధ్య దళారులకు వదిలివేసిందని ప్రభుత్వ జోక్యం లేకుండా చేసేందుకు కుట్ర పన్నుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల పంటల ఉత్పత్తి ఖర్చులు తగ్గించి కనీస మద్దతు ధర చట్టాన్ని సాధించేందుకు రాజకీయాలకు అతీతంగా రైతాంగ ఉద్యమాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి దాటవేయడం సరికాదన్నారు. రైతుల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా మద్దతు ధర నిర్ణయిస్తామని రుణమాఫీ చేస్తామని సమగ్ర పంటల బీమా రైతు బీమా వర్తింప చేస్తామని చెప్పి ఆచరణలో విస్మరించడం సిగ్గుచేటు అన్నారు. పైగా ఢిల్లీ పంజాబ్ సరిహద్దుల్లో రైతులు శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడుతుంటే నిర్బంధం ప్రయోగించి కేసులు పెట్టి జైల్లో పంపడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతాంగాన్ని రక్షించే విధంగా చట్టాల రూపొందించి రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకొని తమ చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఏప్రిల్ 7 8 తేదీలలో ఏఐకేఎఫ్ జాతీయ సమావేశాలు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ లో జరుగుతున్నాయని భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలతో వేలాదికరాల్లో రైతులు పంటలు కోల్పోయిన ప్రభుత్వం స్పందించకపోవడం సరైన చర్య కాదన్నారు. ఇప్పటికైనా తక్షణమే కనీసం ఎకరాకు 20వేల రూపాయలు చొప్పున పరిహారం అందించి రైతు ను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్కేఎం ఆధ్వర్యంలో ఈనెల 28న రైతు ఉద్యమంపై నిర్బంధాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని పిలుపునిచ్చారు. సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు రైతాంగానికి చైతన్య పరిచేందుకు కార్యకర్తలు శక్తివంతంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లేపు ఉపేందర్ రెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గోనే కుమారస్వామి రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుండెబోయిన చంద్రయ్య జి ప్రభాకర్ రెడ్డి ఏం మానయ్య కుసుంబ బాబూరావు మహమ్మద్ ఇస్మాయిల్ నాగెల్లి కొమరయ్య సింగతి మల్లికార్జున్ వక్కల కిషన్ కుర్ర రవీందర్ గౌడ్ తదితర రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ పరిధిలో గృహిణి అదృశ్యం

- పిఎస్‌లో ఫిర్యాదు చేసిన కుమార్తె



**జవహర్ నగర్ మార్చి 26 (నినాదం న్యూస్):** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గృహిణి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గబ్బిలాల పేటలో యాదగిరి భార్య మంజులతో(46) గత మూడు సంవత్సరాలుగా నివసిస్తున్నారు. ఈనెల 20న భర్త యాదగిరి కుమారుడు డ్రైవింగ్ పనికి వెళ్లగా ఉదయం 9:30 గంటలకు కుమార్తె కొత్తపల్లి ఇందుమతి స్కాలర్షిప్ దరఖాస్తు చేసుకునేందుకు ఇంటర్నెట్ సెంటర్ కు వెళ్లింది. మంజుల ఇంట్లో ఒంటరిగా ఉన్నారు. సుమారు 12 గంటలకు కుమార్తె ఇందుమతి ఇంటికి వచ్చి చూడగా తల్లి ఇంట్లో లేకపోవడం గమనించింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు మంజుల కోసం చుట్టుపక్కల వెతికినా బంధువుల వద్ద వెతికినా పరిచయస్తుల ఇండ్లలో వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుమార్తె ఇందుమతి జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మంజుల ఒక వారం క్రితం కూడా ఇలానే ఇంటి నుండి చెప్పకుండా వెళ్ళిపోయి యాదగిరిగుట్టలో కనిపించిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## హెూలీ పండుగ కోసం సొంత రాష్టానికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

- పీఎస్‌లో ఫిర్యాదు చేసిన అన్న



**జవహర్‌నగర్, మార్చి 26 (నినాదం న్యూస్):** హెూలీ పండుగ జరుపుకోవాలని సొంత రాష్ట్రానికి బయలుదేరిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం. శ్రీ యాదవ్ సింగ్ ఫార్మర్( 32) జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ లోని బి జె ఆర్ నగర్ లో ఇద్దరు స్నేహితులతో కిరాయి ఇంట్లో నివసిస్తున్నారు. ఈనెల 10వ తేదీన శ్రీ యాదవ సింగ్ ఫార్మర్ హెూలీ పండుగ జరుపుకోవాలని తన సొంత రాష్ట్రమైన రాజస్థాన్ కు బయలుదేరి వెళ్లాడు. తన సోదరుడు ధర్మేందర్ సింగ్ ఇతన్ని సంప్రదించినప్పుడు ఉత్తరప్రదేశ్లో ఉన్నానని సోదరి ఇంటికి వెళుతున్నానని చెప్పాడు. తర్వాత రెండు రోజుల తర్వాత మళ్లీ ఫోన్ చేయగా మరొక సోదరి ఇంటికి మధ్యప్రదేశ్ కి వెళుతున్నానని అన్నకు తెలియజేశాడు. ఈ నెల 23 వ తారీఖున తన అన్న మళ్లీ శ్రీ యాదవ్ సింగ్ కు ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేయబడింది. ఆందోళనతో అతను తన సోదరీమణులను సంప్రదింగా రాలేదని వారు తెలిపారు. ఈ మేరకు అన్న శ్రీ జగదీష్ సింగ్ ఫార్మర్ సొంత ఊరు వాళ్లను సంప్రదించగా అక్కడ అతని రాలేదని సమాచారం అందింది .ఈ మేరకు జగదీష్ సింగ్ ఫార్మర్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధింపు



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, మార్చి26(నినాదం న్యూస్):** మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మైనర్ బాలికను రోజూ వెంబడిస్తూ, ప్రేమ పేరుతో వేధిస్తూ, అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన Cr.NO 449/2014 కేసులో నిందితుడు ఎస్ కె రహమత్ అలియాస్ మధు తండ్రి దస్తగిరి వయస్సు 26 సంవత్సరాలు, వృత్తి:వ్యాపారం, 30-59 గణేష్ నగర్, మౌలా అలీ, మల్కాజ్‌గిరి ఉంటున్నారు. సొంత ఊరు యెర్ర గుంట, చంద్ర గుండ మండలం ఖమ్మం జిల్లా వాసిని దోషిగా నిర్ధారించడం జరిగింది. మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో U/S 354, 354, 506,509 ఐపిసి సెక్షన్: 8 ఆర్ /డబ్ల్యు 12 ఆఫ్ పోక్సో చట్టం మల్కాజ్‌గిరి స్టేషన్ ఎస్ సి నెం : 1479/2022, అత్యాచారం మరియు పోక్సో చట్టం ప్రకారం నేరేడ్‌మెట్‌లోని మేడ్చల్/మల్కాజిగిరి జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడిని దోషిగా నిర్ధారించారు. ఈ కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష 20,000 రూపాయలు జరిమానా విధించబడింది. ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుశీల వాదనలు వినిపించారు.

## చిన్నారిని ఆశీర్వదించిన రాణా



**నర్సంపేట, మార్చి 26(నినాదం):** దుగ్గొండి మండల పరిధిలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన కొండపాక భార్గవి - మధు కుమార్తె చి.. మనస్విని నూతన వస్త్ర ఫలంకరణబుధవారం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారి ఆశీర్వదించిన బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాఎం గోగుల రాణా ప్రతాప్ రెడ్డి.ఈ కార్యక్రమం లో దుగ్గొండి మండల అధ్యక్షులు నేదురు రాజేందర్, నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్,బీజేవైఎం మాజీ నియోజకవర్గం నాయకులు జూలూరి మనీష్ గౌడ్, మహ్మదాపురం పిఏసిఎస్ వైస్ చైర్మన్ పాలడుగుల జీవన్, సీనియర్ నాయకులు నూతనకంటి శ్రీనివాస్,ఎస్టీ మోర్చా నాయకులు బానోత్ రమేష్, బుట్టిరాజు, తుత్తురు శ్రీకాంత్, ముద్రబోయిన రాంరాజ్, ఎద్దు కృష్ణంరాజు, సవిండ్ల మధు మరియు బీజేపీ పార్టీ జిల్లా మండల గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



**వనపర్తి ప్రతినిధి, మార్చి 26 (నినాదం న్యూస్):** వనపర్తి జిల్లా కేంద్రంలోని 22 వ వార్డు భగత్ సింగ్ నగర్ లో మహమ్మద్ సలీం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక వార్డు నాయకుడు మెకానిక్ శ్రీను బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మానవతాదృక్పథంతో ఆ కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వాజీద్ అలీఖాన్, అబ్దుల్ ఘని, రఫీ, సమీర్, ఆంజనేయులు, రాజు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి సర్కార్ మరో కీలక నిర్ణయం

- విశాఖలో లూలూ గ్రూపునకు తిరిగి భూ కేటాయింపు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**అమరావతి, మార్చి 26 (నినాదం న్యూస్):** చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం హార్బర్ పార్క్ సమీపంలో లూలూ గ్రూప్‌నకు గతంలో కేటాయించిన 13.83 ఏకరాలను తిరిగి ఆ గ్రూప్‌నకు ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. విశాఖపట్నంలో లూలూ గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టం చేసింది. అలాగే ఏపీఐఐసీ ద్వారా లూలూ గ్రూప్‌నకు విశాఖలో భూకేటాయింపులు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అదే విధంగా విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాలను ఏపీఐఐసీకి బదలాయించాలని వీఎంఆర్డీఏకు ప్రభుత్వం ఆదేశించింది. విశాఖపట్నం నగరంలో లూలూ గ్రూప్ సంస్థ అంతర్జాతీయ స్థాయి మాల్ నిర్మాణం, పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదించినట్టు పరిశ్రమల శాఖ ఇప్పటికే వెల్లడించింది. 2017లోనే విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు లూలూ గ్రూప్ ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే 2023లో లూలూ గ్రూప్‌నకు గత ప్రభుత్వం చేసిన భూకేటాయింపులను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ప్రస్తుతం మళ్లీ షాపింగ్ మాల్‌తోపాటు- హైపర్ మార్కెట్‌ల నిర్మాణం చేసేందుకు లూలూ గ్రూప్ ముందుకు వచ్చింది. ఈ ప్రతిపాదనలను పరిశీలించి భూ కేటాయింపులు చేయాల్సిందిగా ఏపీఐఐసీని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఆదేశించారు. 2014లో ఏపీలో టిడీపీ ప్రభుత్వం కొలువు తీరగానే విశాఖపట్నంలో లూలూ గ్రూప్ పెట్టుబడులు పెట్టేందుకు.. నాటి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక గత టీడీపీ ప్రభుత్వం చేసుకున్న పలు ఒప్పందాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసింది. అందులో లూలూ గ్రూప్ సైతం ఉంది. అయితే లూలూ గ్రూప్ తమిళనాడులో తన పెట్టుబడులు పెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో ఈ ఏడాది జనవరిలో సీఎం చంద్రబాబుతో లూలూ గ్రూప్ సంస్థల అధినేత అమరావతిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు లూలూ కంపెనీ తన ఆసక్తిని కనబరిచింది. దీంతో గతంలో కేటాయించిన భూమిని తిరిగి కేటాయిస్తూ.. కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.విశాఖలో లులూ గ్రూప్ నిర్మించనున్న షాపింగ్ మాల్, హైపర్ మార్కెట్ల నిర్మాణానికి భూమి కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏపీఐఐసీ ద్వారా లులూ గ్రూప్‌నకు విశాఖలో భూకేటాయింపులు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్కులో ఉన్న 13.43 ఎకరాలను ఏపీఐఐసీకి బదలాయించాలని వీఎంఆర్డీఏకు ఆదేశాలు జారీ చేసింది. లులూ గ్రూప్ సంస్థ విశాఖ నగరంలో అంతర్జాతీయ స్థాయి మాల్ నిర్మాణం పెట్టుబడులకు ఎస్ఐపీబీలో ఆమోదించినట్టు పరిశ్రమల శాఖ వెల్లడించింది. 2023లో లులూ గ్రూప్‌నకు చేసిన భూకేటాయింపులను వైకాపా ప్రభుత్వం రద్దు చేసింది.

# చెరువుకట్టకు పొంచిఉన్న ప్రమాదం..

## •మరమ్మతులు చేయాలని రైతుల డిమాండ్

**కోదాడ/అనంతగిరి, మార్చి 26 (నినాదం న్యూస్):** అనంతగిరి మండలం వాయిల సింగారం గ్రామ ఊర చెరువు కట్ట ప్రమాదపు అంచున ఉందని అధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని గ్రామానికి చెందిన రైతులు గద్దె రామారావు, కొల్లు సుబ్బారావు, జొన్నలగడ్డ సైదులు, రేవూరి శ్రీనివాసరావు, రేవూరి సైదులు ,కంటూ శ్రీకాంత్, వీరబోయిన వెంకటేశ్వర్లు, రేవూరి చంద్రయ్య, పూలకాని శ్రీను ,తెలకపల్లి సత్యనారాయణ అధికారులను, ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.... గత వర్షాకాలం సీజన్లో చెరువు తూము దగ్గర కట్ట దెబ్బ తిన్నది.





చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని అధికారులకు చెప్పిన నేటి వరకు మరమ్మతులు చేయలేదని ఆరోపించారు. గత వర్షాకాలంలో కట్ట తెగే ప్రమాదం ఉందని అధికారులే ప్రకటన చేసిన సంగతిని కూడా వారు గుర్తు చేశారు. మళ్లీ అదే పరిస్థితి నెలకుంటుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తక్షణమే మరమ్మతులు చేయాలని కోరారు.

# ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్సై హెచ్చరిక

## •నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు



**కోదాడ, మార్చి 26 (నినాదం న్యూస్):** కోదాడ పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ హెచ్చరికలు జారీ చేశారు.ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ ఆటోలను నిర్లక్ష్యంగా నడిపిన డ్రైవర్లపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలోని బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద ఆటోడ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, తీసుకో వాల్సిన జాగ్రత్తలపై ట్రాఫిక్ ఎస్సై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోలు, మినీ టాటా ఏసీ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. హైవేలో వెళ్లేటప్పుడు యూటర్న్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆటోలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే అకతాయిలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డ్రైవర్లంతా డ్రైవింగ్ లైసెన్స్ ఆర్సీ ఉంచుకోవాలని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను కట్టడి చేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

# ఉపకార వేతనాలు చెల్లించాలని వినతి



**నర్సంపేట, మార్చి 26(నినాదం):** కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించాలని కోరుతూ ప్రైవేట్ కాలేజ్ యాజమాన్యాలు నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాజమాన్యాల చైర్మన్ జీజుల సాగర్ మాట్లాడుతూ డివిజన్లోని ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందక విద్యార్థులు, కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉపకార వేతనాలు రాబోయే సెమిస్టరు లోపు ప్రభుత్వం విడుదల చేయకుంటే 2.4.6 పరీక్షలు బహిష్కరిస్తామని సాగర్ హెచ్చరించారు ప్రభుత్వం తక్షణమే ఉపకార వేతనాల బకాయిలు చెల్లించాలని సాగర్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్స్ బోనగాని రవీందర్ గౌడ్, యాకూబ్, మేరుగు శ్రీధర్ గౌడ్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నాయీ బ్రాహ్మణుల నిరసన



**మహాదేవపూర్ మార్చి 26 (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటవుతున్న కార్పొరేట్ సెలూన్లకు నిరసనగా మహాదేవపూర్ మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణులు నిరసన చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సెలూన్ షాపులను బందు చేసి తమ నిరసన గలాన్ని వినిపించారు. రెక్కాడితే గాని డొక్కాడని మా బ్రతుకుల్లో కార్పొరేట్ వ్యవస్థలు రావటం శోచనీయమని, వెంటనే కార్పొరేట్ సెలూన్లను ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని అన్నారు. నాయి బ్రాహ్మణుల మండల అధ్యక్షుడు దాగం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పథకం ఏపీఓను బదిలీచేయాలి

## •సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ

**డోర్నకల్/మరిపెడ మార్చి 26(నినాదం న్యూస్):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరిపెడ మండలం ఏ పీ ఓ గా విధులు నిర్వహిస్తున్న మంగమ్మ దీర్ఘకాలికంగా ఒకే చోట గత 13 సంవత్సరాలుగా పనిచేస్తూ వీధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ మరిపెడ మండలంలో ఉపాధి హామీ పనుల్లో అవినీతి అవకతవకలు ను పాల్పడుతున్న ఏపీవో మంగమ్మను వెంటనే బదిలీ చేయాలని సిపిఐ మండల కార్యదర్శి మాడగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డిఆర్డిఓ పిడికి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడాతూ ఇటీవల కాలంలో భారీ స్థాయిలో అవినీతి మరిపెడ మండలంలోని నీలికుర్తి,ఎల్లంపేట గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు భారీగా అవినీతికి పాల్పడ్డారన్నారు.ఏపివో మంగమ్మ సొంత మండలం కావడంతో అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.ఏపీవో రాజకీయ ప్రాబల్యంతో దీర్ఘకాలంగా పని చేస్తుందని విమర్శించారు.ఈ మండలం నుండి ఏపీవో మంగమ్మను వెంటనే బదిలీ చేయాలని పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.



# ఉపాధ్యాయ వృత్తిలో బిక్షపతి సేవలు ఎనలేనివి

## •మండల విద్యాధికారి శ్రీదేవి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, మార్చి 26 (నినాదం):** ఉపాధ్యాయ వృత్తిలో జాలిగపు బిక్షపతి సేవలు ఎనలేనివని కాటారం మండల విద్యాధికారి శ్రీదేవి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం అంకుశాపూర్ ప్రాధమిక ఉన్నత పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న జాలిగపు బిక్షపతి పదవీ విరమణ సన్మాన సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ అన్ని వృత్తుల్లో కెల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదనీ, ఈ వృత్తిలో ఉన్న గౌరవం మరే వృత్తిలో లేదన్నారు. సుదీర్ఘ కాలం పాటు వివిధ పాఠశాలల్లో అంకితభావంతో పనిచేసి ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన ఘనత బిక్షపతికి దక్కుతుందని అన్నారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ మాట్లాడుతూ సేవా భావంతో పని చేసిన పాఠశాలల్లో అభివృద్ధి కోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం బిక్షపతి ఎన్నో సేవలు చేశారని వారిని స్ఫూర్తిగా తీసుకొని నేటితరం ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. పిఆర్టియూ లో అంకితభావం గల కార్యకర్తగా పనిచేస్తూ సంఘం బలోపేతానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. పింగిలి శ్రీపాల్ రెడ్డి గెలుపు కోసం ఎంతగానో కృషి చేశారని అన్నారు. పాఠశాల హెచ్ఎం కదవెండి ప్రభాకర్ సభాధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పీఆర్టీయూ హన్మకొండ జిల్లా అధ్య క్షులు మందల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పలీత శ్రీహరి, మహాముత్తారం మండల విద్యాధికారి పాశం సంజీవ రెడ్డి, డి టీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు పోరెడ్డి రమణారెడ్డి, కాటారం మండల పీఆర్టీయూ భాద్యులు రవీందర్ తిరుపతి, రేగొండ మండల బాధ్యులు దుస్స సదాకర్, కోమిరెడ్డి మధుకర్ రెడ్డి, ఆలూరి రమేష్, రాష్ట్ర బాధ్యులు కామిడి సతీష్ రెడ్డి, మంత్రి లింగ మూర్తి, మాజీ ఎంఈఓ గుండు సారంగపాణి, చింతకానీ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శైలజ, కొండపర్తి హరి ప్రసాద్, పాకాల శ్రీనివాస్ రెడ్డి, దాసరి రాజేంద్ర ప్రసాద్, కొంకల గీతారెడ్డి, పెనుకుల యాదగిరి, చేరి ప్రభాకర్ రెడ్డి, వీరేశం, విజయ్ కుమార్, పాకాల శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొని బిక్షపతిని ఘనంగా సన్మానించారు.



# పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

## •జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, మార్చి 26 (నినాదం న్యూస్):** పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం గణపురం మండలం చెల్పూర్ జడ్పిఎస్ఎస్, అలాగే మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి రీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో భాగంగా కలెక్టర్ అన్ని గదులను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, వైద్య తదితర మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పైన చీఫ్ సూపరింటెడెంట్లకు పలు సూచనలు చేశారు. పరీక్షలకు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారనే వివరాలు, పరీక్షా కేంద్రాలోని ఏర్పాట్లును కలెక్టర్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన రికార్డులను, ప్రశ్న పత్రాలు, పరీక్షల అనంతరం జవాబు పత్రాల తరలింపుకు సంబంధించిన వివరాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21వ తేదీ నుండి ప్రారంభమైన 10వ తరగతి పరిక్షలు ఏప్రిల్ 4వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు.ఇప్పటి వరకు జరిగిన అన్ని పరీక్షలు చాలా ప్రశాంతంగా జరిగాయని, తదుపరి జరుగనున్న పరీక్షలు కూడా ఇదే స్పూర్తితో పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరీక్షలు జరుగుతున్న తీరు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సెల్ ఫోన్స్, వాచీలు, ఎలక్ట్రానిక్. పరికరాలు పరీక్ష కేంద్రాల్లోకి తీసుకురాకుండా నిశితంగా పరిశీలించాలని అన్నారు. మాస్ కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్ కు పాల్పడితే మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పరీక్షలు ముగిసేంత వరకు కూడా ఎంతో అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రశ్నపత్రాలను తప్పనిసరిగా తగిన పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య క్లోస్డ్ వాహనంలో తరలించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, చీఫ్ సూపరింటెండెట్స్ తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి ఎద్దడిని నివారించండి



## •అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

**మహాదేవపూర్ మార్చి 26 (నినాదం న్యూస్):** మండలంలో త్రాగినీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని భూపాల్ పల్లి జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి( లోకల్ బాడీస్ )అన్నారు. బుధవారం మహదేవపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ, రెవిన్యూ, గ్రామపంచాయతీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే మూడు నెలలు మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో లేబర్ బడ్జెట్ అప్రూవ్ చేసిన పని దినాల మేరకు టార్గెట్ ప్రకారం అన్ని గ్రామపంచాయతీలలో కూలీలకు ఉపాధి కల్పించి మార్చి 31 లోగా లక్ష్యాన్ని పూర్తిచేయాలని, కూలీలకు దినసరి వేతనం 300 రూపాయలు లభించేట్లు మెట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ముందస్తుగా కొలతలు కొలతల ప్రకారం పని చేయించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల పంచాయతీ కార్యదర్శులు పనులు జరిగే చోట అవసరమైన నీటి సౌకర్యము అందుబాటులో ఉంచాలని తెలిపారు. నూతన రేషన్ కార్డుల కొరకు మీ సేవలో దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను సంబంధించి సర్వే ఈనెల ఆఖరిలోపు మొబైల్ యాప్ ద్వారా పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన అర్హుల జాబితాను చూసుకోవాలని, మహాదేవపూర్ కాలేశ్వరం మెట్పల్లి అంబటిపల్లి గ్రామ పంచాయతీలలలో ఎల్ఆర్ఎస్ కొరకు దరఖాలు చేసుకున్న వారు ఈనెలాఖరులోగా రుసుము చెల్లించిన 25 శాతం రాయితీ అమలు జరుగుతుందని దరఖాస్తుదారులకు విషయం తెలియజేసి రుసుము చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె వివరించారు. గ్రామ పంచాయతీలలో ఈనెలాఖరులోగా 100% ఇంటి పన్ను వసూలు చేయాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి డిపిఓ వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపి ఓ ప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేష్, తో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉపాధి సిబ్బంది రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# సొంత ఖర్చులతో మరమ్మతులు

## • అధోగతిలో మరిపెడ మున్సిపాలిటీ అంతర్గత రోడ్లు
## • మాజీ వార్డ్ కౌన్సిలర్ ఊరుకొండ శ్రీనివాస్

**డోర్నకల్/మరిపెడ, మార్చి 26(నినాదం న్యూస్):** మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని కనకదుర్గ మినీ ఫంక్షన్ హాల్ పక్కనే ఉన్న మురికి కాలువపై ఏర్పాటుచేసిన మోరి (వంతన) కూలి పోయి చాలా నెలలు కావస్తున్న మున్సిపాలిటీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.. మోడల్ స్కూల్ కి వెళ్లే దాదాపు 800 మంది విద్యార్థులు,అంతేకాకుండా ఆ మార్గం గుండా వెళ్లే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ డ్రైనేజ్ కాలువలో పడి ద్విచక్ర వాహనదారులు తీవ్ర గాయాల పాలయ్యారు..అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక మాజీ వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్ సొంత డబ్బులతో మరమ్మతులు చేయించ మన్నారు. మరమతుకైన 10 వేళ రూపాయల ఖర్చులను మాజీ వార్డ్ కౌన్సిలర్ ఊరుకొండ శ్రీనివాస్ భరించుకోగా బీఆర్ఎస్ నాయకులు ప్రతాప్ సింగ్ నా వంతు సహకారాన్ని అందజేస్తానని ముందుకొచ్చారు...దీంతో ద్విచక్ర వాహనదారులు, కాలనీవాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మాలి చరణ్ సింగ్, మౌర్య గోపాల్, హరీష్ పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో 13మందికి గాయాలు

**చౌటుప్పల్, మార్చి26(నినాదం న్యూస్):** చౌటుప్పల్ మండలం ధర్మోజిగూడెం గ్రామపరిధి ఎపిటోమ్ వెంచర్‌కు సమీపంలో విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారిపై బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న భారీ కంటైనర్ లారీని వెనక నుంచి రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 13 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. చౌటుప్పల్ సిఐ మన్మధకుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. చౌటుప్పల్ మండలం ధర్మోజి గూడెం గ్రామ సమీపంలో బుధవారం ఉదయం సుమారు ఐదున్నర గంటల సమయంలో విజయవాడ నుండి హైదరాబాద్ వైపు 65వ నెంబర్ జాతీయ రహదారిపై వెళు తున్న కంటైనర్ లారీని లారీ నడుపుతున్న డ్రైవర్ రహదారిపై వెనక వస్తున్న వాహనాలకు ఎలాంటి సిగ్నల్ ఇవ్వకుండానే నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ నడిరోడ్డుపై అకస్మాత్తుగా నెమ్మది చేయడంతో ఇదే సమయంలో వెనకనుంచి హైదరాబాద్ వైపు జాతీయ రహదారిపై వెళుతున్న ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందు ఉన్న లారీని బలంగా ఢీ కొట్టింది. ఇదే సమయంలో దాని వెనుకగానే వస్తున్న మరో ట్రావెల్ బస్సు ముందున్న ట్రావెల్ బస్సును ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో మొత్తం 13 మంది తీవ్ర గాయాలపాలైనట్లు సిఐ తెలిపారు. గాయపడిన వారిలో ముప్పరాజు మణికంఠ (30), సుజిత్ కుమార్(52), శ్రీపాద విజయ్(28),పోలుకొండ అనూష(24), మడి విశ్వనాథ్ (25),బిపిన్ నాయుడు (39),బిధాన్ సుతార్ (52), రాయపు రెడ్డి వీరవాణి (35),ఓలేటి మౌనిక(27), సుధా జగన్నాథ్ (31), కాట్రగడ్డ సాయి చైతన్య (30),గద్దం కిషోర్(33), కేత శివ నారాయణ (25) లు ప్రమాదంలో గాయపడినట్లు సి ఐ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, చౌటుప్పల్ పట్టణ సీఐ మన్మధ కుమార్, ట్రాఫిక్ సీఐ విజయకుమార్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు.ట్రావెల్ బస్సు డ్రైవర్ క్యాబిన్లో ఇరుక్కుపోవడంతో పోలీసులు శ్రమించి అతనిని బయటికి తీసి ఆసుపత్రికి తరలించి అతని ప్రాణాలను రక్షించారు . జరిగిన ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధ కుమార్ తెలిపారు.



# రూరల్ రిలేషన్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

## •భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే

**భూపాలపల్లి, మార్చి 26 (నినాదం న్యూస్):** రూరల్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. బుధవారం జిల్లాలోని అటవీ గ్రామాలతో పాటు ఎంపిక ప్రాతిపతికన 19 ప్రాథమిక, ఉన్నత పాఠాలల్లో జరిగిన స్వచ్ఛంద కార్యక్రమాలను ఎస్పీ అభినందించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లైబ్రరీలు, స్పోర్ట్స్ కిట్లను, జ్ఞాన్ కి, ఫిట్ కి కార్యక్రమం ద్వారా సంస్థ వ్యవస్థాపకుడు పూణేకు చెందిన ప్రదీప్ లోకండే తన ఆర్గనైజేషన్ ద్వారా అందించడం జరిగిందని, మంచి విలువలకు సంబందించిన పుస్తకాలు, యోగా, ధ్యానం, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు, వ్యక్తిత్వ వికాసం, నీతి కథలు, వివిధ రకాల ఉపయోగకరమైన పుస్తకాలు ఉన్నాయని, పిల్లల మనోవికాసానికి, ఆరోగ్యవంత సమాజానికి, లైబ్రరీలు, స్పోర్ట్స్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ రిలేషన్ సంస్థ ప్రతినిధులు నితీన్ కుమార్ నంద కుమార్, సిసి ఫసియోద్దీన్ పాల్గొన్నారు.



# ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగిఉండాలి

## •మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ కుమారస్వామి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, మార్చి26 (నినాదం):** ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ వి. కుమార స్వామి అన్నారు. కాటారం మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మిషన్ 95 క్యాంపెయినింగ్ చేశారు. స్థానిక ప్రజలకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం 85 హెచ్ఐవీ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ నాలుగు విధాలుగా సోకుతుందన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషితమైన సూదులు, పరీక్షించని రక్త మార్పిడి వల్ల, హెచ్ఐవీ తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకి ఈ నాలుగు మార్గాల ద్వారానే వస్తుందని తెలిపారు. ప్రతి గర్భిణీ తప్పకుండా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని, ఒకవేళ గర్భిణీకి హెచ్ఐవీ పాజిటివ్ అని తెలిస్తే తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకి ఎయిడ్స్ రాకు ండా అందుబాటులో మందులు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్క గర్భిణీ ఆస్పత్రిలోనే డెలవరీ అయ్యేలా చూసుకోవాలని అన్నారు. ప్రతి టీబీ పేషెంట్ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిఎన్మ్ స్టాఫ్ నర్స్ నేహ, ఓఆర్ డబ్లు ఎం. భద్రయ్య , ఓర్డబ్లు పి. నిర్మల, పిఈ. రమ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్ అసిస్టెంట్ పోస్టులను బీఈడీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలి

## •కోదాడ బాపూజీ గ్రంధాలయం ఎదుట బీఈడీ అభ్యర్థుల ఆందోళన



**కోదాడ,మార్చి 26 (నినాదం న్యూస్):** ఉపాధ్యాయ ఖాళీల భర్తీలో స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని బిఈడి అభ్యర్థుల నియోజకవర్గ అధ్యక్షుడు శివాజీ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. కోదాడ పట్టణ పరిధిలోని బాపూజి శాఖ గ్రంధాలయం ఎదుట బుధవారం పదోన్నతుల ప్రక్రియకు వ్యతిరేకంగా అభ్యర్థులు నిరసనకు దిగారు. సీనియర్ ఎస్జీటీ టీచర్లకు 70శాతం మేరా పదోన్నతులు కల్పించడంతో బీఈడి అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. టీచర్ పోస్టుల ఖాళీలాల్లో 30 శాతం మాత్రమే నేరుగా భర్తీ చేస్తూ, 70 శాతం ఖాళీలు పదోన్నతులు కల్పిస్తుండం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ రాష్ట్రంతో సహా ఇతర రాష్ట్రాల మాదిరిగా 70 శాతం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను బీఈడీ అభ్యర్థులతోనే నింపుతున్నట్లుగా మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. పదోన్నతుల అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. బీఈడీ అభ్యర్థులు రాంబాబు, శ్రీను, సందీప్, నరేష్, శోభ, సారిక, సుమ, తులసి, రమేష్ శ్రీరాములు, శ్రీకాంత్, రామారావు, ఉపేందర్ పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

## •ఎంపీడీఓ శ్రీనివాసరావు

**మహాముత్తారం, మార్చి 26 (నినాదం న్యూస్):** అన్ని కులాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు. ఆసక్తి కల్గిన యువకులు మీ సేవలో దరఖాస్తు చేసుకుని అన్‌లైన్ దరఖాస్తు పత్రం, ఆధార్ కార్డు, పాన్ కార్డ్, రేషన్ కార్డ్, కుల దృవీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో కూడిన మూడు సెట్‌లను మండల పరిషత్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.





# ఘనంగా వరల్డ్ టీబీ డే

**శేరిలింగంపల్లి, మార్చి26(నినాదం న్యూస్):** వరల్డ్ టీబీ డే సందర్భంగా శేర్లింగంపల్లి ఎమ్మెల్యే శ్రీ అరకపూడి గాంధీ చేతుల మీదుగా TB IEC మెటీరియల్ ఆవిష్కరించారు. వరల్డ్ టీబీ డే సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ ఉమా దీపిక మాట్లాడుతూ ఎవరికైతే రెండు వారాలకు మించి దగ్గు కానీ జ్వరం కానీ, బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీవీకి సంబంధించిన పరీక్షలు మరియు మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. వరల్డ్ టీబీ డే సందర్భంగా జిల్లాలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన బి సంతోష్ ఆశలు ధర్మజా , స్వాతిని జిల్లా ప్రధాన వైద్యాధికారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ ఉమా దీపిక, ట్రీట్మెంట్ సూపర్వైజర్ బీములు, సంతోష్, స్టాటిస్టిస్కల్ అసిస్టెంట్ సతీష్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాలనీవాసుల ఫిర్యాదుకు స్పందించిన మాజీ కార్పొరేటర్

- మున్సిపల్ నిధుల నుంచి 2 లక్షలు మంజూరు



**జవహర్‌నగర్, మార్చి 26 (నినాదం న్యూస్):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14 డివిజన్ సిపిఐ కాలనీ ఫేస్ టు గణేశుని గద్దె నుండి లెవిస్ గేట్ వరకు మురుగునీరు ఏరులై ప్రవహిస్తుండగా స్థానిక ప్రజలు బుధవారం మాజీ కార్పొరేటర్ సంగీత రాజశేఖర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను వివరించగా స్పందించిన మాజీ కార్పొరేటర్ సంగీత రాజశేఖర్ బుధవారం జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ వసంతనను కలిసి కాలనీ సమస్యను వివరించారు. దీనికి స్పందించిన కమిషనర్ మున్సిపల్ సాధారణ నిధుల నుండి రెండు లక్షల రూపాయలు కేటాయించారు. ఈ మేరకు బుధవారం వర్క్ ఇన్స్పెక్టర్ రాజు కాంట్రాక్టర్‌తో కలిసి సమస్య ఉన్న స్థలానికి వెళ్లి స్వయంగా సమస్యను చూసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సమస్యకు సానుకూలంగా స్పందించినందుకు 14వ డివిజన్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సంగీత రాజశేఖర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ లోని పరిధిలోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజలకు సేవ చేస్తేనే దేశానికి సేవ చేసినట్లు అని, సేవే దైవం అని అది మానవ గుణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పి శివ, ఆనంద్, శివకుమార్ మహిళలు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను చెల్లించని యజమానులకు అద్భుత అవకాశం

- ఓటిఎస్‌ను ఉపయోగించుకోండి
- కమిషనర్ వసంత



**జవహర్‌నగర్, మార్చి 26 (నినాదం న్యూస్):** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు మున్సిపల్ కార్పొరేషన్ ఆస్తి పన్ను చెల్లించని యజమానులకు అద్భుతమైన అవకాశాన్ని కల్పించిందని జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ వసంత తెలిపారు. ఈ మేరకు కమిషనర్ మాట్లాడుతూ 2024- 2025 సంవత్సరం వరకు చెల్లించవలసిన ఆస్తుపన్ను బకాయల మొత్తాన్ని కేవలం 10 శాతం వడ్డీతో ఏకకాలంలో పూర్తిగా చెల్లించి వడ్డీ పై 90% మాఫీని పొందండని పిలుపునిచ్చారు. మీ ఆస్తి పన్ను బకాయలు చెల్లించేందుకు ఇదే సరైన సమయమని 90 శాతం వడ్డీ మాఫీ పొందేందుకు ఇదే గొప్ప అవకాశం అని తెలిపారు. ఈ వన్ టైం స్కీం పథకాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆస్తి పన్ను చెల్లిస్తే నే కార్పొరేషన్ అభివృద్ధి చెందుతుందని సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ఇది పట్టణ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని బకాయిలు చెల్లించేందుకు మార్చి 31 వ తారీకు చివరి అవకాశమని తెలిపారు.

# తై బజార్ వ్యాపారుల కోసం.. వసూళ్ళ ధరల పట్టిక విడుదల

**జవహార్‌నగర్, మార్చి 26 (నినాదం న్యూస్):** జవహార్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్, మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలో తై బజార్ వ్యాపారాల కోసం వసూళ్ళ ధరల పట్టికను విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ ధరలు అమలులో ఉంటాయని జవహర్ నగర్ మున్సిపల్ అధికారులు వెల్లడించారు.

# బాలాజీ వెంకటేశ్వర స్వామి హుండీ లెక్కింపు



**అల్వాల్, మార్చి 26 (నినాదం న్యూస్):** శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామిదేవస్థానము యొక్క హుండీలు దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి శ్రీ కే.మోహన్ రెడ్డి సమక్షం లో విప్పి లెక్కించగా 54 రోజులకు గాను రూ. 1,25,617/- ల ఆదాయం రావడం జరిగినది. ఇట్టి హుండీల లెక్కింపు నందు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా సంజయ్ గోపాల్ సైచర్, కార్యనిర్వాహణాధికారి యం.వీరేశం, అల్వాల్ జేఏసీ నాయకులు పి.సురేందర్ రెడ్డి, భక్తులు బి.వి. రాంచందర్ రావు, బి.యన్. శివరామ క్రిష్ణ, నాగేష్, శ్రీవాణి, చంద్రమణి, నిర్మలా రెడ్డి, కవిత, రోజా, హేమావతి, రవిచంద్ర, యశ్వంత్, మోహన్ రావు, శివరాణి, విజయ భారతి, శిరీష, పద్మావతి, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మరకత లక్ష్మి గణపతికి విశేషపూజలు

**అల్వాల్, మార్చి 26 (నినాదం న్యూస్):** కానాజిగూడ డైరీ ఫాం రోడ్లో వెలిసిన మరకత శ్రీ లక్ష్మి గణపతి ఆలయంలోఆలయంస్వామివారికి ప్రత్యేక హెూమాలు నిర్వహించిన ఆలయ వ్యవస్థాపకులు కార్యనిర్వహకులు డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి. వచ్చేనెల నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు జరుపుటకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని భక్తులను కోరారు.



# చెత్త డంపింగ్‌యార్డ్ తొలగించాలి

- వారం రోజులుగా కొనసాగుతున్న నిరసన దీక్షలు



**అల్వాల్, మార్చి 26 (నినాదం న్యూస్):** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్లోని హిందూ స్మశాన పరిరక్షణలో భాగంగా స్థానిక కాలనీవాసులు గత వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. గత 11 రోజులుగా ఇక్కడ స్థానిక సంఘాల ఆధ్వర్యంలో జేఏసీగా ఏర్పడి మహానిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా మచ్చ బొల్లారం హిందూ స్మశాన వాటిక సంబంధించి భూమిలో జిహెచ్ఎంసి నిర్వహిస్తున్న చెత్తా డంపింగ్ యార్డ్ తొలగించాలని దీనితో పాటుగా ఇక్కడ ర్యాంకి సమస్త చేపట్టిన అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలంటూ జేఏసీ ప్రధాన డిమాండ్ ఈ నేపథ్యంలో బుధవారం అధికారులుఅక్కడి స్థితిగతులను అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, హైడ్రా తహసిల్దార్ హేమమాలిని అల్వాల్ డిప్యూటీ తహసిల్దార్ అల్వాల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ ల తో కలిసి పరిశీలించిన హైడ్రా ఇన్స్పెక్టర్ ఆదిత్య గౌడ్. అనంతరం హైడ్రా అధికారులు మాట్లాడుతూ పై అధికారులతో మాట్లాడి సర్వే నిర్వహించి హిందూ స్మశాన వాటికకు కేటాయించిన భూమిని వారికి దక్కే విధంగా చూస్తానని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ జేఏసీ నాయకులు సుధాకర్ పడాల ఉదయ్, ప్రకాష్, కవిత, అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, జేఏసీ సురేందర్ రెడ్డి, డోలి రమేష్, అనిల్ కిషోర్ గౌడ్, ఢిల్లీ పరమేష్, ప్రేమ్, శోభన్ బాబు, ,పవన్, చరణ్ గిరి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ నిరుపేదల పాలిట వరం



**కుత్బుల్లాపూర్, మార్చి 26 (నినాదం న్యూస్):** ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదల పాలిట వరములాంటిదని బి ఆర్ ఎస్ నేతలు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం డివిజన్ బాలయ్య నగర్ ప్రాంతానికి చెందిన కొరవర నర్సమ్మ భర్త బాసప్ప (36), రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన కేశవ్ పట్ల అరులప్ప తండ్రి జోసెఫ్ (48) లు గత రెండు రోజుల క్రితం వారి ఆరోగ్య పరిస్థితిపై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ను ఆశ్రయించారు. వారి ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితిపై చలించిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద ప్రత్యేక శ్రద్ధతో ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా కొరవర నర్సమ్మ భర్త బాసప్ప 2 లక్షలు, రంగారెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన కేశవ్ పట్ల అరులప్ప తండ్రి జోసెఫ్ 2 లక్షల కు ఎల్ఓసీ మంజూరు చేయించారు. బుధవారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు ఎల్ఓసీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు ఆర్థిక భద్రతనిచ్చేది, ఆరోగ్య భరోసానిచ్చేది సీఎం సహాయనిధి అని, నిరుపేదల ఆరోగ్య బాగోగులకై చలించే నాయకులు, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేదల ఆరోగ్యపరిస్థితిపై ఎప్పుడూ ముందుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, గాజుల రామారం డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, బాలయ్య నగర్ కాలనీ వెల్ఫేర్ అధ్యక్షులు నగేష్, సీనియర్ నాయకులు ఓంకార్ రెడ్డి, సుధాకర్, అఖిల్, రాజు, కె.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు సిబ్బందిని పెంచండి



- నిరాహార దీక్షలు చేసినా మార్పు రాలేదు
- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

**కొడంగల్, మార్చి 26 (నినాదం న్యూస్):** బొంరాస్ పేట్ మండల కేంద్రంలోని ఎస్బిఐ బ్యాంకు లో సిబ్బందిని పెంచాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు.బ్యాంకులో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఖాతాదారులకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయనీ, సిబ్బందిని పెంచాలని గత నాలుగు మాసాల క్రితం మూడురోజుల పాటు రిలే నిరాహారదీక్షలు కొనసాగించామని,ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు వినతిపత్రాల ద్వారా వివరించామనీ, ఇంత చేసిన మార్పు రాలేదని, సిబ్బంది పెరగలేదనీ, ఖాతాదారులకు ఇబ్బందులు తప్పడం లేదంటూ వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. వేసవి కాలంలో ఖాతాదారులు బ్యాంకు ల చుట్టూ తిరుగుతూ, వడదెబ్బ వంటి తదితర ప్రమాదాల భారిన పడే అవకాశం ఉందని,ఒకవేళ అలాంటిదే జరిగితే బ్యాంకు అధికారులు బాధ్యత వహించాలని అన్నారు.సిబ్బందిని పెంచకపోతే త్వరలో మరోసారి ఖాతాదారులను, రైతులను కూడగట్టుకొని భారీఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ హక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సిములు, డి.వెంకటయ్య, చిన్నయ్య, మల్లప్ప, రాములు పాల్గొన్నారు.

# బెట్టింగ్‌లతో జీవితాలను నాశనం చేసుకోకూడదు

- బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి



**చేవెళ్ల, మార్చి 26(నినాదం న్యూస్):** యువత బెట్టింగ్ వ్యసనానికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకో కూడదని బిజెపి మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలో (నినాదం) పాత్రికేయులతో మాట్లాడుతూ యువత బెట్టింగ్ వ్యసనాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోకూడదని, ఇప్పటికే లోన్ యాప్‌ల కారణంగా ఎంతో మంది యువత అప్పుల పాలయ్యారు అన్నారు. అప్పుల కారణంగా ఇటీవల యువత ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోందని, క్రికెట్ బెట్టింగ్ జోలికి యువత వెళ్లొద్దని నేరుగా గాని, ఆన్లైన్లో కానీ బెట్టింగ్‌కు పాల్పడడం ప్రభుత్వం నిషేధించిందని అన్నారు.బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, ఈ విషయాలను పరిగణలోకి తీసుకొని యువత అప్రమత్తంగా ఉండాలని, బెట్టింగ్ వ్యసనానికి లోనై జీవితాలను పాడు చేసుకోవద్దు అన్నారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లల ప్రవర్తన ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని వ్యసనాలకు లోనైతే వెంటనే అప్రమత్తమై వాటికి దూరం కోరారు.

# పేదల మనిషిగా ధర్మభిక్షం ఆదర్శప్రాయుడు

- సిపిఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్



**జవహర్‌నగర్, మార్చి 26 (నినాదం న్యూస్):** ప్రజల మనిషిగా కామ్రేడ్ ధర్మ బిక్షం ఆదర్శప్రాయుడని పీడిత ప్రజల హక్కుల కోసం చివరి శ్వాస వరకు పోరాడిన గొప్ప పోరాట యోధుడని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిపిఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ అన్నారు. కామ్రేడ్ ధర్మ బిక్షం 14వ వర్ధంతిని పురస్కరించుకొని కాప్రా సిపిఐ పార్టీ అధ్యక్షుడు దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గిరి ప్రసాద్ నగర్ లో సిపిఐ పార్టీ కార్యాలయంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దున్నేవాడిదే భూమి అనే నినాదంతో సాగించిన ఉద్యమ కృషి స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థి దశ నుంచే తోటి స్నేహితులను చైతన్యపరిచి నిజాం నవాబు జన్మదిన వేడుకలను తిరస్కరించిన ధైర్యశాలి అని పేర్కొన్నారు. చట్టసభల్లో పేద ప్రజల గొంతుకై పోరాడుతూ వారి హక్కుల కోసం ఎన్నో పోరాటాలు త్యాగాలు చేశాడని గుర్తు చేశారు. అనంతరం కామ్రేడ్ ధర్మ బిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యం, రాజేశ్వరి, స్వరూప, ఎల్లయ్య, కొమురయ్య, కవిత, అనసూయ, మల్లిక, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం





- చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్

**చేవెళ్ల, మార్చి 26(నినాదం న్యూస్):** గ్రామాలలో సిసి కెమెరాల ఏర్పాటు అభినందనీయమని,సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతంలో దొంగతనాలను నేరాలను అదుపు చేయడానికి వీలవుతుందని చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. చేవెళ్ల మున్సిపల్ పట్టణ పరిధిలోని రావులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రామచంద్రయ్య గౌడ్ సహకారంతో గ్రామంలో ఉన్న సీసీ కెమెరాలను మరమ్మతులను చేయించారు. ఈ నేపథ్యంలో రావులపల్లి గ్రామ పంచాయతి కార్యాలయంలో సి సి కెమెరాలను చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీ కెమెరా ద్వారా గ్రామం నిఘానిడలో ఉంటుందని, నేరాలను దొంగతనాలను అదుపు చేయవచ్చని అన్నారు. గ్రామాలలో పట్టణాలలో చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా తీసుకోవాలి అని అన్నారు. వాహనాల యజమానులు తప్పకుండా ఇన్సురెన్స్ చేపించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి సంతోష్ రెడ్డి పోలీస్ సిబ్బంది గ్రామ నాయకులు మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య గౌడ్ మాజీ ఉప సర్పంచ్ నాగి రెడ్డి పిఏసిఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్ మాజీ వార్డ్ సభ్యులు కావలి సత్యనారాయణ చందనెల్లి అశోక్ చాకలి జంగయ్య గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

- పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయండి
- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి




**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, మార్చి26(నినాదం న్యూస్):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి బుధవారం మూడు చింతలపల్లి తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేసారు. ధరణిలో పెండింగ్ వివరాలపై అదనపు కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ధరణిలో ఎన్ని పెండింగ్ ఉన్నాయని ఎంఆర్ఓ ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ తొందరగా క్లియర్ చేయాలని కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఎంఆర్ఓ నర్సింహారెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక సమస్యల పరిష్కారానికి.. నిరంతరం కృషి చేస్తా..

- కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్, మార్చ్ 26 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ షాపూర్ నగర్ లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద నియోజకవర్గం ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో నెలకొన్న స్థానిక సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రానున్న రోజులలో నియోజకవర్గం గణనీయంగా అభివృద్ధి చెందుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సకాలంలో సీసీ రోడ్లు పూర్తిచేయాలి

- కార్పొరేటర్ కొలుకుల జగన్



**కుత్బుల్లాపూర్, మార్చి 26 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్ లో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ స్థానిక సమస్యలపై పాదయాత్ర నిర్వహించి సమస్యలను ప్రజల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అంజయ్య నగర్ లో నూతనంగా చేపట్టిన సిసి రోడ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంజయ్య నగర్ లో మిగిలిన రోడ్డులను త్వరలోనే వేయిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను కోరినారు. ఈ కార్యక్రమంలో సురేందర్, మురళి, బుచ్చిబాబు, గణేష్, సోమేశ్, వీరేశం, కృష్ణ, మారుతి, భోగేశ్వర్, వర్క్ ఇన్స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని ఆక్రమించిన అపర్ణ కన్‌స్ట్రక్షన్‌పై చర్య తీసుకోవాలి

- సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్



**చేవెళ్ల, మార్చి(నినాదం న్యూస్):** ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న అపర్ణ కన్స్ట్రక్షన్ యజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అలీ దేవేందర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకర్పల్లి మండలంలోని కొండకల్ తండాలో గల సర్వేనెంబర్ 392లో 217 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న అపర్ణ డెవలపర్స్ యాజమాన్యంపై అసైన్మెంట్ చట్ట ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సిపిఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అలీ దేవేందర్ అన్నారు. ఈ సర్వే నంబర్ను నిషేధిత జాబితాలో పెట్టాలన్నారు. సర్వేనెంబర్ 363, 369,377, 391లో గల భూమిపై గిరిజనులు అనేక సంవత్సరాలు ఆధారపడి బతుకుతున్నారని ఈ భూమిని కొమ్మ విక్రమ్ రెడ్డి మరియు అపర్ణ డెవలపర్స్ యాజమాన్యం ఆంధ్రప్రదేశ్ అసైన్మెంట్ చట్టాన్ని తుంగలో తొక్కి దురాక్రమణ చేస్తున్నారని అన్నారు అదేవిధంగా గిరిజనులకు సంబంధించిన పిటి భూముల పైన కూడా అపర్ణ కన్స్ట్రక్షన్ యాజ మాన్యం కొమ్మ విక్రం రెడ్డి కలిసి రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అండదండలతో భూములు కాజేయాలని చూస్తున్నారని అన్నారు కాబట్టి వెంటనే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, అపర్ణ డెవలపర్స్ యాజమాన్యం, కొమ్మ విక్రం రెడ్డి లపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిపక్షంలో వేల మంది పేదవారితో అక్కడ గుడిసెలు వేసి పేదవారికి పంచుతామని అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం శంకర్పల్లి మండల నాయకులు మల్లేష్, శ్రీనివాస్, రాములు, ఎల్లారెడ్డి, శ్రీనివాస్, నరసింహ పాల్గొన్నారు.

# ఇఫ్తార్ విందులు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయి

- ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరైన నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్



**కరీంనగర్, మార్చి 26(నినాదం న్యూస్):** ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయంది. గంగా జమున తెహజీబ్ కు ప్రతిరూపంగా మారుతాయని నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు, ఎంఐఎం పార్టీ కరీంనగర్ ఆధ్వర్యంలో కాశ్మీర్ గడ్డ ఐబీఏ గార్డెన్ లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ కు, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎం మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు అలుగునూర్ బ్రిడ్జి వద్ద ఘన స్వాగతం పలికారు, ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదరులకు ఖర్జూర వండ్లు, డ్రైఫ్రూట్స్ ఏర్పాటు చేసి రోజును విరమింపజేశారు. ఈ సందర్భంగా మాజిద్ హుస్సేన్ మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు స్నేహబంధాన్ని పెంపొందిస్తాయని, హిందూ ముస్లిం ఐక్యతకు మారుపేరుగా నిలుస్తాయన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో అల్లాహ్ మెప్పు కోసం నెలరోజులపాటు కఠోర మైన ఉపవాస దీక్షలు పాటించి, నెల రోజులు ఖురాన్ పారాయణం, తరావీహ్ నమాజ్ క్రమం తప్పకుండా ఆచరించి పుణ్య ఫలాలు పొందడం గొప్ప ధార్మిక సంకల్పమని కొనియాడారు. సనిషి జీవితంలో సంపాదన, డబ్బు కంటే ఆధ్యాత్మిక చింతనే ముఖ్య మన్నారు. ఏడాదిలో 11 నెలలుతమకోసం, ఒక నెల రమాజన్ మాసం మొత్తం అల్లాహ్ కోసం కేటాయించి, చిన్న తప్పు చేయకుండా, చెడుకు దూరంగా ఉండి పవిత్ర మైన ఉపవాస దీక్షలు పాటించడం అంటే ఏకేశ్వ రుడైన అల్లాహ్ కరుణా కటాక్షములు పొం దడమేనన్నారు. ఇస్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌కు పూలమాలలు, శాలువాతో ఇస్లామీయ సంప్రదాయ బద్ధంగా ఎంఐఎం నాయకులు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ దావాతే ఇఫ్తార్ విందుకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 4వేల మందికి పైగా హాజరై విజయవంతం చేశారు. హాఫిజ్ యూసుఫ్ సమాజ్ ముగ్రిబ్ నదివించగా, మౌలానా అలీముద్దీన్ నిజామి, మౌలా నా ఘుఫ్రాన్ దుఆ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, జాయింట్ సెక్రట రీలుసయ్యద్ మొయిజుద్దీన్‌ఖాద్రీ, ఖమరుద్దీన్, ఆతిన, కోశాధికారి ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, అలిబాబా, అజర్‌దబీర్, ఉమ్మడి జిల్లా ఎంఐ ఎం నాయకులు, నగర ఎంఐఎం డివిజన్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలు, ఎంఐఎం అభిమా నులు పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

## మృతుడి కుటుంబానికి బీమా చెక్కు అందజేత

- గాయత్రి బ్యాంకు సేవలు అభినందనీయం
- జమ్మికుంట ఏఎంసీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం



**జమ్మికుంట, మార్చి 26 (నినాదం న్యూస్) :** గాయత్రి కో-ఆపరేటివ్ బ్యాంక్ ఖాతాదారుడైన ముడతనపల్లి రాజు ప్రమాదవశాత్తు మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులకు లక్ష రూపాయల చెక్కును జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం చేతుల మీదుగా బుధవారం అందజేశారు. జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ గ్రామానికి చెందిన ముడతనపల్లి రాజు గాయత్రి కోపరేటివ్ బ్యాంకు లో ఖాతాదారుడు కావడంతో ప్రమాదవశాత్తు అతను మరణించగా గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతా పై ప్రమాద బీమా సౌకర్యం ద్వారా అతని తల్లి సుశీలకు లక్ష రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ ఖాతాదారులకు కనీస డిపాజిట్ తోనే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తూ పేద మధ్యతరగతి వినియోగదారులకు ప్రమాద బీమా కల్పిస్తూ వారికి అండగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మహేందర్, పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసిన సుడా చైర్మన్



**కరీంనగర్, మార్చి 26(నినాదం న్యూస్):** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఇంకా బలోపేతం చేయడానికి జిల్లా కాంగ్రెస్ నగర కాంగ్రెస్ అధ్యక్షులతో ఢిల్లీలో భేటీ అయి పలు అంశాలపై చర్చించిన ఏఐసిసి ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్. ఇందులో భాగంగా ఢిల్లీలో నిజామాబాద్ డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణుతో కలిసి మీనాక్షి నటరాజన్ తో భేటీ అయిన సుడా చైర్మన్ కరీంనగర్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి.

# ఇసుక లోడింగ్ కోసం బారులు తీరిన లారీలు

- డీడీలు కట్టి వారం రోజులు అయినా ఇసుక లోడ్ చేస్తలేరు
- మానేరులో అరిగోస పడుతున్న లారీ డ్రైవర్లు



**జమ్మికుంట, మార్చి 26 (నినాదం న్యూస్):** వీణవంక మండలం కొండపాక ఇసుక క్వారీ వద్ద ఇసుక లోడింగ్ కోసం లారీ డ్రైవర్లు వారం రోజులుగా ఎదురు చూస్తూ అరిగోస పడుతున్నారు. ఇసుక లోడింగ్ కోసం డీడీలు కట్టి వారం రోజులు గడుస్తున్న ఇసుకను లోడ్ చేయకపోవడంతో లారీ డ్రైవర్లు హరిగోస పడుతున్నారు. డీ డీ కట్టిన 24 గంటల్లో ఇసుకను పంపిణీ చేయాల్సిన ప్రభుత్వం వారాలు గడుస్తున్న ఇ సు క లోడ్ లు చేయక పోవడంతో లారీ డ్రైవర్లు అరిగోసాపడుతున్నారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండపాక ఇసుక క్వారీ కి వారం రోజుల క్రితం ఆయా జిల్లాలకు చెందిన సుమారు 50 లారీలు లోడ్ కోసం వచ్చాయి. కానీ క్వారీ నిర్వాహకులు క్వారీ మూసివేసి వెళ్ళిపోయారు. ఎన్నిసార్లు అడిగినా ఇసుకలేదని తిరిగి వెళ్లిపోవాలని చెబుతున్నారన్నారు. తాగడానికి నీళ్లుకూడ లేక కాలువల్లో నీళ్ళు తాగు తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డీడీ లు వేరే క్వారీకి మార్చుమన్న మార్చకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారి కాళ్ళు మొక్కిన సమస్య తీరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధి కారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ విషయం పై మైనింగ్ పీ ఓ ను ఫోన్ లో సంప్రదించడానికి ప్రయత్నం చేయగా వారు స్పందించలేదు.

## టాస్క్ శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్



**జమ్మికుంట, మార్చి 26 (నినాదం న్యూస్):** ఉద్యోగ పోటీ పరీక్షల్లో రాణించేలా కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా|| రమేష్ కోరారు. కళాశాలలో టాస్క్ తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్ని పోటీ పరీక్షల్లో ఉపయోగపడే ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ అంశాలపై రెండు రోజులు నిర్వహంచే శిక్షణా తరగతులను బుధవారం ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్ శిక్షణా తరగతులు విద్యార్థులు వ్రాసే అన్ని పోటీపరీక్షలకు ఉపయోగ పడుతుందని అన్నారు. ఈ తరగతులకు టాస్క్ మెంటర్ %జీ%. రాజేష్ రెండు రోజులు శిక్షణ ఇవ్వనున్నారని, శిక్షణ తర్వాత పెట్టె అసెన్ మెంట్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వబడునని తెలిపారు. కళాశాల వైస్-ప్రిన్సిపల్ డా. ఎస్ ఓదెలుకుమార్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ కే సి కో-ఆర్డికేటర్ కె ఉమాకిరణ్ , అధ్యాపకులు డా. కె రాజేంద్రం డా. కె గణేశ్, డా, శ్యామల , కిరణ్ కుమార్ , డా. ఇ.రవి , రాజకుమార్, రవీందర్, డా కె మాధవి, డా. సుష్మ, డా. రవి ప్రకాష్, సాయి, మమత, డా, శ్రీనివాస్, అరుణ్ కుమార్ , శ్రీనివాస్, రమేష్, శ్రీశాంత్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వారసంత వేలానికి టెండర్ల ఆహ్వానం



**వెల్గటూర్,మార్చి26(నినాదం న్యూస్):** మండల కేంద్రంలోని వెల్గటూర్ పట్టణంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారసంత వేలానికి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. వార వారం నిర్వహించే కూరగాయల వారసంత వేలానికి 2025-26 సంవత్సరానికి గాను ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 28 వ తేదిన శుక్రవారం రోజున ఉదయం 10.30 గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరిగే వేలంలో ఆసక్తి గల అభ్యర్థులు పాల్గొనాలని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# అల్ట్రా సౌండ్ మెషిన్ సీజ్ చేసిన స్పెషల్ డ్రైవ్ బృందం



**కరీంనగర్, మార్చి 26(నినాదం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ గౌరవ కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో అల్ట్రా సౌండ్ స్కానింగ్ ఫెర్టిలిటీ కేంద్రాల స్పెషల్ డ్రైవ్ టీం తనిఖీలలో శ్రీలత మెటర్నటీ నర్సింగ్ హోమ్ హాస్పిటల్లో అనధికారికంగా రిజిస్టర్డ్ కానీ మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను కనుగొని రెవెన్యూ, పోలీస్ శాఖ ఏ ఎస్ఐతో కూడిన స్పెషల్ డ్రైవ్ తనిఖీ బృందము శ్రీలత మెటర్నిటీ నర్సింగ్ హోమ్ కి నోటీసు ఇచ్చి మొబైల్ అల్ట్రా సౌండ్ మిషను సీజ్ చేయడం జరిగింది. అదేవిధంగా హాస్పిటల్లో స్కానింగ్ కొరకు వచ్చే పేషెంట్లు వివరాలతో కూడిన ఫామ్ ఎఫ్ ఫారం ను పూర్తి పూర్తి చేసి ఏ రోజుకు ఆ రోజు ఆన్లైన్లో అప్డేట్ చేస్తున్నటువంటి విధానాన్ని, అవుట్ పేషెంట్ రిజిస్టర్‌లు, పి.సి.పి.ఎన్.డి.టి జిల్లా అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ ద్వారా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్, అందులో పని చేస్తున్న డాక్టర్స్ క్వాలిఫికేషన్ వెరిఫికేషన్ మరియు గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం - 1994 మరియు రూల్స్ 1996 అమలవుతున్న తీరు, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడూ స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసినవారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్ట ప్రకారం మూడు సంవత్సరాల వరకు జైల్ శిక్ష, పది వేల రూపాయల జరిమానా విధిం చబడుతుందని, అలాగే కఠిన చర్యలు తీసు కోవడం జరుగుతుందని తెలిపే బోర్డులు ప్రదర్శిస్తున్నారా లేదా, స్కానింగ్ కేంద్రాలలో కచ్చితంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ధరల పట్టిక, సరైన రికార్డుల నిర్వహణ ఉండాలని, ప్రతి నెల జరిగే స్కానింగ్ వివరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి పంపిస్తున్న తీరు, లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని చెప్పకూడదని బోర్డులు స్కానింగ్ కేంద్రాలలో ప్రదర్శిం చడాన్ని తనిఖీ చేయడం జరిగింది. ఈ స్కానింగ్ కేంద్రాల, ఫెర్టిలిటీ కేంద్రాల యొక్క తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ వెంకట రమణ తెలియజేశారు. ఈ స్పెషల్ డ్రైవ్ తనిఖీలో మరియు మొబైల్ అల్ట్రా సౌండ్ మిషన్ సీజ్ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, డాక్టర్ వెంకటరమణ , రెవె న్యూ ఇన్స్పెక్టర్ రాములు జూనియర్ అ సిస్టెం ట్ బాపు దేవ్ , ఏయస్ఐ. విజయమణి , ప.ఓ.,డిటటి. డా. ఉమాశ్రీ, పి.సి.పి.ఎన్.డి.టి ప్రోగ్రామ్ అధికారి, డా. సనాజవేరియా ,సఖి కన్సల్టెంట్, డి. లక్ష్మి , డాటాఎంట్రీ ఆఫరేటర్, కె. రమేశ్, డెమో, రాజ గోపాల్ , సుపెర్వైజర్ సయ్యద్ సబీర్ పాల్గొన్నారు.

## అడ్వాంట సీడ్ వారి సేవలు అభినందనీయం

ప్రభుత్వ పాఠశాలకు ఫర్నీచర్ వితరణ



**జమ్మికుంట, మార్చి 26 (నినాదం న్యూస్):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాల కు అడ్వాంట సీడు ఆర్గనైజర్ ఎల్లంకి తిరుపతిరావు ఆధ్వర్యంలో బీరువా, 5 కుర్చీలు, 2 టేబుల్ల లతో పాటు విద్యార్థులకు పెన్నులు, నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి మాట్లాడారు. అడ్వాంట సీడు సంస్థ వారు రానున్న రోజుల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అదే విధంగా సీడ్ కంపెనీ ఆర్పియం బొడిగె నాగరాజు మాట్లాడుతూ.. ధర్మారం గ్రామ రైతులు అడ్వాంటా సీడ్ ద్వారా అధిక దిగుబడి పొంది ఎక్కువ లాభాలు పొందుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎం అంజిబాబు, సూపర్వైజర్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్ పోలు వెంకటేష్, మాజీ ప్రజాప్రతినిధులు బొంగోని వీరన్న, మారపల్లి బిక్షపతి, సుధాకర్ రెడ్డి, చేనేత సంఘం చైర్మన్ పెండెం సర్వేషం, పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ బుర్ర సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు హుండీ ఆదాయం కోటి 9 లక్షలు



**మల్యాల ,మార్చి 26 (నినాదం న్యూస్):** జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం వంటిల్లు లెక్కించారు ఈ సందర్భంగా 55 రోజులకు గాను 12 హుండీలు లెక్కించగా హుండీ ఆదాయం నగదు ఒక కోటి 9, లక్షల 13వేల 339 సమకూరగా విదేశీ కరెన్సీ నోట్లు 109 వచ్చినట్లు ఆలయ వర్గాలు వెల్లడించారు. ఈ సందర్భంగా పర్యవేక్షణ అధికారి సుప్రియ ,ఆలయ ఈవో శ్రీకాంత్ రావు, పర్యవేక్షకులు సునీల్, చంద్ర శేఖర్ ,హరిహర నాథ్,శ్రీ లలితసేవాట్రస్టుసభ్యులు పాల్గొన్నారు.

# పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి పాలాభిషేకం

యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు పంజాల కృపాసాగర్



**కరీంనగర్, మార్చి 26(నినాదం న్యూస్):** కరీంనగర్ పట్టణం లోని కోర్టు చౌరస్తా వద్ద గౌరవ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారు చేసిన కృషి ఫలితం వలన శాతవాహన యూనివర్సిటీ కి ఇంజనీరింగ్ మరియు లా కాలేజీ మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్స్ పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా కృపాసాగర్ మాట్లాడుతు ఉద్యమ నాయకుడు విద్యార్థి మన రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం అన్న పోరాట ఫలితమే ఆనాడు కరీంనగర్‌కి శాతవాహన యూనివర్సిటీ వచ్చింది కానీ కొత్త యూనివర్సిటీ కావడం వలన కొన్ని కోర్సుల్లో ఉన్నత విద్యను యూనివర్సిటీ అందించింది ఆనాడు ఇంజనీరింగ్ కళాశాల లా కళాశాల ఏర్పాటు కాలేదు అనంతరం వచ్చిన %ఎతీం% ప్రభుత్వం కనీసం యూనివర్సిటీని పట్టించుకున్న పాపాన పోలేదు .కానీ నేడు ప్రజా ప్రభుత్వం వచ్చిన తరువాత పొన్నం ప్రభాకర్ ముఖ్య మంత్రిని విజ్ఞప్తి చేసి నా జిల్లా విద్యార్థులకు మెరుగైన విద్య అందించా లని అనే ఉద్దేశంతో ఉన్న యూనివర్సిటీని అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని వేడు కోవడంతో , నేడు ప్రభుత్వం జీవో జారీ చేసి శాతవాహన యూనివర్సిటీకి లా మరియు ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది,ఇది కేవలం పొన్నం ప్రభాకర్ పోరాట పలితం వారికి కరీంనగర్ పట్ల ఉన్న అభిమానం నేడు తెలంగాణ మంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి ఇటు కరీంనగర్ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొన్నం మధు, కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి మడుగుల ప్రవీణ్, అర్జున్ గౌతం, కరీంనగర్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు జెర్రిపోతుల వాసు, ప్రధాన కార్యదర్శులు కొయ్యాడ వేణు , గాలి అనిల్, పట్టణ మండల అధ్య క్షులు ఉప్పరి విశాల్ , కొత్తపల్లి మండల అధ్యక్షులు కొక్కుసందీప్ ము దిరాజ్, రూరల్‌మండల అధ్యక్షులు గట్టు ప్రశాంత్ మరియు జాపశ్రవణ్‌రెడ్డి, సమ్రాట్, ఉల్లెందుల అనిల్,బూస ప్రశాంత్, కడె ప్రశాంత్, అరుణ్, బుస వంశి,సాయినితిన్,మహేష్ పాల్గొన్నారు.

## ఆపదలో అండగా నిలిచిన ఆర్ఎంపీ డాక్టర్ రవి

- పది పరీక్ష రాస్తున్న విద్యార్థినికి కడుపునొప్పి
- స్పందించి హాస్పిటల్‌కు తరలించిన టిఆర్ఎస్ నేత మొలుగు దిలీప్



**జమ్మికుంట, మార్చి 26 (నినాదం న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థిని అంజలికి కడుపునొప్పి రావడంతో సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్లి మానవత్వాన్ని చాటుకున్నారు. జమ్మికుంట పట్టణంలోని బాలికల పాఠశాలలో పదవ తరగతి పరీక్షా కేంద్రానికి వచ్చినటువంటి కనకం అంజలి కడుపునొప్పితో బాధపడుతున్న విషయాన్ని గమనించిన స్థానిక ఆర్ఎంపీ డాక్టర్ రవి టిఆర్ఎస్ నేత ములుగు దిలీప్ కు సమాచారం అందించడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఉద్యమ రవి కానిస్టేబుల్, మొలుగు దిలీప్ దగ్గర్లో ఉన్న సురక్ష హాస్పిటల్‌కి తీసుకువెళ్లి ఆమెకి ప్రథమ చికిత్స అందించి మళ్లీ తిరిగి పరీక్షా కేంద్రం వద్దకు తీసుకువచ్చి ఆమెను పరీక్ష రాసే విధంగా సహకరించారు . విద్యార్థిని పట్ల మానవత్వం చాటుకున్నటువంటి అందరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ సకాలంలో స్పందించిన స్థానిక పద్మశాలి వాడకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ రవిని అభినందించారు.

## జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం

**కరీంనగర్, మార్చి 26(నినాదం న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలం, చెర్లబుత్కూర్ గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ పురుమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పురుమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ,కేంద్ర హోం శాఖా హోదాలో అమిత్ షా అంబేద్కర్ని అవమానపరిచేలా చేసిన వాఖ్యలకు నిరసనగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి ఏప్రిల్ 2వ తేదీ నుండి 10 వ తేదీ వరకు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రజా చైతన్య యాత్ర చేపట్టాలని, ఆ కార్యక్రమంలో ప్రతీ కార్యకర్త పాల్గొని ప్రతి గడపకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో ఆసంపెల్లి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిని తిరుపతి, కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షులు కాం రెడ్డి రాంరెడ్డి, కరీంనగర్ రూరల్ మండల గ్రామాల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొనడం జరిగింది.




# రైతు వారధిని ప్రారంభించిన డా.నరేందర్ రెడ్డి



**కరీంనగర్, మార్చి 26(నినాదం న్యూస్):** సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటలు చాలా ఆరోగ్యకరమైనవని మరియు పోషకాలిస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్ రెడ్డి గారు స్థానిక కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసినటు వంటి రైతు వారిది కేంద్రాన్ని నిర్వాహకులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవిం చాలని అనుకుంటున్నాడని మరియు ఆరోగ్య కరమైన వాతావరణ కల్పనకై కృషి చేస్తున్నా రని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదని వారు చెప్పారు.దేశ విదేశాల్లో సైతం ప్రజలం దరూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కోరు కుంటున్నారని ఆరోగ్యకరమైన వాతావరణం సృష్టించాలంటే కాలుష్య నివారణ చేయాలని మరియు ఆరోగ్యకరమైన వాతావరణము కల్పించడానికి ఆరోగ్యకరమైన జీవితాన్ని కల్పించాలని కోరారు. ఈ జీవిత కల్పనకై సేం ద్రియ ఎరువుల ద్వారా పండించిన పలు పం టలను వినియోగించాలని తద్వారా ఆరోగ్య కరమైన వాతావరణం ఏర్పడుతుందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదని చెప్పారు నేటికీ మన భారతదేశంలో పలు గ్రామాలలో, పట్టణాలలో మహానగరాల సైతం సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటలను వినియోగించడం చాలా మంచి పరిణామమని ఈ ప్రక్రియ అనేది దేశవ్యా ప్తంగా కొనసాగించినట్లయితే రైతులకు వెన్ను దన్నుగా నిలిచిన వారవతామని మరియు రైతాంగానికి చేయూత నిచ్చిన వారంతామని చెప్పారు .రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సైతం సేంద్రియ ఆహారానికి ప్రత్యేక నిధులు కేటా యిస్తూ సేంద్రియ ఆహారం పట్ల విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు రాష్ట్ర మరి కేంద్ర స్థాయిలో ప్రత్యేక కమిషన్లు ఉన్నాయని వీటి ద్వారా సేంద్రీయ ఎరువుల ద్వారా పండించే పంటలకు రైతులు కల్పిస్తూ రైతుల్లో విశ్వాసం నింపుతున్నారని వారు చెప్పారు.

ప్రారంభోత్సవంలో కేంద్రంలో ఏర్పాటు చేసిన టువంటి పరిశీలించి హర్షం వ్యక్తం చేస్తూ ప్రాచీన పద్ధతుల ద్వారా వస్తుందని తయారు చేయడం చాలా అశించదగ్గ విషయమని నేటి తరానికి ఇవి ఆదర్శంగా నిలుస్తాయని వారు చెప్పారు భాగంగా స్టాల్ నిర్వాహకులు, ప్రముఖ సామాజిక కార్యకర్త నాగి శేఖర్ గారు ,శ్రేయోభిలాషులు, సిబ్బంది పాల్గొన్నారు.



### ఖాళీ కడుపుతో
# వేడి నీళ్లు తాగితే..

**చాలా మందికి ఉదయం పూట ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీళ్లు తాగడం అలవాటు. ఈ అలవాటు సాధారణంగా బరువు తగ్గడానికి, ఉదయం కడుపుని శుభ్రపరచడానికి సహాయపడుతుంది. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో వేడినీరు తాగడం ఆరోగ్యానికి మంచిదని పలువురు నిపుణులు కూడా చెబుతుంటారు. కానీ అధికంగా తీసుకుంటే అమృతం కూడా విషపూరితంగా మారుతుంది. కాబట్టి పరిమితంగా వేడి నీరు తాగడం ఉత్తమం. అంతేకాకుండా ఉదయం వేడినీరు తాగడం వల్ల కొంత మందికి కొన్ని ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. ముఖ్యంగా కొన్ని ఆరోగ్య సమస్యలున్న వారు ఉదయం పూట ఖాళీ కడుపుతో వేడి నీటిని అస్సలు తాగకూడదు..**

**కడుపులో అల్సర్**

కడుపులో ఆమ్లం అధికంగా పేరుకుపోవడం వల్ల కడుపు, ప్రేగుల లోపలి పొరపై ఏర్పడే పుండును అల్సర్ అంటారు. కడుపులో అల్సర్ ఉన్నవారు ఉదయం ఖాళీ కడుపుతో వేడినీరు తాగకూడదు. ఎందుకంటే ఇది హానికరం. ఇలాంటి వారు వేడినీరు తాగడం వల్ల కడుపులో చికాకు, నొప్పి వస్తుంది. వేడి నీరు కడుపులోని ఆమ్లంతో చర్య జరిపి వాపు, చికాకును కలిగిస్తుంది. ఇది నొప్పిని కూడా పెంచుతుంది. కాబట్టి ఈ రకమైన అలవాటు కడుపు పూతల ఉన్నవారికి మంచిది కాదు.

**గ్యాస్ట్రోఎసోఫాగియల్ రిఫ్లక్స్ వ్యాధి**

కడుపులోని ఆమ్లం అన్నవాహికలోకి తిరిగి ప్రవేసించే సమస్య ఉన్నవారు కూడా వేడి నీళ్లు తాగకూడదు. ఇది కడుపు చికాకుకు కారణమవుతుంది. వేడినీరు తాగడం వల్ల కడుపులోని ఆమ్లం అన్నవాహికలోకి రిఫ్లక్స్ పెరుగుతుంది. అటువంటి పరిస్థితిలో నొప్పిని కలిగిస్తుంది. అంతేకాకుండా ఉదయం ఖాళీ కడుపుతో వేడినీరు తాగడం వల్ల యాసిడ్ రిఫ్లక్స్ సమస్య మరింత తీవ్రమవుతుంది.

**విరేచనాలు**

సాధారణంగా విరేచనాలు వచ్చినప్పుడు కడుపు, ప్రేగులలో చాలా చికాకుగా ఉంటుంది. దీనివల్ల డయేరియా సమస్య పెరుగుతుంది. వేడినీరు తాగడం వల్ల శరీర జీవక్రియ, ప్రేగు కదలికలు వేగవంతం అవుతాయి. ఇది విరేచనాల పరిస్థితిని మరింత దిగజార్చుతుంది.

**వేసవిలో శరీర ఉష్ణోగ్రత పెరుగుదల**

వేడినీరు తాగడం వల్ల శరీరం లోపల వేడి పెరుగుతుంది. ఇప్పటికే అధిక వేడి వంటి సమస్యలతో బాధపడుతుంటే, వేడినీరు తాగడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతుంది. వేడి నీళ్లు తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీనివల్ల అలసట, తలనొప్పి, తలతిరుగుడు వంటివి వస్తాయి.

**మూత్రపిండాల్లో రాళ్లు**

శరీరంలోని ఖనిజాలు ఒకే చోట పేరుకుపోయి ఘనపదార్థాలుగా మారినప్పుడు మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి. ఈ పరిస్థితిలో వేడినీరు తాగడం వల్ల శరీరంలో ఖనిజ అసమతుల్యత ఏర్పడుతుంది. కిడ్నీలో రాళ్లతో బాధపడేవారికి ఎక్కువ వేడి నీరు తాగడం వల్ల మంట, నొప్పి పెరుగుతుంది. రాయి పెద్దదిగా మారే ప్రమాదం కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు.

### నిమ్మ నీరు తాగే
# అలవాటు మీకూ ఉందా..?



**రోగనిరోధక శక్తిని పెంచడానికి చాలా మంది ఖాళీ కడుపుతో నిమ్మ నీటిని తాగుతారు. గ్లాసు గోరువెచ్చని నీటిలో చెంచా తేనె, నిమ్మకాయ రసం కలిపి తాగే అలవాటు కూడా చాలా మందికి ఉంటుంది. అయితే ఇది సరైన అలవాటా? కాదా? అనే సందేహం మీకెప్పుడైనా వచ్చిందా..?**

నిమ్మరసంలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. హైడ్రోక్లోరిక్ ఆమ్లం కూడా ఉంటుంది. ఇది సాధారణంగా కడుపు నుంచి స్రవిస్తుంది. ఈ ఆమ్లం ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. కడుపు ఖాళీగా ఉన్నప్పటికీ, కడుపులో ఆమ్ల స్రావం ఆగదు. అందుకే ఎక్కువసేపు తినకపోతే కడుపులో హైడ్రోక్లోరిక్ ఆమ్లం చాలా వరకు పేరుకుపోతుంది.

ఈ పరిస్థితిలో నిమ్మ నీరు తాగితే, సిట్రిక్ యాసిడ్ కూడా దానితో పాటు శరీరంలోకి ప్రవేశిస్తుంది. దీనివల్ల కడుపులో ఆమ్లం పరిమాణం పెరుగుతుంది. ఫలితంగా, అసిడిటీతో బాధపడే ప్రమాదం ఉంది. అందుకే ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం వల్ల కొంతమందికి గుండెల్లో మంట వస్తుంది. ఫలితంగా పుల్లని త్రేనుపు, కడుపులో అసౌకర్య భావన తలెత్తి, అపానవాయువు వంటి లక్షణాలు సంభవిస్తాయి. దాని వల్ల కడుపు నొప్పి కూడా వస్తుంది. అలాగే తిన్న వెంటనే నిమ్మరసం తాగకూడదు. భోజనం చేసిన వెంటనే నిమ్మకాయ రసం త్రాగడం వల్ల జీర్ణక్రియకు అంతరాయం కలుగుతుంది. అందుకే ఖాళీ కడుపుతో నీరు మాత్రమే తాగడం మంచిది. దీంతో కడుపులో పేరుకుపోయిన ఆమ్లం ఈ నీటితో కలిసిపోయి పలుచబడిపోతుంది. ఆ తర్వాత కొంతసమయానికి నిమ్మ పానీయం తాగడం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవు. అందుకే నిమ్మ నీటిని ఖాళీ కడుపుతో లేదా భోజనం చేసిన వెంటనే కాకుండా.. వేరే సమయంలో తాగాలి. తినడానికి కనీసం 20 నిమిషాల ముందు లేదా తర్వాత నిమ్మ నీరు త్రాగటం మంచిది. అలాగే తిన్న కనీసం 20 నిమిషాల తర్వాత నిమ్మ నీరు త్రాగవచ్చు.



# ఈత సరదా.. డేంజర్ సుమా..!

పొంచి ఉన్న జల ప్రమాదాలు

## మొదలైన ఒంటిపూట బడులు

సెలవుల్లో జాగ్రత్తలు తీసుకోవాలె

## తల్లిదండ్రుల అప్రమత్తతే శ్రీరామరక్ష

ఎండాకాలం ప్రారంభం కావడంతో విద్యాశాఖ పాఠశాలలకు ఒంటిపూట బడులు ప్రకటించింది. ప్రస్తుతం ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతూ 40 డిగ్రీలకు చేరింది. రాబోయే రోజుల్లో మరింత తీవ్రత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. అయితే విద్యార్థులు, చిన్న పిల్లలు, యువత ఎంజాయ్ చేసేందుకు పలు ఆటల పట్ల ఆసక్తి చూపుతారు. ఇందులో ఎక్కువగా ఈత కొట్టడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. కానీ ఆటలు ఒక్కో సారి విషాధాన్ని మిగుల్చుతాయి. చాలా మంది ఎండ తాపం నుంచి రక్షించుకునేందుకు గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని పిల్లలు ఈత కొట్టేందుకు కాలువలు, బావులు, చెరువుల వైపు వెళ్తుంటారు. అయితే చాలా మంది నీటిలో పడి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు అనేకం జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఎక్కడో ఒక చోట ఈత కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. అయితే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. లేదంటే పరిస్థితి చెయిదాటి పోయి కన్నీరే మిగులుతుంది. ఈ క్రమంలో పిల్లల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే పిల్లలకు ఈత కొట్టడంపై ఆసక్తి ఉంటే పెద్దల పర్యవేక్షణలోనే నేర్పాలి. తల్లిదండ్రులకు చెప్పకుండానే ఫ్రెండ్స్‌తో కలిసి మృత్యువాత పడిన సంఘటనలు అనేకం జరుగుతూనే ఉన్నాయి. ఎండల తీవ్రత ఉండడంతో పిల్లలను ఇంటి పట్టునే ఉండడానికి జాగ్రత్తలు తీసుకుంటే వీటిని నివారించవచ్చని అనుభవజ్ఞులు సూచిస్తున్నారు.

-జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం)



**ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి..**

ఐదేళ్లు దాటిన పిల్లలకే ఈత నేర్పడం ప్రయత్నించాలి. విష జ్వరాలు, జలుబు, చర్మ వ్యాధులున్న పిల్లలను ఈతకు దూరంగా ఉంచాలి. ఈత నేర్చుకునే సమయంలో తల్లిదండ్రులు దగ్గర ఉండి నేర్పించాలి. కొంత మంది పిల్లలు నీటిలో మునిగి దాక్కునే ప్రయత్నం చేస్తారు. ఈ క్రమంలో మునిగిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మూర్ఛ వ్యాధి ఉన్న వారు ఈతకు వెళ్ళవద్దు. ఉదయం, సాయంత్రం సమయంలోనే ఈత కొట్టాలి. ఈత నేర్చుకునేందుకు ప్రత్యేక దుస్తులు ధరించాలి. తల వెంట్రుకలకు కప్పి వుంచడానికి



హెడ్ క్యాప్ చెవిలో నీళ్ళు పోకుండా ఇయర్ బ్లాగు వాడాలి. నిపుణులైన ఈతగాళ్లు, తల్లిదండ్రుల సమక్షంలోనే ఈత కొట్టడం నేర్చుకోవడం మంచిది.

**ప్రమాదం పొంచి ఉంటుంది...**


పిల్లలు, విద్యార్థులు సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లే చోట్లలో ప్రమాదాలు పొంచి ఉంటాయి. కొన్ని చెరువులు, కాలువలు, గుంతలు, బావుల్లో మెరికలు ఉంటాయి. వాటిని గమనించకుంటే ప్రమాదం బారిన పడతారు. కాలువలో ఈత కొట్టే వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. నీటి ప్రవాహానికి ఎదురుగా ఈదడం చేయకూడదు. ముందుగా నీటి లోతును గమనించిన తర్వాతనే ఈత కొట్టేందుకు వెళ్లాలి. ప్రమాదకరంగా ఉందని అనుమానం వస్తే అటువైపు వెళ్లకుండా చూడాలి.

**నీట మునిగితే తీసుకోవలసిన జాగ్రత్తలు..**

ఈత సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోతే వారిని బయటకు తీయడంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నీటిలో మునిగిన వ్యక్తి తల వెంట్రుకలను పట్టి బయటకు తీసుకు రావాలి. బయటకు తీసుకువచ్చిన వెంటనే శ్వాస ప్రక్రియ సక్రమంగా ఉండేలా చూడాలి. ప్రధానంగా శ్వాస అందజేయాలి. ఈత సమయంలో మునిగిన పిల్లలు నీటిని తాగితే వారి పొట్టపై నెమ్మదిగా ఒత్తిడి చేయాలి. కుడి వైపునకు తిప్పి పడుకోబెట్టాలి. బాధితుడి నోటిలోకి గాలిని అందించే ప్రయత్నం చేయాలి. ఛాతిపై ఒత్తిడి చేసి సమస్య రాకుండా చూడాలి. నీట మునిగిన వారి శరీరం చల్లబడి ఉష్ణోగ్రత తగ్గే అవకాశం ఉంది. కాబట్టి వేడిగా ఉండే ప్రాంతానికి లేదా డాక్టర్ వద్దకు తీసుకువెళ్లాలి.

**నీళ్లలోకి దిగే ముందు ఇవి పాటించాలి..**

- ఈత కొట్టేందుకు నీళ్లలో దిగే ముందు ఎలాంటి ఆహారం తీసుకోవద్దు.
- ఒకవేళ ఏమైనా తీసుకుంటే గంట, రెండు గంటల అనంతరం ఈతకు వెళ్లాలి.
- ఈత కొట్టిన తర్వాత పండ్ల రసాలు తీసుకోవాలి.
- చెవి, ముక్కులో నీరు పోకుండా జాగ్రత్త తీసుకోవాలి.
- ఈత సమయంలో కళ్లకు ప్రత్యేక జాగ్రత్తలు అవసరం.
- ఈత కొట్టేందుకు వెళ్లే ముందు పిల్లలకు జాగ్రత్తలు వివరించాలి.




### వేసవికి విమానయాన
# పరిశ్రమ భారీ ప్లాన్..
### విమాన సర్వీసుల పెంపు



భారతీయ విమానయాన సంస్థలు వేసవి కాలం రద్దీ నేపథ్యంలో అదనపు సర్వీలు నడపడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ సర్వీసులు గత సంవత్సరంతో పోలిస్తే వారపు విమానాలలో 5.5 శాతం పెరుగుదల ఉందని పౌర విమానయాన శాఖ డైరెక్టరేట్ జనరల్ ఈ మేరకు స్పష్టం చేసింది.

డీసీసీఏ తెలిపిన వివరాల ప్రకారం 2025 మార్చి 30 నుంచి అక్టోబర్ 25 వరకు నడిచే వేసవి కాలంలో భారతీయ విమానయాన సంస్థలు 129 విమానాశ్రయాల నుంచి 25,610 వీక్లీ ఫ్లైట్స్‌ను నడుపుతాయని వివరించారు. ఫిబ్రవరి 2025లో జరిగిన స్లాట్ కాన్ఫరెన్స్ సమావేశం తర్వాత దేశీయ విమానయాన సంస్థ షెడ్యూల్ ఖరారు చేసింది.

సాధారణంగా వేసవిలో భారతీయ



విమానయాన సంస్థలు విమాన ట్రాఫిక్‌లో పెరుగుదల కనిపిస్తుంది. అయితే ఈ ఏడాది రద్దీకు అనుగుణంగా వారానికి 25,610 విమానాలు నడపాలను నిర్ణయం తీసుకున్నారు. గత సంవత్సరం వారానికి 24,275 ఫ్లైట్స్‌తో పోలిస్తే ఇది 5.5 శాతం ఎక్కువ. 129

నినాదం మార్కెట్

విమానాశ్రయా లలో విమానయాన సంస్థలు ప్రతిపాదించిన కొత్త విమానాశ్రయాలు ఉన్నాయని డీజీసీఏ పేర్కొంది. అంబికాపూర్, దాటియా, బీదర్, పోర్బందర్, పాక్యాంగ్, రేవా, సోలాపూర్ విమానాశ్రయాల నుంచి సర్వీసులు నడపనున్నట్లు వివరించింది. అయితే అజంగఢ్ మరియు రుప్సి విమానాశ్రయాల నుండి కార్యకలాపాలు 2025 వేసవి షెడ్యూల్‌లో నిలిపివేశారు.

ఇండిగో అత్యధిక సంఖ్యలో వీక్లీ డొమెస్టిక్ ఫ్లైట్స్‌ను డీజీసీఏ డేటా ద్వారా తెలుస్తుంది. 14,158 నిష్క్రమణలు షెడ్యూల్ చేసిందని, తర్వాత స్థానంలో ఎయిర్ ఇండియా (4,310), ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (3,375) ఉన్నాయని డీజీసీఏ పేర్కొంది. అలాగే స్పైస్‌జెట్ స్లాట్‌లు గత సంవత్సరం 1,657 నుంచి ఈ సంవత్సరం 1,240కు తగ్గాయి. అలయన్స్ ఎయిర్, ఫ్లైబిగ్ వంటి ప్రాంతీయ విమానయాన సంస్థలు షెడ్యూల్ చేసిన నిష్క్రమణలలో వరుసగా 41.96 శాతం,30.98 శాతం తగ్గుదలని నమోదు చేసిందని డీజీసీఏ పేర్కొంది. గత సంవత్సరం వేసవి షెడ్యూల్‌లో 20 ఎగ్జిట్లతో పోలిస్తే ఫ్లై 91 వంటి విమానయాన సంస్థలు 123 ఎగ్జిట్లను అనుమతిం చడంతో 515 శాతం గణనీయ మైన వృద్ధిని సాధించాయని డీజీసీఏ తెలిపింది.

### ఈ స్మార్ట్‌ఫోన్స్‌తో
# మరింత స్మార్ట్..
### రూ. 20వేల లోపు బెస్ట్ బ్రాండ్ స్మార్ట్ ఫోన్లు



మోటోరోలా ఎడ్జ్ 50 నియో.. ఈ స్మార్ట్ ఫోన్లో 6.4-అంగుళాల ఎల్టీపీఓ పీఓఎల్ఈడీ డిస్‌ప్లే ఉంది. ఇది 1.5కే రిజల్యూషన్, 120హెర్జ్ అడాప్టివ్ రిఫ్రెష్ రేట్, హెచ్డీఆర్10ం సపోర్ట్, 3,000 నిట్‌ల పీక్ బ్రైట్ నెస్ ను అందిస్తుంది. డిస్ప్లే కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3 ద్వారా షీల్డ్ చేసి ఉంటుంది. డాల్బీ అట్మోస్-బ్యాక్డ్ డ్యూయల్ స్టీరియో స్పీకర్లు మల్టీమీడియా అనుభవాన్ని మెరుగుపరుస్తాయి. మీడియా టెక్ డైమెన్సిటీ 7300 చిప్‌సెట్‌తో పనిచేస్తుంది. 8జీబీ ర్యామ్, 256జీబీ స్టోరేజ్‌తో జత చేసి ఉంటుంది. ఏఐ ఆప్టిమైజేషన్ ద్వారా మెరుగుపరచిన 8జీబీ వరకు వర్చువల్ ర్యామ్ ఎక్స్ టెన్షన్ను అందిస్తుంది. ఆండ్రాయిడ్14 పై నడుస్తుంది. ఫోటోగ్రఫీ ప్రియుల కోసం, మోటో ఎడ్జ్ 50 నియో ట్రిపుల్ రియర్ కెమెరా సెటప్‌తో వస్తుంది. ఇందులో ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ (ఓఐఎస్)తో కూడిన 50ఎంపీ ప్రైమరీ సెన్సార్, 13ఎంపీ అల్ట్రా-వైడ్-యాంగిల్ లెన్స్, 3%ఇ% ఆప్టికల్ జూమ్ సామర్థ్యం గల 10ఎంపీ టెలిఫోటో లెన్స్ ఉన్నాయి. ముందు భాగంలో అధిక-నాణ్యత సెల్ఫీల కోసం 32ఎంపీ కెమెరా ఉంది.

# లేట్ అయినా లేటెస్ట్‌గా.. ఆ ఓలా స్కూటర్ల డెలివరీలు షురూ!

**ఎస్1ఎక్స్ ప్లస్ ఇప్పుడు 11 కేడబ్ల్యూ గరిష్ట శక్తిని, 125 కిలోమీటర్ల గరిష్ట వేగంతో లాంచ్ చేశారు. ఈ స్కూటర్ 242 km వరకు ఐడీసీ పరిధిని కూడా కలిగి ఉంది.**

ఓలా ఎస్1 ఎక్స్ మూడు బ్యాటరీ ప్యాక్‌లతో అందుబాటులో ఉంటుంది. 2 కేడబ్ల్యూహెచ్, 3 కేడబ్ల్యూహెచ్, 4 కేడబ్ల్యూహెచ్ వేరియంట్స్‌లో కొనుగోలు చేయవచ్చు. ఈ స్కూటర్ గరిష్ట శక్తి 7 కేడబ్ల్యూకు పెరిగింది. ఈ



స్కూటర్ దీని గరిష్ట వేగం గంటకు 123 కి.మీ.

ఓలా ఎస్1ప్రో ప్లస్ కొత్త ఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ స్కూటర్. ఇది డ్యూయల్-ఛానల్ యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్, రిమ్ డెకాల్స్, డ్రై-కాస్ట్



గ్రాబ్ హ్యాండిల్, టూ టోన్ సీటు, 13 కేడబ్ల్యూ మోటారుతో వస్తుంది. ఈ స్కూటర్ గరిష్ట వేగం 141 కిలో మీటర్లుగా ఉంటే అలాగే ఈ స్కూటర్‌ను ఓ సారి చార్జ్ చేస్తే 320 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది.

ఓలా ఎస్1ప్రో 3 కేడబ్ల్యూహెచ్, 4 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో వస్తుంది. ఈ స్కూటర్‌ను ఓ సారి చార్జ్ చేస్తే 242 కి.మీ మైలేజ్ ఇస్తుంది. ఈ స్కూటర్ గరిష్ట వేగం గంటకు 125 కి.మీగా ఉంది. అలాగే ఓలా మూవ్ ఓస్ 5 బీటా కోసం ఆసక్తి ఉన్న కస్టమర్ల కోసం రిజిస్ట్రేషన్లను ప్రారంభించినట్లు ఓలా ఎలక్ట్రిక్ అధికారికంగా ప్రకటించింది. కంపెనీ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో పోస్ట్ ద్వారా ఈ ప్రకటన చేశారు. జెన్-1, జెన్-2 ఎలక్ట్రిక్ స్కూటర్లు రెండింటికీ బీటా సాఫ్ట్వేర్ అందుబాటులో ఉంది. అయితే కొత్తగా ప్రారంభించిన జెన్-3 3 ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇప్పటికే మూవ్ ఓఎస్-5తో వస్తుంది.

# ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ



**పెద్దపల్లి, మార్చి 26(నినాదం) :** ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ దిశగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎండల తీవ్రత దృష్ట్యా చేసుకోవాల్సిన చర్యలు, సీజనల్ వ్యాధులు నియంత్రణ ప్రణాళికపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ మాట్లాడుతూ,రాష్ట్రం లోనే అత్యధికంగా ఉష్ణోగ్రతల దృశ్య జిల్లాలలో పెద్దపల్లి మూడవ స్థానంలో ఉందని , ప్రజలు వడ గాల్పుల బారిన పడకుండా అవసరమైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఎండ తీవ్రత వల్ల శరీరంలో నీటి శాతం తక్కువైతే ప్రజలకు వడ దెబ్బ తగిలే అవకాశం అధికంగా ఉంటుందని, మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండడం ఉత్తమమని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పనుల పని వేళలు మార్చాలని అన్నారు.

ఆశా కార్యకర్తల నుంచి జిల్లా అధికారుల వరకు ప్రతి ఒక్కరి వద్ద అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. జిల్లాలో జరిగే వివిధ పంట కొనుగోలు నేపథ్యంలో రైతులకు, హమాలీ కూలీలకు, అక్కడి సిబ్బందికి వడదెబ్బ తగలకుండా ఏర్పాట్లు ఉండాలని, అవసరమైన టెంట్, త్రాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకేట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు.నీటి పారుదల శాఖ, పంచాయతీ, వివిధ శాఖల కింద జరిగే పనులు దగ్గర కార్మికులకు వడదెబ్బ తగలకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని అన్నారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో చల్లి వేంద్రం ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. వేసవి కాలంలో వడగాల్పుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు.వడ గాల్పుల వల్ల వచ్చే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. వేసవి కాలంలో ప్రతి రోజు నీరు త్రాగడం, గొడుగు తీసుకుని బయటికి రావడం, వేడి గాల్పులు వచ్చే సమయంలో ఇంట్లో ఉండటం వంటి వివిధ అంశాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు అధికంగా ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. గతంలో అధికంగా జ్వరం కేసులు నమోదైన ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. నీరు నిల్వ ఉండకుండా గుంతలు పూడ్చి వేత కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఇంటిలో పాత కూలర్లు టైర్ల లో నీటి నిల్వలను తీసి వేయాలని అన్నారు. గ్రామాలలో రెగ్యులర్ ఫాగ్గింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని, జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్



**పెద్దపల్లి,మార్చి26(నినాదం) :** పెద్దపల్లి పట్టణంలోని వార్డులలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ పలు వార్డులో బుదవారం పర్యటించారు.ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ప్రతిరోజు రెండు వార్డులలో శానిటేషన్ డ్రైవ్ చెయ్యడం జరుగుతుందని తెలిపారు.ప్రతిరోజు వార్డులో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది,చెత్త ఆటో రిక్షా,చెత్త ట్రాక్టర్లు వస్తున్నప్పటికి వార్డు ప్రజలు చెత్తను,ప్లాస్టిక్ కవర్లు,సీసాలు మురికాలువలో పడివేస్తున్నారని వాటి వల్ల మురికినీరు వెళ్లకుండా మీఇంటి ముందే నీరు నిలిచి దోమలు ఏర్పడి రోగాల బారిన పడతారని అన్నారు. దయచేసి పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించి చెత్త రిక్షాలకు చెత్తను,ప్లాస్టిక్ కవర్లను,సీసాలను వేరుచేసి అందజేయాలని సూచించారు.అలాగే అమర్ నగర్ నుండి పెద్దమజిద్ వరకు జరుగుతున్న అమృత్ 2 పైప్ లైన్ పనులను ఏఈ సతీష్ తో కలిసి పరిశీలించారు.పైప్ లికేజ్ పనులను త్వరగా పూర్తి చేసి పట్టణప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలని వాటర్ సప్లై అధికారులను ఆదేశించారు. ఏఈ సతీష్, వార్డు ఆఫీసర్ సుధీర్,వర్క్ ఇన్స్పెక్టర్ బండి అనిల్ కుమార్,మున్సిపల్ సిబ్బంది బొంగోని అనిల్,వునుకొండ మధు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు

- మంథని ఎస్ఐ డీ.రమేష్



**మంథని మార్చి 26( నినాదం న్యూస్) :** మద్యం సేవించి వాహనాలు నడిపిత కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ డి. రమేష్ అన్నారు. బుదవారం రాత్రి స్థానిక పాత పెట్రోల్ పంపు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కాకూడద న్నారు. వాహనాలకు సంభం దించిన అన్ని ధృవీకరణ పత్రాలు వెంట ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సంధర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని బ్రీత్ ఎనలైజార్ ద్వారా పరీక్షించి కేసులు నమోదు చేశారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. అలాంటి వాహనాలు ఎవరైనా నడిపితే చీటింగ్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బొంకూరి సురేందర్ సన్నిపై..

## పెట్టిన కరోనా కేసు కొట్టివేత

- న్యాయమే గెలిచింది



**పెద్దపల్లి, మార్చి 26 (నినాదం):** బొంకూరి సంతోష్ బాబ్జి వాదోప వాదనలు విన్నా మీదట బొంకూరి సురేందర్ సన్ని పై అక్రమంగా నమోదు చేసిన కరోనా (నేషనల్ డిజాస్టర్) కేసు పై బుధవారం జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అఫ్ ఫస్ట్ క్లాస్ పెద్దపల్లి జడ్జి కొట్టివేస్తూ తీర్పు చెప్పారు.కేసును వాదించిన ప్రముఖ న్యాయవాది సంతోష్ బాబ్జీ కి సురేందర్ సన్ని కృతజ్ఞతలు తెలియ జేశారు.

## మత్స్య కార్మికుల సంఘం డైరీ ఆవిష్కరణ



**ధర్మారం, మార్చి26(నినాదం న్యూస్) :** తెలంగాణ మత్స్యకారుల కార్మికుల రాష్ట్ర కమిటీ డైరీ ఆవిష్కరించిన జిల్లా మత్స్యశాఖ అధికారి నరేష్ నాయుడు. ఈ కార్యక్రమంలో మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్లారం రమేష్ ధర్మారం మండల గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుమ్మల నరసయ్య పెద్ద కల్వల గంగపుత్ర సంఘం అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాస్ గంగపుత్ర సంఘం నాయకులు ఏంపల్లీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నోరు తెరుచుకున్న ప్రమాదం..

## అదుపు తప్పితే అదే 'గోతి'



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 26 (నినాదం న్యూస్):** ఇది మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో జాతీయ రహదారిపై పెద్ద గుంత ఏర్పడింది. వర్షం పడితే వర్షం నీరు నిలిచి ప్రమాదకరంగా మారుతుంది. వాహనదారులుకు గుంత తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ఏమరుపాటుగా వెళ్తే వాహనాల ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. అధికారులు స్పందించి గుంతకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

## జాతీయ స్థాయి క్రీడా పోటీలకు కల్వకుర్తి గురుకుల విద్యార్థులు

- అభినందించిన ప్రిన్సిపల్ డాక్టర్ నాగమణి, ఫిజికల్ డైరెక్టర్ సిందూజ



**వనపర్తి ప్రతినిధి, మార్చి 26 (నినాదం న్యూస్) :** జాతీయ స్థాయి క్రీడా పోటీలకు కల్వకుర్తి మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 15,16 తేదీల్లో తెలంగాణ లోని హన్మకొండలో జరిగిన సీనియర్ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ పోటీల్లో అత్యున్నత ప్రతిభ కనబరిచిన మమత, జాహ్నవి (9వ తరగతి) శ్రీనిధి ( 8వ తరగతి) ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సింధూజ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వీరు ఈనెల 26 నుంచి 29 వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ నగరంలో జరిగే జాతీయ స్థాయి సీనియర్ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్. టి.నాగమణి, ఫిజికల్ డైరెక్టర్ సింధూజ, సిబ్బంది అభినందించారు

## సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా పటిష్ట చర్యలు

- కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన
- ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేయాలి
- ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో రివ్యూ
- అదనపు కలెక్టర్ డీ.వేణు



**పెద్దపల్లి, మార్చి26(నినాదం) :** యాసంగి సీజన్ జిల్లాలో సజావుగా ధాన్యం కొనుగోలు జరిగేలా పటిష్ట కార్యాచరణ రూపొందించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో అదనపు కలెక్టర్ డి.వేణు ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోళ్ళు ప్రారంభించేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక సదుపాయాలు ఉండాలని అన్నారు. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోళ్ళు నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేయాలని, ఎట్టి పరిస్థితులలో కేటాయించని రైస్ మిల్లులకు ధాన్యం సరఫరా చేయరాదని అలా చేసిన యెడల వారిపై కఠిన చర్యలు తీసుకోబడ తాయని తెలిపారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటి కప్పుడు ఆన్ లైన్ ఓపిఎంఎస్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఓపిఎంఎస్ ట్యాబ్ లను సీజన్ ప్రారంభం ముందే చెక్ చేసుకొని ఉంచుకోవాలని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వచ్చే ధాన్యం అంచనా ప్రకారం అవసరమైన వెయింగ్ యంత్రాలు,తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్,గన్ని సంచులు మొదలైన మౌలిక వసతులు ఉండేలా చూడాలని అన్నారు.వేయింగ్ యంత్రాలను తేమ యంత్రాల పని తీరు చెక్ చేసి సర్టిపై చేయాలని అన్నారు.త్రాగు నీరు,విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకో వాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా త్రాగునీటి సరఫరా ప్రత్యేక దృష్టి సారించాలని,చల్లని త్రాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని,అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకేట్లు పెట్టుకోవాలని అన్నారు.వడదెబ్బ తగిలితే వారికి ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాటు చేయాలని అన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన టెంట్ల ను ఏర్పాటు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్,జిల్లా మేనేజర్ పౌరసరఫరాలు శ్రీకాంత్, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇటుక బట్టీల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

- పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బీ.గంగయ్య



**పెద్దపల్లి, మార్చి 26(నినాదం) :** ఇటుక బట్టీల నిర్వహణలో నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య అన్నారు.బుధవారం పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య పెద్దపల్లి పట్టణంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో ఇట్టుక బట్టీల ఓనర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇటుక బట్టీల ఓనర్లతో సంబంధిత శాఖ అధికారులు అవగాహన సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వ నిబంధనలు, ఉత్తర్వులు, ఇటుక బట్టీల నిర్వహణలో పాటించాల్సిన విధి విధానా లపై అవగాహన కల్పించారు. పెద్దపల్లి డివిజన్ లో ఉన్న ఇటుక బట్టీల ఓనర్లు ప్రభుత్వ నియమ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, జిల్లా పరిశ్రమల అధికారి , మైనింగ్ శాఖ ఉప సంచాలకులు, లేబర్ అధికారి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం

- మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ



**మంథని టౌన్ మార్చి 26 (నినాదం న్యూస్) :** మంథని మండల పరిషత్ కార్యాల యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ అధ్యక్షతన బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు, గ్రామాలలో మంచినీటి సరఫరా పై ప్రణాళిక, నర్సరీల నిర్వాహణ,వృద్యాప్య పెన్షన్ల లో చనిపోయిన ఫించను దారుల జాబితాను సమర్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు . అలాగే డి ఎల్ పి ఓ కే. సతీష్ కుమార్ 3 రోజులలో ఇంటి పన్నుల టాక్స్ 100 వసూలు చేయాలి అని , 31 మార్చి లోపు ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తు దారుల నుండీ రుసుముల చెల్లింపులు పూర్తి చేయాలాన్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి సెగ్రిగేషన్ షెడ్డు కి వెళ్లి కంపోస్టు తయారీ,చెత్త సేకరణ జరుగుతున్న విధానాన్ని పరిశిలించాలని, ట్రేడ్ లైసెన్స్ రెనివల్ 31 మార్చి లోపు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు .ఈసమావేశములో ఎం పి ఓ శేషయ్య సూరి, ఏ ఈ శ్రీదర్, వరప్రసాద్,మంథని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు

- హిందూ ముస్లిం సోదరులు ఉగాది, రంజాన్ పండుగలు సోదరభావంతో జరుపుకోవాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి





**వనపర్తి ప్రతినిధి, మార్చి 26 (నినాదం న్యూస్) :** మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులని హిందూ ముస్లిం సోదరులు ఉగాది రంజాన్ పండుగలు సోదర భావంతో జరుపుకోవాలని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా మాజీ ఎం.పి రావుల చంద్రశేఖరరెడ్డి వనపర్తి జిల్లా కేంద్రంలోని అన్ని మజీదులను బుధవారం తిరిగి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ ఇఫ్తార్ విందులో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జామ మజీద్ నందు ముస్లిం పెద్దలతో రావులతో కలసి ప్రార్ధనలు చేసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని, రాబోవు ఉగాది, రంజాన్ పండుగలు హిందూ ముస్లిం సోదరులు ఐక్య మత్యంతో ప్రశాంతంగా పండుగలు సోదరభావంతో జరుపుకోవాలని అన్నారు. అనంతరం ఇద్దరు నేతలు కలసి హనుమాన్ టేకిడి నందు చిరు వ్యాపారి దగ్గర బజ్జీలు, పునుగులు కొనుగోలు చేసి నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు పంచి కనువిందు చేశారు. ఆహ్లాదకర వాతావరణంలో ఇఫ్తార్ విందు ముగించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, సర్దార్ ఖాన్, గులాం ఖాదర్ ఖాన్, జోహేబ్ హుస్సేన్, మాజీ కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్న యాదవ్, లక్ష్మీనారాయణ, నాయకులు ఉంగ్లం తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, ఫజల్, స్టార్ రహీమ్, సయ్యద్ జమీల్, నందిమల్ల రమేష్, ఎండి.గౌస్, ఆరీఫ్, పాషా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని

## సన్మానించిన నేతలు



**వనపర్తి ప్రతినిధి, మార్చి 26 (నినాదం న్యూస్) :** గోపాల్ పేట మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని బుధవారం ధర్మసమాజ్ పార్టీ, బీజేవైఎం నాయకులు సన్మానించారు. గోపాల్ పేట్ మండల కేంద్రంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీ కార్యవర్గాన్ని జిల్లా ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ, బీజేవైఎం మండల అధ్యక్షుడు శివ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ధర్మ సమాజ్ పార్టీ, బీజేవైఎం కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్న మీడియా జర్నలిస్టులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మండల అధ్యక్షుడు గంధం నాగరాజు, సోషల్ మీడియా ఇన్చార్జ్ లక్ష్మణ్, కోశాధికారి కిరణ్, తారక్, చందు, రాముడు, బీజేవైఎం నాయకులు, జర్నలిస్టులు ప్రవీణ్ కుమార్, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ నాయుడు, అనిల్ కుమార్, బాల్ రాం, రాధాకృష్ణారెడ్డి, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు

నవోదయలో సత్తా చాటిన


## విశ్వదీప్తి స్కూల్ విద్యార్థులు



**మల్హార్, మార్చి 26 (నినాదం):** ఇటీవల నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో మల్హార్ మండలం కొయ్యూ ర్‌లోని విశ్వదీప్తి విద్యా ర్థులు సత్తా చాటారు. విశ్వ దీప్తి పాఠశా లలో ఐదో తర గతి చదువు తున్న గట్టు సాయి, మణి దీపిక, డి. శరణ్య, అనే విద్యా ర్థినిలు అత్యంత ప్రతి భను కనబరిచి నవోదయలో సీట్లు సాధిం చారు. పట్టణ ప్రాంతా ల్లోని ప్రైవేటు పాఠశా లలకు దీటుగా గ్రామీణ ప్రాంతంలో నిర్వహిస్తున్న విశ్వదీప్తి పాఠశాల నుండి నవోదయకు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.కె సుదర్శనన్, వైస్ ప్రిన్సిపాల్ మెర్సీ వర్గిస్, స్కూల్ యాజమా న్యాన్ని మండల ప్రజలు అభినందించారు. నవోదయలో సీటు సాధించిన గట్టు సాయి, మణిదీపిక, డి.శరణ్యలను పాఠశాల ఉపాధ్యాయులు , గ్రామ ప్రజలు అభినందించారు.

## సన్న బియ్యం పంపిణీ సక్రమంగా నిర్వహించాలి

- ఆర్డీవో సూర్యనారాయణ



**కోదాడ, మార్చి 26 (నినాదం న్యూస్):** స్థానిక ఆర్డిఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి డీలర్ల సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేసినారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుండి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినారు.కావున ప్రతి ఒక్క డీలర్లు సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు చేరవేయడంలో ఎలాంటి అవకతవకలు లేకుండా సక్రమంగా పంపిణీ నిర్వహించాలని అన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగిన అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాజిద్ అలీ,సివిల్ సప్లై డిటి రాంరెడ్డి,డీలర్ల సంఘం డివిజన్ అధ్యక్షులు సాగర్ల శివరాం,జిల్లా సెక్రటరీ తీగల అశోక్ కుమార్,ఐదు మండలాల అధ్యక్షులు,సెక్రటరీలు,డీలర్లు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- ప్రభుత్వ భూములలో ఆక్రమణల తొలగింపునకు చర్యలు
- పురపాలక భవన పనులు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలి
- మంథని, ముత్తారం మండలాల్లో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**మంథని మార్చి 26( నినాదం న్యూస్):** రెవెన్యూ అధికారులు విధులలో నిర్లక్ష్యం వహించద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం మంథని, ముత్తారం మండలాలలో విస్తృతంగా పర్యటించారు. రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం, నిర్మాణం అవుతున్న నూతన పురపాలక భవన పనులను, ముత్తారం మండలం ధర్యాపూర్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలను, వసతి గృహం, అక్కడ ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి 163 జీ కింద ముత్తారం మండలం లక్కారం గ్రామంలో సేకరించిన భూములలో ఉన్న నిర్మాణాలకు సంబంధించిన నగదు నిర్వాసితులకు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. బోరు బావులు, చెట్లు, ఇతర నిర్మాణాలకు పరిహార నిధులు ప్రతిపాదనలను సంబంధిత అధికారులు వెంటనే జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ కు పంపి త్వరగా మంజూరు అయ్యేలా చూడాలని తెలిపారు. డివిజన్ పరిధిలో భూ శుద్ధీకరణ సమయంలో జరిగిన తప్పుల సరి చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చెరువుల ఎఫ్టిఎల్ బఫర్ జోన్ పరిధి సర్వే నిర్వహించాలని ఆయన ఆదేశించారు. చెరువు భూములలో ఆక్రమణలు ఎక్కడైనా జరిగితే వెంటనే రికవరీ చేయాలన్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూములకు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. మంథని పట్టణంలో నిర్మాణం అవుతున్న నూతన పురపాలక భవనం పనులు నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా ధర్యాపూర్ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని సందర్శించి పిల్లల డార్మెంటరీ, భోజనశాల, వంటగది పరిశీలించారు. ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ముత్తారం మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ భూ సేకరణ పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ఆన్లైన్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట మంథని రెవెన్యూ డివిజన్ అధికారి సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మంథని తహసిల్దార్ గిరి, ముత్తారం ఎంపీడీవో సురేష్, ఎంపీఓ గోవర్ధన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 28న ఆర్మీ అభ్యర్థులకు ఉచిత శిక్షణకై ఎంపిక

- కలెక్టర్ కోయ శ్రీ.హర్ష



**పెద్దపల్లి, మార్చి26 (నినాదం) :** మార్చి 28న ఆర్మీ రిక్రూట్మెంట్ లో రాత పరీక్షకు మరియు ఫిజికల్ టెస్టుకు ఉచిత శిక్షణ అందించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులకు ఫిజికల్ మెడికల్ టెస్ట్ నిర్వహించ బడుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ. హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువతను ఉద్యోగులుగా తీర్చిదిద్దాలని సంకల్పంతో సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి స్టేడియంలో ఆర్మీ అభ్యర్థులకు ఉచిత దేహదారుఢ్య, మెడికల్, వ్రాత పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఉచిత రాత పరీక్షకు సంబంధించిన మరియు శరీర దారుఢ్యము కి సంబంధించిన శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మార్చి 28న అర్హత కలిగిన అభ్యర్థులకు ఉచితంగా ఫిజికల్ టెస్ట్, మెడికల్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించాలని, వయసు 17 సంవత్సరాల 6నెలల నుంచి 21 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అభ్యర్థులు అర్హులని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు నేరుగా స్టేడియం కి వచ్చి పరీక్షలో పాల్గొనవచ్చును కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మహిళా మార్ట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలి

- ఓపెన్ స్పేస్‌లో పార్కింగ్‌తో పాటు రిటైల్ బిజినెస్ ఏర్పాటు
- మహిళా మార్ట్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం, మార్చి26( నినాదం న్యూస్ ):** మహిళా మార్ట్ ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సీక్వెల్ రోడ్డులోని మహిళా మార్ట్ ఏర్పాటు చేయు భవనం వద్ద పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తో కలిసి పరిశీలించి, చేయవలసిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళా మార్ట్ ముందు భాగంలో ఉన్న ఓపెన్ స్పేస్ లో పార్కింగ్ సౌకర్యం కల్పించాలని, ఓపెన్ స్పేస్ లో టైల్స్ వేసి రిటైల్ బిజినెస్ క్రింద ఫుడ్, టీ స్టాల్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మహిళా మార్ట్ వద్ద గ్లాస్ ఎంట్రీ ఏర్పాటు చేయాలని అన్నారు. మహిళా మార్ట్ నిర్వహణ కట్టుదిట్టంగా ఉండాలని, నీట్ గా మెయింటైన్ చేయాలని కలెక్టర్ తెలిపారు. మహిళా మార్ట్ లో పెట్టే వస్తువుల స్టాక్ నిల్వలు పకడ్బందీగా భద్రపరిచేందుకు ఏర్పాట్లు ఉండాలని అన్నారు. మహిళా మార్ట్ లో పనిచేసే సిబ్బందికి లంచ్ రూమ్, ఇతర వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళా మార్ట్ లో బిల్లింగ్ విధానం, స్టాకింగ్ తదితర అంశాలపై మహిళలకు శిక్షణ అందించాలని, డి-మార్ట్ విధానంలో ఇక్కడ బిల్లింగ్ వ్యవస్థ ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మహిళా మార్ట్ వద్ద ఎల్.ఈ.డి లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ఖమ్మం జిల్లా బ్రాండింగ్ వచ్చేలా లోగో, స్టిక్కరింగ్ డిజైన్ తయారు చేయాలని, ప్రైవేట్ షాపింగ్ మాల్స్ లో అనుసరిస్తున్న మోడల్ లను పరిశీలించి మహిళ మార్ట్ ప్రత్యేకతగా ఉండేలా తయారు చేయాలని, మహిళా మార్ట్ ను వ్యాపార దృక్పథంతో లాభాలు వచ్చే విధంగా నడపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సన్యాసయ్య, అడిషనల్ డి.ఆర్డీఓ నూరోద్దీన్, పంచాయతీ రాజ్ ఈఈ వెంకట్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అట్రాసిటీ కేసుల్లో బాధితులకు న్యాయం అందించాలి

- విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, మార్చి 26(నినాదం న్యూస్) :** ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు వీలైనంత త్వరగా న్యాయం అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసుల నమోదు, పురోగతి, బాధితులకు చెల్లించాల్సిన పరిహారం తదితర అంశాలపై జిల్లాస్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జరిగింది. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నమోదైన అట్రాసిటీ కేసులు, పరిష్కరించిన కేసులు, బాధితులకు అందిన పరిహారం గురించి కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కేసు పూర్వాపరాలను పరిశీలించి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే విధంగా అధికారులు చర్య తీసుకోవాలని అన్నారు. కేసుల్లో భాగంగా అవసరమైన కుల ధ్రువీకరణ పత్రం వీలైనంత త్వరగా జారీ చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానిటరింగ్ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చింతకుంటలోని అంబేద్కర్ భవనాన్ని వినియోగం లోకి తీసుకురావాలని, భగత్ నగర్లో కేటాయించిన స్థలానికి ప్రహరీ గోడ నిర్మించాలని సభ్యులు కోరారు. కోర్టు చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం కూడలి శుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ అంశాలను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో ఎస్సీ ఎస్టీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ సభ్యులకు కోరగా ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల విషయంలో త్వరిత గతిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎఫ్ఐఆర్, చార్జిషీట్, పరిష్కారం అయిన కేసులు, విచారణలో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను సంవత్సరం వారీగా వెల్లడించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేష్, డిటిడిఓ జనార్ధన్, బీఎండబ్ల్యూ పవన్ కుమార్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, ఏసిపి వెంకటస్వామి పాల్గొన్నారు.

NINADAM CINEMA

# ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారు

**- భార్య హెల్త్‌పై అప్‌డేట్ చెప్పిన సోనూసూద్**



బాలీవుడ్ స్టార్ నటుడు, రియల్ హీరో సోనూ సూద్ భార్య సోనాలి సూద్ రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం నాగ్‌పూర్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో తన భార్య సోనాలిసూద్ ఆరోగ్యంపై సోనూసూద్ తాజాగా స్పందించారు. ఈ మేరకు హెల్త్ అప్‌డేట్ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన తన భార్య, మరో ఇద్దరు కుటుంబ సభ్యులు కోలుకుంటున్నట్లు చెప్పారు. వాళ్లు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా సోనూసూద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. కాగా, సోనాలి సూద్ తన సోదరి, సోదరి కుమారుడితో కలిసి సోమవారం రాత్రి కారులో ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో ముంబై నాగ్‌పూర్ సమృద్ధి హైవేపై వీరి కారు ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సోనాలి, ఆమె సోదరి కుమారుడికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఆమె సోదరి మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సోనాలి, ఆమె సోదరి కుమారుడు ప్రస్తుతం నాగ్‌పూర్‌లోని మ్యాక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదంలో వారి కారు పూర్తిగా దెబ్బతిన్నది.

# ఒక్క ఏడాదిలో భాగ్యశ్రీ బోర్సే మూడు సినిమాలు



మాస్ మాహారాజా రవితేజ నటించిన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అయ్యింది. కానీ ఈ బ్యూటీ మాత్రం స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. తెలుగులో చేసిన ఒక్క సినిమా నిరాశపరిచింది కానీ... ఈ అమ్మడు స్పీడ్ మాత్రం మాములుగా లేదు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ చూస్తుండగానే స్టార్ బ్యూటీలను వెనక్కు నెట్టేస్తోంది. ప్రస్తుతం ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అవుతోంది ఈ బ్యూటీ. ఫస్ట్ సినిమాతోనే యాక్టింగ్, గ్లామర్ పరంగా మంచి మార్కులే కొట్టేసిన ఈ వయ్యారి.. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ సరసన కాంత సినిమాలో నటిస్తుంది. అలాగే విజయ్ దేవరకొండ జోడిగా కింగ్ డమ్ మూవీ చేస్తుంది. ఇవే కాకుండా తెలుగులో మరిన్ని ఆఫర్స్ కొట్టేసింది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేనితో కలిసి కొత్త ప్రాజెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ ఏడాదిలోనే ఏకంగా మూడు సినిమాలో అడియన్స్ ముందుకు రానుంది ఈ వ్యయారి. కింగ్ డమ్ సినిమాలో మేలో రిలీజ్ కానుంది. రామ్ పోతినేనితో చేస్తోన్న సినిమా షూటింగ్ వేగంగా జరుగుతుంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే నటిస్తోన్న కాంత మూవీ ఈ ఏడాది చివర్లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే మూడు సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేయనుంది.




# ఆ అందానికి ఎవరైనా ఫిదా అవ్వాలిందే..!



యంగ్ బ్యూటీ శ్రీలీల గురించి ఎంత చెప్పినా తక్కవే. ఈ నటి తన అందంతో ఎంతో మంది మదిని దోచింది. పెళ్లిసందడి సినిమాతో తెలుగు వెండితెరపైకి అడుగు పెట్టి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. అంతే కాకుండా మొదటి సినిమాతోనే మంచి ఫ్యాన్ బేస్ సొంతం చేసుకుంది ఈ నటి. ఈ మూవీ తర్వాత శ్రీలీలకు వరసగా ఆఫర్స్ క్యూ కట్టాయి. ముఖ్యంగా రవితేజ ధమాక సినిమాతో మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఈ సినిమాలో ఈ అమ్మడు డ్యాన్స్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. ఇక ఈ సినిమా తర్వాత శ్రీలీల గుంటూరు కారం, స్కంద, భగవంత్ కేసరి, ఎక్స్ టాఆర్డినరీ బ్యాన్ ఇలా వరస సినిమాలు చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మకు అదృష్టం మాత్రం కలిసి రాలేదనే చెప్పాలి. వరసగా ఆఫర్స్ వచ్చినా అవి బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ అవ్వడంతో ఒక్కసారిగా శ్రీలీల క్రేజ్ తగ్గిపోయింది. దీంతో అవకాశాలు కూడా అంతగా లేకపోవడంతో ఈ అమ్మడు కాస్త సైలెంట్ అయ్యింది. పుష్ప 2 సినిమాలో కిసక్కీ అంటూ తన డ్యాన్స్ గ్లామర్‌తో తెలుగు అభిమానులను పలకరించిన శ్రీలీల మరోసారి రాబిన్ హుడ్ మూవీ ద్వారా థియేటర్లో సందడి చేయడానికి రెడీ అయిపోయింది. అయితే తాజాగా ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న శ్రీలీల స్కైబ్లూ కలర్ చీరలో కనిపించి స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. ఈ శారీలో ఈ ముద్దుగుమ్మ అందాలను చూస్తే ఎవ్వరైనా సరే ఫిదా అవ్వాల్సిందే. అంతలా తన గ్లామర్‌తో ఆకట్టుకుంది కిసక్కీ బ్యూటీ. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఇక ఈ ఫొటోస్ చూసిన నెటిజన్స్ నీలిరంగు చీరలో చందమామలా చాలా అందంగా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# ఓటీటీలో దుమ్ము రేపుతున్న గేమ్‌ఛేంజర్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం గేమ్ ఛేంజర్. దిగ్గజ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్‌ను అందుకుంది. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ సినిమా కావడంతో మెగా అభిమానులు భారీ నమ్మకం పెట్టుకున్నారు. అయితే శంకర్ అదే పాత స్టోరీతో ప్రేక్షకుల ముందు రావడంతో భారీ నష్టాన్ని చవి చూసింది. రూ.450 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రాగా దాదాపు రూ.150 కోట్ల నష్టం వచ్చినట్లు సమాచారం. అయితే ఈ సినిమా ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న విషయం తెలిసిందే. తెలుగుతో పాటు తమిళ, కన్నడ భాషల్లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. అయితే తాజాగా ఈ మూవీ హిందీ వెర్షన్‌ని జీ5 ఓటీటీ వేదిక మార్చి 07న విడుదల చేసింది. హిందీ వెర్షన్ ఓటీటీలోకి వచ్చిన తొలిరోజు నుంచే ఈ సినిమా టాప్ టెన్‌లో దూసుకుపోతుంది. ఈ చిత్రం హిందీలో ఇప్పటివరకూ 250 మిలియన్ మినిట్స్‌కు పైగా వ్యూస్ సాధించినట్లు జీ5 ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రామ్‌నందన్ (రామ్‌చరణ్) విశాఖ కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకుంటాడు. ఇదే సమయంలో అభ్యుదయ పార్టీ నాయకుడు, ముఖ్యమంత్రి సత్యమూర్తి (శ్రీకాంత్) పదవీకాలం మరో ఏడాదిలో ముగుస్తుంది. సత్యమూర్తి కొడుకు బొబ్బిలి మోపిదేవి (ఎస్.జె.సూర్య) ముఖ్యమంత్రి కుర్చీపై కన్నేస్తాడు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741